www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 140

గురువారం | 4-9-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి తె.4.08 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా.11.44 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ.7.20-8.58, తె.3.43-5.18; దుర్ముహూర్తం: ఉ.10.11-11.00, మ.3.06-3.55; అమృతఘడియలు: సా.5.10-6.48; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.22

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జీఎస్టీలో వినూత్న సంస్కరణలు తీసుకువస్తామని ప్రధాని మోదీ స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. ఈ సంస్కరణలు కేవలం పన్ను రేట్ల హేతుబద్ధీకరణ మాత్రమే కాదు.. పేదలు, మధ్యతరగతి వారికి ఉపశమనం కలిగించేలా, సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహించేలా ఉండటమే లక్ష్యం.

- నిర్మలా సీతారామన్

వైద్య ఆరోగ్య రంగం	ప్రస్తుతం	తగ్గిన తర్వాత
థర్మామీటర్లు	18%	5%
మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్	12%	5%
డయాగ్నొస్టిక్ కిట్లు, పరికరాలు	12%	5%
గ్లూకోమీటర్, టెస్ట్ స్ట్రిప్స్	12%	5%
కళ్లజోళ్లు	12%	5%

ఎలక్ట్రానిక్ ఉపకరణాలు	ప్రస్తుతం	తగ్గిన తర్వాత
ఏసీలు, టీవీలు, వాషింగ్‌మెషిన్లు, మానిటర్లు, ప్రొజెక్టర్లు	28%	18%
వ్యవసాయ రంగం		
ట్రాక్టర్ విడిభాగాలు, టైర్లు	18%	5%
ట్రాక్టర్లు	12%	5%

జీఎస్టీ తగ్గింపు ఇలా..

నిత్యావసర వస్తువులు	ప్రస్తుతం	తగ్గిన తర్వాత
తల నూనెలు, షాంపూలు, టూత్‌పేస్టులు, టూత్ బ్రష్‌లు, షేవింగ్ క్రీమ్‌లు, సబ్బులు	18%	5%
వెన్న, నెయ్యి, చీజ్, డెయిరీ స్ప్రెడ్‌లు	12%	5%
ప్రీప్యాక్డ్ నమ్కీన్, భుజియా, మిక్చర్‌లు	12%	5%
ఫీడింగ్ బాటిళ్లు, బేబీ న్యాప్‌కిన్లు, డైపర్లు	12%	5%
కుట్టు మిషన్లు, వాటి విడిభాగాలు	12%	5%
ఆటోమొబైల్ రంగం		
పెట్రోల్, పెట్రోల్-హైబ్రిడ్, ఎల్పీజీ, సీఎన్‌జీ కార్లు (1200సీసీ, 4000ఎంఎంలోపు)	28%	18%
డీజిల్, డీజిల్-హైబ్రిడ్ కార్లు (1500సీసీ, 4000ఎంఎంలోపు మాత్రమే)	28%	18%
త్రిచక్ర వాహనాలు	28%	18%
350 సీసీలోపు ఉండే మోటారు సైకిళ్లు	28%	18%
రవాణా వాహనాలు	28%	18%
విద్యారంగం		
మ్యాపులు, చార్టులు, గ్లోబులు	12%	0%
పెన్సిళ్లు, షార్ప్‌నర్‌లు, క్రెయాన్‌లు	12%	0%
వర్క్‌బుక్‌లు, నోట్‌బుక్స్	12%	0%
ఎరేజర్లు	5%	0%







ముందే పండుగ!

22వ తేదీ నుంచే తగ్గనున్న నిత్యావసరాల ధరలు.. పేదలు, మధ్య తరగతికి గణనీయంగా ఊరట

- జీఎస్టీ సంస్కరణలకు కౌన్సిల్ పచ్చజెండా
- ఇప్పుడున్న నాలుగు శ్లాబులు రెండు శ్లాబులకు కుదింపు
- జీవిత, ఆరోగ్య బీమాపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేత
- 33 రకాల అత్యవసర ఔషధాలపైనా పన్ను జీరో
- ఇతర అన్ని మందులపై పన్ను 5 శాతానికి తగ్గింపు
- సిమెంట్‌పై పన్ను 10% తగ్గింపు.. యథాతథంగా ఫోన్ల ధరలు
- టీవీలు, ఫ్రిడ్జ్‌లు, వాషింగ్ మెషిన్లు 28 నుంచి 18 శాతానికి
- కార్లపై రూ.75 వేల నుంచి లక్షన్నర దాకా ఊరట
- లగ్జరీ కార్లపై రూ.10 లక్షల వరకు ఆదా
- స్కూటర్లపై 10 వేల దాకా.. బైక్‌లపై 13 వేల దాకా..
- రూ.2,500 దాటిన వస్త్రాలు, పాదరక్షల ధరలు పెరిగే చాన్స్

దేశంలో దసరా, దీపావళికి ముందే పండుగ వస్తోంది. పండుగ సరుకులన్నీ అతి తక్కువకే అందివస్తాయి. పాలు, పనీర్, బిస్కెట్లు, సబ్బులు, షాంపూల నుంచి ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, చిన్న కార్లు, బైకుల దాకా ధరలు దిగొస్తాయి. ఆరోగ్య, జీవిత బీమా మరింత చేరువవుతుంది. దసరా నవరాత్రులు ప్రారంభమయ్యే ఈ నెల 22వ తేదీ నుంచి జీఎస్టీ (వస్తుసేవల పన్ను) సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలోని జీఎస్టీ కౌన్సిల్ బుధవారం పచ్చజెండా ఊపింది. ప్రస్తుతమున్న నాలుగు శ్లాబులు ఇకపై 5%, 18% పన్నురేట్లకే పరిమితం కానున్నాయి. ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ రద్దుతోపాటు 33 రకాల అత్యవసర మందులపై ప్రస్తుతమున్న 12శాతం పన్నును పూర్తిగా తొలగించారు. వైద్యపరికరాలపై జీఎస్టీని 12% నుంచి 5%కు తగ్గించారు. దీంతో ప్రజలకు ఆరోగ్య భద్రత పెరగనుంది. నోట్‌బుక్‌లు, పెన్సిళ్లు, క్రెయాన్లు, మ్యాప్‌లు, చార్టులపై జీఎస్టీ రద్దు చేయడం విద్యార్థులపై భారాన్ని తగ్గించనుంది. ఫోన్ల ధరల్లో మాత్రం మార్పు లేదు.

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: దేశంలో జీఎస్టీ (వస్తు సేవల పన్ను) సంస్కరణలకు లైన్ క్లియర్ అయింది. పేదలు, మధ్యతరగతికి ఊరటనిచ్చేలా పన్ను శ్లాబుల కుదింపునకు జీఎస్టీ కౌన్సిల్ పచ్చజెండా ఊపింది. దీనితో ప్రస్తుతం 5, 12, 18, 28 శాతంగా ఉన్న పన్ను రేట్లలో 5, 18 పన్ను రేట్లు మాత్రమే కొనసాగనున్నాయి. హానికర, విలాస వస్తువులపై మాత్రం 40 శాతం ప్రత్యేక పన్ను విధిస్తారు. ఎప్పటి నుంచో ప్రజలు కోరుతున్న మేరకు ఆరోగ్య, జీవిత బీమాలపై జీఎస్టీ పూర్తిగా రద్దయింది. బుధవారం జరిగిన జీఎస్టీ కౌన్సిల్ భేటీ అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వివరాలను వెల్లడించారు. దుర్గా నవరాత్రుల మొదటి రోజు అయిన సెప్టెంబరు 22వ తేదీ నుంచి జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి వస్తాయని ప్రకటించారు. దేశంలోని సాధారణ ప్రజలకు ప్రయోజనం కలిగించేందుకే జీఎస్టీ సంస్కరణలు చేపట్టామని నిర్మలా సీతారామన్ చెప్పారు. "జీఎస్టీలో వినూత్న సంస్కరణలు తీసుకువస్తామని ప్రధాని మోదీ స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. ఈ సంస్కరణలు కేవలం పన్నురేట్ల హేతుబద్ధీకరణ మాత్రమేకాదు.. పేదలు, మధ్యతరగతి వారికి ఉపశమనం కలిగేలా, సులభతర వ్యాపారాన్ని ప్రోత్సహించేలా

మిగతా 2వ పేజీలో...

లిక్కర్ కిక్కులో హాఫ్ షెల్

బయటపడుతున్న డొల్ల కంపెనీల గుట్టు

లిక్కర్ స్కామ్‌లో కొత్త బంధాలు వెలుగులోకి

- తిరుపతి, హైదరాబాద్, చిత్తూరులో సోదాలు
- సజ్జల భార్గవ్, మోహిత్ రెడ్డి, ప్రద్యుమ్న భాగస్వామ్యమే
- హైదరాబాద్‌లో ఇషా ఇన్‌ఫ్రా కంపెనీ ఏర్పాటు
- ఎన్నికల సమయంలో దొరికిన రూ.8 కోట్లు తనవే అన్న ప్రద్యుమ్న
- తిరుపతిలో పలు కంపెనీల పేర్లతో చెవిరెడ్డి లావాదేవీలు
- రూ.600 కోట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన మోహిత్ రెడ్డి
- ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్‌కు సమాచారం ఇవ్వాలని సిట్ నిర్ణయం
- చిత్తూరులో విజయానందరెడ్డి కార్యాలయాల్లోనూ సోదాలు
- మోహిత్ రెడ్డితో ఆయన భాగస్వామ్యంపై ఆధారాలు



చిత్తూరులో విజయానందరెడ్డి అపార్ట్‌మెంటు వద్ద సిట్ అధికారులు

(అమరావతి/చిత్తూరు/తిరుపతి - ఆంధ్రజ్యోతి)

ఇక్కడ తీగలాగితే ఎక్కడో డొంక కదిలినట్లు... ఇక్కడ స్విచ్ నొక్కితే మరెక్కడో లైటు వెలిగినట్లు... మద్యం స్కామ్‌లో సోదాలు జరుపుతుంటే డొల్ల కంపెనీలు బయటపడుతున్నాయి. అప్పట్లో జగన్ అక్రమాస్తుల కేసులో సీబీఐ దర్యాప్తు సందర్భంగా... పదులకొద్దీ షెల్ కంపెనీల గుట్టు రట్టయిన సంగతి తెలిసిందే. ఇప్పుడు లిక్కర్‌స్కామ్‌లోనూ అదే జరుగుతోంది. బుధవారం 'సిట్' అధికారులు చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్‌లలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి, వైసీపీ నేత విజయానంద రెడ్డికి సంబంధించిన కంపెనీలు, నివాసాల్లో సోదాలు జరిపారు. బయట బోర్డు ఒకటి... లోపల ఉండే కంపెనీ మరొకటి! తిరుపతిలో చెవిరెడ్డి కుటుంబం ఎనిమిది కంపెనీల పేర్లతో లావాదేవీలు జరుపుతున్నట్లు సిట్ గుర్తించింది. చిత్తూరులో

మిగతా 13వ పేజీలో...

సేమ్ టు సేమ్..

లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు చేస్తున్న అధికారులకు పన్నెండేళ్ల క్రితం జగన్ అక్రమాస్తుల కేసు దర్యాప్తు చేసిన సీబీఐ అధికారుల అనుభవాలే ఎదురవుతున్నాయి. అప్పట్లో... బెంగళూరులో తీగలాగితే సిక్కింలో మూలాలు బయటపడేవి. హైదరాబాద్‌లో తనిఖీలు చేస్తే కోల్‌కతాలో అక్రమాలు వెలుగులోకి వచ్చేవి. మనీ రూటింగ్ కోసం భారీ స్థాయిలో షెల్ కంపెనీలు ఏర్పాటు చేసినట్లు సీబీఐ నిర్ధారించింది. అదే తరహాలో... లిక్కర్ స్కామ్‌లోనూ భారీగా ఏర్పాటైన కంపెనీల గుట్టు రట్టవుతోంది.



పదవ ఆర్థిక సంఘం సభ్యుల సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు

ఫేక్‌ల పని పడతాం

రైతుల ముసుగులో వైసీపీ రాజకీయం

- ఎరువుల రవాణాను అడ్డుకుంటున్నారు
- డ్రామాలు చేస్తే జైలుకు పంపుతాం
- అన్నదాతలు జగన్ ట్రాప్‌లో పడొద్దు
- సమృద్ధిగా ఎరువులు.. ఆందోళన వద్దు
- 94,892 టన్నుల యూరియా లభ్యత
- మీడియా సమావేశంలో సీఎం స్పష్టీకరణ

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు అన్ని విషయాల్లోనూ ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల కొరత.. రైతుల ఆందోళన అంటూ జరుగుతున్న దుష్ప్రచారంపై బుధవారం సచివాలయంలో సీఎం విలేకరుల సమావేశం నిర్వహించారు. విషవృక్షం లాంటి వైసీపీ చేసే దుష్ప్రచారాల్లో రైతులు భాగంకావద్దని కోరారు. రాష్ట్రంలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని

మిగతా 12వ పేజీలో...

నామినేటెడ్ పదవులన్నీ వారంలో భర్తీ!

ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు.. ఇప్పటి వరకు 80 శాతం పూర్తి

మిగిలిన 20 శాతం పదవులపై దృష్టి.. కూటమి పక్షాల నుంచి పేర్లు 12

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక.. తాజాగా మరో 120 మంది డైరెక్టర్ల నియామకం



2

చైనా విశ్వరూపం

- భారీ అణు క్షిపణులు.. లేజర్ ఆయుధాలు
- 20 వేల కి.మీ. రేంజ్ ఉన్న మిస్సైల్ డీఎఫ్-5సీ
- భూగోళంపై ఏ ప్రాంతాన్నైనా టార్గెట్ చేసే సత్తా
- అండర్ వాటర్ డ్రోన్లు.. ఐదో తరం జెట్లు
- బీజింగ్ మిలిటరీ పరేడ్‌లో ఆయుధ ప్రదర్శన

రెండు వారాల్లోగా 18 కోట్లు కట్టండి

జేపీ వెంచర్స్‌కు సుప్రీంకోర్టు షాక్

- 'ప్రతిమ', జీసీకేసీని ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశం
- వైసీపీ హయాం ఇసుక అక్రమ తవ్వకాల కేసును విచారించిన బెంచ్
- అక్రమ తవ్వకాల విస్తీర్ణంలో ఇంత తేడానా?
- ప్రభుత్వం, పిటిషనర్ సమర్పించిన లెక్కల తీరుపై విస్మయం.. అఫిడవిట్ వేయాలని నిర్దేశం

14





2

ఐటీ రంగంపైనా.. ట్రంప్ సుంకాలు!

- ఐటీఈఎస్, రిమోట్ వర్క్‌పైనా..
- రెమిటెన్స్‌లపైనా భారీగా భారం
- ఆ మేరకు రీట్వీట్ చేసిన నవారో

స్థానిక శంఖారావం

- మున్సిపాలిటీ ఎన్నికలకు సిద్ధం కండి
- 3 నెలల ముందుగా ఎన్నికల కసరత్తు
- జనవరి నాటికి ఎన్నికలు పూర్తిచేయాలి
- జనవరి నుంచి పంచాయతీలు, జూలై నుంచి ఎంపీటీసీ/జడ్పీటీసీలకూ ఎన్నికల సన్నాహాలు
- మున్సిపల్ శాఖకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ లేఖ

14

స్థానిక సంస్థలకు చేయూత!

- ఆదాయార్జన ఆధారంగా పంచాయతీల విభజన
- తక్కువ ఆదాయం ఉన్నవాటికి ప్రభుత్వ సాయం
- ఆర్థిక వనరులు పెంచేలా ప్రత్యేక కార్యాచరణ
- రాష్ట్ర ఆర్థిక సంఘం భేటీలో సీఎం చంద్రబాబు సూచన
- పంచాయతీ రికార్డులు ఆన్‌లైన్ చేయండి: డిప్యూటీ సీఎం
- ఆదాయ వ్యయాల మధ్య భారీ వ్యత్యాసం: రాష్ట్ర ఆర్థిక సంఘం

13

ఆధ్యాత్మిక నగరాల్లో **హోమ్ స్టేలు**

కోనసీమలోనూ అభివృద్ధి.. పర్యాటకులు గ్రామీణ అనుభూతి పొందాలి.. సమీక్షలో సీఎం

13

ముందే పండుగ!

(మొదటి పేజీ తరువాయి)

ఉండటమే లక్ష్యం. అందుకే లోతుగా సమీక్ష జరిపి నిర్ణయాలు తీసుకున్నాం. మద్దతు తెలిపిన అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. పన్ను శ్లాబులను రెండుకు తగ్గిస్తున్నాం. ఇకపై 5శాతం, 18శాతం పన్నురేట్లు ఉంటాయి. ఈ మార్పులతో సాధారణ ప్రజలు వినియోగించే నిత్యావసరాల ధరలు చాలా వరకు తగ్గుతాయి. వ్యవసాయ రంగానికి, రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఇది దేశంలో వినియోగాన్ని పెంచి, ఆర్థిక వ్యవస్థకు ఊపునిస్తుంది" అని తెలిపారు. హానికర వస్తువుల కేటగిరీలోని పాన్ మసాలాలు, గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతమున్న ధరలే కొనసాగేలా పన్నులు ఉంటాయని చెప్పారు.

రాష్ట్రాలకు జరిగే నష్టాన్ని పూడ్చాలి..!

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ రెండు రోజుల సమావేశం బుధవారం ప్రారంభమైంది. తొలిరోజున సుదీర్ఘంగా జరిగిన భేటీలో.. జీఎస్టీలో సంస్కరణలు, శ్లాబుల హేతుబద్ధీకరణపై ఏర్పాటు చేసిన మంత్రుల సంఘం చేసిన సిఫార్సులపై చర్చించింది. ఈ సందర్భంగా జీఎస్టీ రేట్ల కుదింపునకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు అంగీకారం తెలిపారు. అయితే శ్లాబుల కుదింపుతో రాష్ట్రాలకు ఏటా సుమారు రూ.2 లక్షల కోట్ల మేర ఆదాయం తగ్గిపోయే ప్రమాదం ఉందని ఎన్డీయేతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలిసింది. హానికర, విలాస వస్తువులపై ప్రత్యేక పన్ను, దానిపై సర్చార్జీలు, సెస్‌ల ద్వారా ఆ నష్టాన్ని కేంద్ర భర్తీ చేయాలని కోరినట్టు సమాచారం. ఇక పెట్రోల్, డీజిల్ తదితరాలను జీఎస్టీ పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదనకు రాష్ట్రాలేవీ సానుకూలత వ్యక్తం చేయలేదని తెలిసింది. గురువారం జరిగే జీఎస్టీ మండలి భేటీలోనూ దీనిపై చర్చ జరిగే అవకాశం లేదని సమాచారం.

ఆరోగ్య, జీవిత బీమాలపై జీఎస్టీ పూర్తిగా రద్దు

దేశంలో ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని నిర్మల చెప్పారు. వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా, ఫ్లోటర్ పాలసీలు, సీనియర్ సిటిజన్ల పాలసీల ప్రీమియంపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించామని ప్రకటించారు. వ్యాపారులకు జీఎస్టీ రిజిస్ట్రేషన్, రిటర్నుల ఫైలింగ్, రీఫండ్ ప్రక్రియలను సులభతరం చేస్తున్నామని, మానవ శ్రమ అవసరమయ్యే పరిశ్రమలను ప్రోత్సహించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీతో రూ.16,398 కోట్లు వసూలు చేసింది. ఇందులో జీవిత బీమా నుంచి రూ.8,135 కోట్లు, ఆరోగ్య బీమా నుంచి రూ.8,263 కోట్లు వచ్చాయి.

ప్రయోజనమెంత?

జీఎస్టీ మార్పులతో చాలా వరకు నిత్యావసరాల ధరలు తగ్గనున్నాయి. ఇప్పటివరకు 5శాతం పన్నురేటులో ఉన్న టెట్రాప్యాక్ పాలు, పనీర్, బ్రెడ్‌లపై పన్ను పూర్తిగా మినహాయించారు. ఇప్పటివరకు 18%, 12% పన్ను రేట్లలో ఉండి.. ఇకపై 5శాతం పన్ను పరిధిలో వస్తున్న హెయిర్ ఆయిల్, సబ్బులు, షాంపూలు, టూత్ బ్రష్‌లు, సైకిళ్లు, టేబుళ్లు, కుర్చీలు, పాస్తా, నూడుల్స్, కాఫీ, కార్న్‌ఫ్లేక్స్, బటర్, నెయ్యి, హస్తకళాకృతులు, మార్బుల్, గ్రానైట్‌తో పాటు కొన్ని రకాల ఔషధాలు, డయాగ్నస్టిక్ కిట్లు, కళ్లద్దాలు, సోలార్ ప్యానెళ్ల ధరలు తగ్గనున్నాయి.

- పెట్రోల్, డీజిల్, సీఎన్జీ వాహనాలు, వాటి విడి భాగాలపై జీఎస్టీ తగ్గింపుతో కార్లతోపాటు ఆటోలు, బస్సులు, ట్రక్కుల ధరలూ దిగివస్తాయి. ముఖ్యంగా విలాసవంతమైన వాహనాలపై అదనపు సెస్‌ను ఎత్తివేయడంతో వాటి ధరలు మరింతగా తగ్గే అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ కార్లపై ఎప్పటిలాగే 5శాతం పన్ను కొనసాగనుంది. ఇక 350 సీసీ సామర్థ్యంలోపు ఉన్న ద్విచక్ర వాహనాలను 28శాతం పన్నురేటు నుంచి 18శాతానికి మార్చడంతో.. వాటి ధరలు పది శాతం మేర తగ్గనున్నాయి.
- 40శాతం ప్రత్యేక పన్ను రేటులోని శీతల పానీయాలు, చక్కెర, ఇతర తీపి పదార్థాలు, కెఫీన్ కలిపిన పానీయాలు, పళ్ల రసాల ధరలు కొంతమేర పెరిగే అవకాశం ఉంది. పాన్ మసాలాలు, సిగరెట్లు, గుట్కాలు, ఇతర పొగాకు ఉత్పత్తుల ధరల్లో పెద్దగా మార్పులు ఉండవు.
- 18 శాతం పన్నురేటులో మొబైల్ ఫోన్లను యథాతథంగా కొనసాగించారు. దీనితో వాటి ధరల్లో మార్పు ఉండదు.
- సిమెంట్‌పై పన్నును 28శాతం నుంచి 18శాతానికి తగ్గించారు. దీనితో దేశవ్యాప్తంగా నిర్మాణ రంగానికి ఊరట లభించనుంది. ఇళ్లు, ఫ్లాట్ల ధరలు కాస్త తగ్గేందుకు వీలుంటుంది
- ప్రస్తుతం రూ.1000 లోపు ధర ఉన్న వస్త్రాలు, చెప్పులు, బూట్లపై 5శాతం, ఆపై ధర ఉంటే 12శాతం పన్ను వసూలు చేస్తున్నారు. ఇకపై రూ.2,500 వరకు ధర ఉన్న వస్త్రాలు, పాదరక్షలపై 5శాతమే పన్ను వర్తిస్తుంది. అంటే రూ.1000 నుంచి రూ.2,500 వరకు ధర ఉన్న వాటి ధరలు తగ్గుతాయి. అయితే రూ.2,500కుపైన ధర ఉండే వస్త్రాలు, పాదరక్షలు 18శాతం పన్నురేటులోకి వెళతాయి. అంటే.. వాటి ధరలు పెరుగుతాయి.

దుస్తులు, పాదరక్షలపై జీఎస్టీ ఇలా..

దుస్తులు/పాదరక్షలు	ప్రస్తుత జీఎస్టీ	కొత్త జీఎస్టీ
రూ.1,000 వరకు	5 శాతం	5 శాతం
1,001 నుంచి రూ.2,500 వరకు	12 శాతం	5 శాతం
రూ.2,500 పైబడి	12 శాతం	18 శాతం

రూ.2,500కు మించిన ఉత్పత్తులపై జీఎస్టీని 12 శాతం నుంచి 18 శాతానికి పెంచడం పట్ల క్లోతింగ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఏఐ) వంటి అసోసియేషన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జీఎస్టీ పెంపుతో ఉన్ని, హస్తకళల దుస్తుల డిమాండ్‌పై ప్రభావం పడవచ్చని పేర్కొంది. ఇప్పటికే ఎగుమతుల్లో మందగమనం, నగదు ప్రవాహ సమస్యలు ఉన్నట్టు చెబుతోంది. ఇక రూ.2,500 వరకు ధర ఉన్న ఉత్పత్తులపై పన్ను 5 శాతానికి తగ్గడం వల్ల వినియోగదారులకు ఊరట లభించనుంది.

సింగరేణి, 'బొగ్గు' విద్యుత్ భారం!

బొగ్గు, బొగ్గు ఆధారిత ఇంధనాలపై జీఎస్టీని ప్రస్తుతమున్న 5శాతం నుంచి 18శాతానికి పెంచారు. దీనితో బొగ్గు ధరలు పెరుగుతాయి. బొగ్గును వినియోగించే థర్మల్ విద్యుత్ కేంద్రాలపై తీవ్ర భారం పడుతుంది. విద్యుత్ ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. బొగ్గును వినియోగించే ఉక్కు, సిమెంటు, ఎరువులు, రసాయన పరిశ్రమలకూ భారంగా మారుతుంది. మరోవైపు బొగ్గు డిమాండ్ పెంచేందుకు సింగరేణి ధరలు తగ్గించాల్సి వస్తుంది. దీనితో సంస్థపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇక సిమెంట్‌పై పన్ను తగ్గించినా.. బొగ్గుపై పన్ను పెరగడంతో ధరలు తగ్గే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజా ఆరోగ్యానికి భద్రత

పలు రకాల ఔషధాలు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ కిట్లు వంటివాటిపై ఇప్పటివరకు 12%, 18% వరకు పన్నులు ఉండగా.. ఇప్పుడన్నింటినీ 5%శాతం పన్ను పరిధిలోకి తెచ్చారు. ముఖ్యంగా కేన్సర్, ఇతర ప్రాణాధార, అత్యవసర ఔషధాలపై జీఎస్టీని పూర్తిగా ఎత్తివేశారు. దీనితో ప్రజా ఆరోగ్య భద్రతకు మేలు కలగనుంది.

గృహ నిర్మాణ రంగానికి ఊతం

ఇంటి నిర్మాణ ఖర్చు	సిమెంట్ వాటా(18%)	పాత జీఎస్టీ(28%)	తగ్గిన జీఎస్టీ(18%)	మిగులు
రూ.20 లక్షలు	రూ.3.6లక్షలు	రూ.1.01 లక్షలు	రూ.65 వేలు	రూ.36 వేలు
రూ.30 లక్షలు	రూ.5.4 లక్షలు	రూ.1.52 లక్షలు	రూ.98 వేలు	రూ.54 వేలు
రూ.40 లక్షలు	రూ.7.2 లక్షలు	రూ.2.02 లక్షలు	రూ.1.3 లక్షలు	రూ.72 వేలు

లోకం తీరు



సామాన్యులకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగం బలోపేతం

జీఎస్టీ సంస్కరణలపై ప్రధాని మోదీ స్పందన



న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: భారీ సంస్కరణలకు జీఎస్టీ మండలి ఆమోదం తెలపడంపై ప్రధాని మోదీ స్పందించారు. తాజా సంస్కరణలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. వ్యాపారం మరింత సరళతరమవుతుందని, చిరు వ్యాపారులకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నారు. సామాన్య ప్రజలకు ఊరటనిస్తూనే ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేలా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకు శ్రీకారం చుట్టిందంటూ ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సామాన్యులు, మధ్యతరగతి వారు, రైతులు, మహిళలు, యువత, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వారికి ప్రయోజనం కలిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి నిర్ణయం తీసుకున్నాయని ఆయన చెప్పారు. జీఎస్టీలో భారీ సంస్కరణలు తీసుకురాబోతున్నట్లు ఎర్రకోట వేదికగా తాను స్వాతంత్య్ర దినోత్సవాన ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు.

ఏసీల ధరలు ఎంత తగ్గుతాయ్!

కంపెనీ	ధర	పాత జీఎస్టీ (28%)	కొత్త జీఎస్టీటీ (18%)	ఆదా ఎంత?
ఓ-జనరల్	49,000	10,719	7,473	3,250
ఎల్‌జీ	46,590	10,177	7,105	3,070
పానాసోనిక్	44,990	9,873	6,895	2,980
డైకిన్	36,990	8,092	5,644	2,450
బ్లూ స్టార్	34,000	7,438	5,185	2,250
క్యారియర్	34,990	7,686	5,358	2,330
ఓల్టాస్	31,990	6,998	4,877	2,120

350సీసీలోపు బైక్‌ల ధరలు తగ్గుతాయి

350సీసీలోపు మోటారు సైకిళ్ల ధరలు తగ్గుతాయి. వీటిపై 28 శాతం జీఎస్టీ 18 శాతానికి తగ్గనుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్, కేటీఎం వంటి 350సీసీ కంటే ఎక్కువ ఇంజన్ సామర్థ్యం బైక్‌ల ధరలు పెరుగుతాయి. ఇప్పటి వరకు వీటిపై 28 శాతం జీఎస్టీతో పాటు 2-3 సెస్ విధిస్తున్నారు. ఇక నుంచి సెస్ ఉండదు కానీ 40 శాతం పన్ను పరిధిలోకి వెళతాయి.

మోడల్	ఇంజన్	ప్రస్తుత పన్ను (28%)	కొత్త పన్ను (18%)	సుమారుగా ఆదా
హోండా యాక్టివా/ టీవీఎస్ జూపిటర్	110-125సీసీ	28,000-31,000	18,000	10,000-13,000
బజాజ్ పల్సర్	150సీసీ	28,000-31,000	18,000	10,000-13,000
రాయల్ ఎన్‌ఫీల్డ్	650సీసీ	93,000	1,20,000	27,000 (పెరుగుదల)
కేటీఎం	373సీసీ	93,000	1,20,000	27,000 (పెరుగుదల)

ఏయే కార్ల ధరలు ఎంత తగ్గుతాయంటే!

కార్ల విభాగం	మోడళ్లు	ప్రస్తుత పన్ను శాతం (సెస్‌తో కలిపి)	తగ్గాక	ఆదా (రూ.ల్లో)
చిన్న కార్లు (1200 సీసీ లోపు)	స్విఫ్ట్, వేగనార్, బెలెనో, పంచ్, ఐ20	29	18	50వేల నుంచి లక్ష దాకా
మిడ్ సైజ్ (1200 సీసీ పైన)	క్రెటా, సెల్టోస్, సిటీ, ఇన్నోవా	43	40	75వేల నుంచి 1.5లక్ష
ఎస్‌యూవీ/లగ్జరీ కార్లు (1200 సీసీ పైన)	ఎక్స్‌యూవీ 700, ఫార్చ్యునర్, ఆడీ, బీఎండబ్ల్యూ, మెర్సిడీస్	50	40	2లక్షల నుంచి 10 లక్షలు

- ఎలక్ట్రిక్ కార్లపై ప్రస్తుతం 5 శాతం పన్ను విధిస్తున్నారు. ఈ రేటులో ఎలాంటి మార్పులు చేయలేదు. అందువల్ల ఎలక్ట్రిక్ కార్ల ధరల్లో ఎలాంటి మార్పు ఉండే అవకాశం లేదు.

నాన్నా.. జాగ్రత్త..!

- మీ చుట్టూ ఏం జరుగుతుందో చూసుకోండి
- కాళేశ్వరం డబ్బుతో 25 మంది ఎమ్మెల్యేలకు హరీశ్ ఫండింగ్
- సిరిసిల్లలో కేటీఆర్‌ను ఓడించేందుకు రూ.60 లక్షలు పంపారు
- సంతోష్‌కి ధన దాహం.. అడవులను కొట్టేయాలని చూశారు: కవిత



హైదరాబాద్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, సంతోష్‌రావుపై కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్, సంతోష్ అవినీతి వల్లే కేసీఆర్‌కు సీబీఐ మరక అంటిందని చెప్పారు. కాళేశ్వరం అవినీతి డబ్బుతోనే హరీశ్‌రావు 2018 ఎన్నికల్లో 25 మంది ఎమ్మెల్యేలకు సొమ్ములు ఇచ్చారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను తన వెంట ఉంచుకొని పార్టీకి నష్టం చేయాలన్న కుట్రతోనే పార్టీ ఫండ్ కాకుండా ఆయన సొంత డబ్బులు ఇచ్చారన్నారు. ఆ ఎమ్మెల్యేల పేర్లూ తనకు తెలుసని, వారికి ఇబ్బంది కలిగించే ఉద్దేశం లేదు కాబట్టి వారెవరన్నది బయటపెట్టనని చెప్పారు. అలాగే సిరిసిల్లలో కేటీఆర్‌ను ఓడించేందుకు హరీశ్ ఓ వ్యక్తికి రూ.60 లక్షలు ఇచ్చారని.. అతనే తనకీ విషయం చెప్పారని అన్నారు. అత్యధిక ధనదాహం ఉన్న సంతోష్‌రావు ఏకంగా అడవులను కొట్టేయాలని చూశారని.. ప్రభుత్వం హరితహారం చేపడితే, ఆయన గ్రీన్ చాలెంజ్ పేరుతో కోట్లు కొల్లగొట్టారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. బంగారు తెలంగాణ అంటే హరీశ్‌రావు, సంతోష్‌రావు ఇళ్లల్లో బంగారం ఉంటే సరిపోతుందా? అని ప్రశ్నించారు. "నాన్నా.. జాగ్రత్త. మన కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసి, బీఆర్ఎస్ పార్టీని ఆక్రమించేందుకు కుట్రలు జరుగుతున్నాయి. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి" అంటూ తండ్రి కేసీఆర్‌ను హెచ్చరించారు. బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేసిన నేపథ్యంలో బుధవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. హరీశ్, సంతోష్‌ల అవినీతిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి, హరీశ్ ఒకే విమానంలో ప్రయాణం చేసిన విషయం నిజం కాదా..? అని కవిత ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను కేసీఆర్‌కు, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా లేఖను మండలి చైర్మన్‌కు పంపుతున్నట్లు ప్రకటించారు.

గాలి, నీరుతో విద్యుత్ ఉత్పత్తి..!

- ప్రత్యేక పరికరం తయారుచేసిన ఐఐటీ ఇండోర్ పరిశోధకులు

ఇండోర్, సెప్టెంబరు 3: సూర్యరశ్మి, బ్యాటరీ.. ఇవేమీ అవసరం లేకుండా కేవలం గాలి, నీరుతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పరికరాన్ని ఐఐటీ ఇండోర్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ పరికరం ద్వారా చిన్న ఎలక్ట్రానిక్ పరికరాలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించవచ్చని వారు తెలిపారు. గ్రాఫేట్ ఆక్సైడ్‌ను జింక్-ఇమిడాజోల్‌తో కలిపి ప్రత్యేకంగా రూపొందించిన ఒక పొరలాంటి పరికరాన్ని అభివృద్ధి చేశామని ఐఐటీ ఇండోర్ అధికారులు బుధవారం పేర్కొన్నారు. ఈ పొర పాక్షికంగా నీటిలో మునిగినప్పుడు నీరు సూక్ష్మదర్శిని మార్గాల ద్వారా పైకి ప్రవహించి ఆవిరైపోతుందని, ఈ బాష్పీభవన ప్రక్రియ ఆధారిత కదలిక.. పొర చివరన సానుకూల, ప్రతికూల అయాన్లను వేరు చేసి.. స్థిరమైన వోల్టేజీను ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. మూడు సెంటీమీటర్ల పొడవు, రెండు సెంటీమీటర్ల వెడల్పు ఉన్న ఈ పొర 0.75 వాట్స్ వరకు విద్యుత్ ఉత్పత్తి చేయగలదని, అయితే ఎక్కువ పొరలను కలపడం ద్వారా అధిక విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని తెలిపారు.

లొంగిపోతారో.. ఎన్‌కౌంటర్ అవుతారో తేల్చుకోవాలి: షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించే వరకు మోదీ సర్కారు విశ్రమించబోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. ఇప్పటికైనా నక్సల్స్ లొంగిపోతే మంచిదన్నారు. 'నక్సల్స్ అందరూ లొంగిపోవాలి.. వారిని పట్టుకునే వరకు లేదా పూర్తిగా నిర్మూలించే వరకు ఊరుకునేది లేదు' అని వ్యాఖ్యానించారు. లొంగిపోవడమో, ఎన్‌కౌంటర్ కావడమో తేల్చుకోవాలన్నారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టలపై 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'ను విజయవంతంగా నిర్వహించిన సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, కోబ్రా దళాలను అమిత్ షా సత్కరించారు.

ఎస్-400ల కొనుగోలుకు రష్యాతో భారత్ చర్చలు!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: గగనతలాన్ని మరింత దుర్భేద్యం చేసే లక్ష్యంతో మనదేశం అడుగులు వేస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు దడ పుట్టించిన ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలను రష్యా నుంచి మరిన్ని కొనడానికి సిద్ధమైంది. ఈ కొనుగోళ్ల విషయంలో చర్చలు జరుగుతున్నాయని రష్యా మిలిటరీ-టెక్నికల్ కోఆపరేషన్ అధిపతి దిమిత్రీ షుగయేవ్ ధ్రువీకరించారు. టాస్ మీడియాతో ఆయన మాట్లాడుతూ "ఇప్పటికే భారత్ వద్ద ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. ఈ విషయంలో సహకారాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉంది. అంటే మరిన్ని సరఫరా చేస్తాం. ప్రస్తుతానికి చర్చల దశలో ఉన్నాం" అని పేర్కొన్నారు. చైనాలో ఎస్‌సీఓ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, పాక్, చైనాల నుంచి వచ్చే ముప్పును ఎదుర్కోవడానికి 2018లోనే మన దేశం ఎస్-400 వ్యవస్థలను కొనుగోలు చేసింది. 5యూనిట్ల కోసం రూ.39 వేల కోట్లతో రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే వాటి సరఫరా పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. 2021-23 మధ్య మూడు యూనిట్లు మన దేశానికి చేరాయి. వీటిని అదంపూర్ (పంజాబ్), తూర్పు సెక్టార్, పశ్చిమ సెక్టార్‌లో మోహరించారు. మరో రెండు రావాల్సి ఉంది. ఆ రెండింటిలో ఒకటి వచ్చే ఏడాది, మరోటి 2027లోనూ భారత్‌కు రష్యా అప్పగిస్తుందని అంచనా వేస్తున్నారు.

మహా ఆర్థిక శక్తి భారత్: పుతిన్

బీజింగ్, సెప్టెంబరు 3: భారత్ మహా ఆర్థిక శక్తి అని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో పాల్గొన్న ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. బహుళ ధ్రువాలు ఉన్న ప్రస్తుత ప్రపంచంలో ఏ ఒక్కరి ఆధిపత్యం లేదని, అందరూ సమానమేనని తెలిపారు. బ్రిక్స్ వంటి కూటముల్లో భారత్, చైనా వంటి మహా ఆర్థిక శక్తులు ఉన్నా ప్రపంచ రాజకీయాలు, భద్రతపై ఆధిపత్యం వహించాలన్నదానిపై ఎప్పుడూ చర్చించలేదని అన్నారు. భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు చేయడం, సుంకాలను పెంచడం నేపథ్యంలో పుతిన్ చేసిన ఈ వ్యాఖ్య ప్రాధాన్యం సంతరించుకొంది.

చైనా విశ్వరూపం

రాకాసి అణు క్షిపణులు.. లేజర్ ఆయుధాలు, అండర్ వాటర్ డ్రోన్లు.. ఐదోతరం యుద్ధ విమానాలు



మిలటరీ పరేడ్‌ను వీక్షించేందుకు వెళ్తున్న పుతిన్, జిన్‌పింగ్, కిమ్ జోంగ్, షెహబాజ్ షరీఫ్

- బీజింగ్ మిలిటరీ పరేడ్‌లో డ్రాగన్ ఆయుధ బల ప్రదర్శన

బీజింగ్, సెప్టెంబరు 3: భారీ అణు బాలిస్టిక్ క్షిపణులు, లేజర్ ఆయుధాలు, అండర్ వాటర్ డ్రోన్లు, ఐదో తరం యుద్ధ విమానాలు.. ఇలా ఒకటేమిటి ప్రపంచం ఎన్నడూ చూడని అత్యాధునిక ఆయుధ సంపత్తితో చైనా విశ్వరూపమే ప్రదర్శించింది. అమెరికా సుంకాల బెదిరింపుల వేళ.. తన సైనిక బలం ఏమిటో చూపించింది. బీజింగ్‌లో బుధవారం నిర్వహించిన విక్టరీ డే మిలిటరీ పరేడ్‌లో డ్రాగన్ తొలిసారిగా ప్రదర్శించిన రాకాసి అణు క్షిపణి డీఎఫ్-5సీ సహా.. పలు అత్యాధునిక ఆయుధాలను చూసి ప్రపంచదేశాలు విస్తుపోయాయి. ముఖ్యంగా ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి డీఎఫ్-5సీ అందరి దృష్టినీ ఆకర్షించింది. ద్రవ ఇంధనంతో నడిచే ఈ భారీ అణు క్షిపణి రేంజి 20,000 కిలోమీటర్లకుపైనే ఉంటుందని అంచనా..! అంటే ఈ మిస్సైల్ భూగోళంపై ఎక్కడి లక్ష్యాన్నైనా ఛేదించగలదు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ దురాక్రమణపై విజయం సాధించి 80 ఏళ్లవుతున్న సందర్భంగా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) కవాతులో చైనా ఈ ఆయుధ ప్రదర్శనను ఏర్పాటు చేసింది. ఇందులో తొలిసారిగా అధునాతన యుద్ధ విమానాలు, ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ సామగ్రిని ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోపాటు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ సహా 26 దేశాల నేతలు హాజరయ్యారు. చైనాలో భారత రాయబారి ప్రదీప్ కుమార్ రావత్, పాకిస్థాన్ ప్రధాని షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవుల అధ్యక్షుడు మయిజ్జు కూడా పాల్గొన్నారు. ఈ పరేడ్‌ను 50వేల మంది ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించారు.

మిస్సైళ్లలో బాహుబలి డీఎఫ్-5సీ

చైనా ఆయుధ ప్రదర్శనలో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది డీఎఫ్-5సీ. ఇదొక బాహుబలి మిస్సైల్. దీన్ని ఒక్క వాహనంపై తరలించడం సాధ్యంకాదు. మూడు భాగాలుగా తరలించి.. ఆ తర్వాత అసెంబ్లింగ్ చేసి ప్రయోగిస్తారు. ఇది ధ్వని వేగం కంటే 10 రెట్ల వేగంతో ప్రయాణించగలదు. ఇందులో ఎంఐఆర్‌వీ వ్యవస్థను వినియోగించారు. ఇది ఒకేసారి పలు అణు, సంప్రదాయ వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. ఏకకాలంలో పది వేర్వేరు ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని దాడి చేయగలదు. ఈ పరేడ్‌లో డీఎఫ్-5సీ క్షిపణులతోపాటు ఎల్‌వై-1 అనే సరికొత్త లేజర్ ఆయుధం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎనిమిది చక్రాల సాయుధ ట్రక్ హెచ్‌జెడ్-155పై అమర్చిన ఈ లేజర్ ఆయుధం.. శత్రు ఆయుధాల్లోని ఆప్టికల్ సెన్సర్లను సమర్థంగా దెబ్బతీయగలదు. సముద్ర యుద్ధ నిబంధనలను ఇది కచ్చితంగా మార్చగలదని రక్షణ రంగ విశ్లేషకులు చెబుతున్నారు. లేజర్ యుద్ధాన్ని కొత్త సైనిక రంగంగా వారు పరిగణిస్తున్నారు.

- చైనా పరేడ్‌లో డాంగ్‌ఫెంగ్-61 ఖండాంతర క్షిపణిని కూడా ప్రదర్శించింది. దీని రేంజ్ 12వేల కిలోమీటర్లు. డీఎఫ్-41కు ఇది అడ్వాన్స్‌డ్ వెర్షన్.
- చైనా తొలిసారిగా ఐదో తరం యుద్ధ విమానాలను ప్రదర్శించింది. వైమానిక దళం కోసం రూపొందించిన జే-20, జే-20ఏ, జే-20ఎస్, జే-35ఏతోపాటు నేవీ కోసం జే-35 అనే ఐదు మోడళ్లను పరిచయం చేసింది. ఒక పరేడ్‌లో ఐదు మోడళ్ల అత్యాధునిక స్టెల్త్ ఫైటర్ జెట్లు కనిపించడం ప్రపంచంలో ఇదే తొలిసారని చైనా డైలీ తెలిపింది.

మనిషి 150 ఏళ్లు బతకొచ్చు..!

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్.. అవయవ మార్పిడి, మనిషి దీర్ఘాయుష్షు గురించి మాట్లాడుకున్నారు. బీజింగ్‌లో జరిగిన సైనిక కవాతు సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్ కలిసి నడుస్తూ మాట్లాడుకున్న ఈ మాటలు మైక్‌లో రికార్డయ్యాయి. "బయోటెక్నాలజీ రంగం అభివృద్ధి చెందుతోంది. మానవ అవయవాలను మార్పిడి చేయవచ్చు. మీరు ఎంత ఎక్కువకాలం జీవిస్తే.. అంత చిన్నవారు అవుతారు. అమరత్వాన్ని కూడా సాధించగలరు" అని పుతిన్ అనువాదకుడు చైనీస్ భాషలో చెప్పడం మైక్‌లో వినిపించింది. జిన్‌పింగ్ స్పందిస్తూ.. "ఈ శతాబ్దంలో మానవులు 150 సంవత్సరాల వరకు జీవించవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు" అని చెప్పడం వినిపించింది.



డాంగ్‌ఫెంగ్-61 ఖండాంతర క్షిపణి

ఐటీ రంగంపైనా ట్రంప్ సుంకాలు!

న్యూఢిల్లీ/వాషింగ్టన్, సెప్టెంబరు 3: అమెరికాకు భారత్ ఎగుమతి చేసే ఉత్పత్తులపై 50% సుంకాలను ప్రకటించిన ట్రంప్ సర్కారు దృష్టి ఇప్పుడు సమాచార సాంకేతిక(ఐటీ) రంగం, ఐటీఈఎస్, రిమోట్ వర్కర్లు, ప్రవాస భారతీయులు పంపే రెమిటెన్స్‌పై పడిందా? ఆయా సేవలపైనా సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నారా? దీని వల్ల భారత దేశీయోత్పత్తి(జీడీపీ)లో అత్యంత కీలకమైన ఐటీ, సేవా రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందా? ఈ ప్రశ్నలకు తాజా పరిస్థితులు అవుననే చెబుతున్నాయి. అమెరికా కన్జర్వేటివ్ పార్టీ ప్రతినిధి జాక్ పోసోబిక్ ఎక్స్‌లో చేసిన ఓ పోస్టును వైట్‌హౌస్‌లో శక్తిమంతమైన అధికారిగా ఉన్న వాణిజ్య, ఉత్పాదక విభాగాల సీనియర్ సలహాదారు పీటర్ నవారో రీట్వీట్ చేయడం ఈ వాదనలకు బలాన్ని చేకూరుస్తోంది. "అన్ని ఔట్‌సోర్సింగ్‌లపై సుంకం విధించాలి. విదేశాల నుంచి అమెరికాలోని కంపెనీలకు రిమోట్ సర్వీసుల(ఉద్యోగులు)పైనా ప్రివిలేజ్ కోసం సుంకాలు వేయాలి" అని పోసోబిక్ ట్వీట్ చేశారు. దాని నవారో వెంటనే రీట్వీట్ చేయడం గమనార్హం..! ఇది కార్యరూపం దాలిస్తే ఐటీతోపాటు.. ఐటీ ఆధారిత సేవారంగం(ఐటీఈఎస్), బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్(బీపీవో) ద్వారా విదేశాల నుంచి రిమోట్‌గా పనిచేసే వర్కర్లు/ఉద్యోగులు, అమెరికాలోని భారతీయ ఐటీ కంపెనీల్లో పనిచేసే హెచ్-1బీ వీసాదారులు, భారత్‌కు రెమిటెన్స్ పంపే ప్రవాస భారతీయులపై తీవ్ర ప్రభావం పడుతుంది.

పుతిన్, జిన్‌పింగ్, కిమ్‌లపై ట్రంప్ ఫైర్

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా నియంత కిమ్‌జోంగ్ ఉన్‌లపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ ముగ్గురు అమెరికాకు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. చైనా మిలిటరీ పరేడ్‌లో జిన్‌పింగ్‌తో కలిసి కిమ్, పుతిన్, పాల్గొనడంపై ట్రంప్ నిప్పులు కురిపించారు. "రెండో ప్రపంచయుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికా సైనికుల త్యాగాలను జిన్‌పింగ్ గుర్తిస్తారా? లేదా? వారి త్యాగాన్ని జిన్‌పింగ్ గౌరవిస్తారని ఆశిస్తున్నాను" అన్నారు.

సైబర్ నేరాలకు వాడుతున్న 2 కోట్ల ఫోన్ కనెక్షన్లు బ్లాక్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: సైబర్ నేరాల కోసం ఉపయోగిస్తున్న 2కోట్ల ఫోన్ కనెక్షన్లను కేంద్ర టెలి కమ్యూనికేషన్స్ విభాగం(డీఓటీ)బ్లాక్ చేసింది. టెలికమ్యూనికేషన్స్ విభాగం కార్యదర్శి నీరజ్ మిత్తల్ ఈ విషయాన్ని వెల్లడించారు. బుధవారం గోవాలో నిర్వహించిన సైబర్ సెక్యూరిటీ సదస్సులో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. సంచార్ సాథీ యాప్ వల్ల ఇది సాధ్యమైందన్నారు. సైబర్ నేరగాళ్లు చేసే స్పూఫ్ కాల్స్‌ను ఈ యాప్ సాయంతో 97శాతం తగ్గించామన్నారు. టెలి కమ్యూనికేషన్స్‌లో భద్రత కోసం డీఓటీ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని, ప్రైవేటు సంస్థలతో కూడా కలిసి పనిచేస్తోందని వివరించారు.



టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

మా ఊరికి బంధువులు రావడం లేదయ్యా!

తురకపాలెం గ్రామస్థుల ఆవేదన

- వరుస మరణాలతో నిస్తేజం.. నిర్మానుష్యంగా వీధులు
- వైద్య శిబిరానికి స్పందన కరువు..
  గ్రామాన్ని సందర్శించిన డీఎంఈ
- శాస్త్రీయంగా సర్వే చేపట్టినట్లు వెల్లడి
- జీజీహెచ్‌లో పది పడకలతో ప్రత్యేక వార్డు
- నేడు రక్త నమూనా ఫలితాల వెల్లడి



తురకపాలెంలో మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీఎంఈ, వైద్య నిపుణులు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు కోలాహలంగా కనిపించిన గుంటూరు జిల్లా తురకపాలేన్ని నేడు నిస్తేజం ఆవరించింది. ఇటీవల గ్రామంలో వరుసగా సంభవించిన అంతుపట్టని మరణాలతో గ్రామస్థులు కుదేలయ్యారు. వారిలో తీవ్ర ఆందోళన, భీతి కనిపిస్తున్నాయి. పగటి పూటే కర్ఫ్యూ విధించినట్టు రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. రాత్రి 9 గంటలు దాటితే గ్రామస్థులు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. బుధవారం తురకపాలెం సందర్శించిన మీడియా బృందానికి కనిపించిన దృశ్యాలు ఇవి. నాలుగు నెలల వ్యవధిలో ఈ గ్రామంలో 40కి పైగా మరణాలు నమోదు కావడంతో ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇది హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి బుధవారం గ్రామంలో పారిశుధ్యం మెరుగుపర్చే కార్యక్రమాలు చేపట్టింది. మెలియాయిడోసిస్ జ్వరాలు ప్రబలినట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో నిపుణులు గ్రామంలో వాటర్ ట్యాంకుల నుంచి నీటి నమూనాలు, పలు చోట్ల మట్టి నమునాలు సేకరించారు. అయితే, ఎస్సీ కాలనీ చర్చిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన కరువైంది. ఇక అందుబాట్లో ఉన్న కొద్ది మందితో మీడియా ప్రతినిధులు మాట్లాడారు. 'ఏం చెప్పమంటరయ్యా! గ్రామంలో ఏమి జరుగుతుందో ఏమో.. మాకు తెలియడం లేదు. నిన్నటి వరకు ఆరోగ్యంగా ఉన్న వారు ఆకస్మికంగా జ్వరాల బారిన పడుతున్నారు. ఆసుపత్రికి చికిత్సకు వెళ్లి ఆపై శవాలుగా తిరిగొస్తున్నారు' అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'నాలుగు నెలలుగా మా ఊరికి బంధువులు ఎవరూ రావడం లేదయ్యా.. మేం కూడా ఎక్కడికి వెళ్లడం లేదంటూ నిరాశ వ్యక్తం చేశారు. మే ఒకటిన గ్రామం పొలిమేరలో బొడ్డురాయిని మార్చిన తర్వాతే ఇదంతా జరుగుతోందని గ్రామస్థులు చెప్పడం విశేషం. ఈ బొడ్డురాయిని సరి చేయించాలని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థుల్లో ధైర్యం నింపేందుకు సైకియాట్రిస్టులు కూడా కౌన్సెలింగ్ ద్వారా తమ వంతు సేవలు ప్రారంభించారు.

జెనెటిక్ పరీక్షలు చేయిస్తాం: డీఎంఈ

ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు బుధవారం రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ తురకపాలెం గ్రామాన్ని సందర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మల్లిక, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వి జయలక్ష్మి, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి, ఎపిడమాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్, పలువురు వైద్య నిపుణులు పాల్గొన్నారు. డాక్టర్ రఘునందన్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. కొందరి ఇళ్లకు వెళ్లి వారిని పలకరించారు. మరణాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గ్రామంలో అంతుపట్టని మరణాలకు కారణాలు తెలుసుకునేందుకు శాస్త్రీయంగా సర్వే చేపట్టినట్లు తెలిపారు. మెలియాయిడోసిస్ జ్వరాలు ప్రబలినట్లు అనుమానాలు వ్యక్తం కావడంతో వీటిని నిర్ధారించేందుకు ఇప్పటి వరకు 36 జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు డీఎంఈ తెలిపారు. వీటిని కల్చర్ పరీక్ష చేస్తున్నామని, గురువారం నాటికి ఫలితాలు అందుతాయని చెప్పారు. వీటిలో పాజిటివ్ రిపోర్టు వస్తే అధునాతన జెనెటిక్ పరీక్షల కోసం మణిపాల్ హాస్పిటల్‌కు పంపుతామన్నారు. జ్వరాలకు కారణమయ్యే సూడోమల్లీ బ్యాక్టీరియా నీటిలో, మట్టిలో ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో పలు చోట్ల నీటి, మట్టి నమూనాలు కూడా పరీక్షల కోసం సేకరించినట్లు తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా జ్వర బాధితుల కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో పది పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వారికి మెరుగైన చికిత్సలు అందించేందుకు హెల్ప్ లైన్ ఫోన్ నంబర్ కేటాయించాలని డీఎంహెచ్‌వోకు సూచించారు.

తిరుమలలో శ్రీవారి సేవకులకు శిక్షణ

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి సేవకులకు శిక్షణ ఇవ్వనున్నామని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. టీటీడీ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన శిక్షణ ట్రైనర్ మాడ్యూల్‌ను టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవనంలో బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. 2000లో ప్రారంభమైన 'శ్రీవారిసేవ' ద్వారా ఇప్పటివరకు 17లక్షల మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. రోజూ 3,500 మంది టీటీడీలోని పలు విభాగాల్లో సేవలందిస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శ్రీవారిసేవ వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకువచ్చామని.. ఈ క్రమంలోనే శ్రీవారి సేవకులకు, గ్రూప్ సూపర్‌వైజర్లకు 'ట్రైనర్ల'తో నిరంతరం శిక్షణ ఇస్తామన్నారు. ట్రైనర్ల శిక్షణ కోసం ఐఐఎం(అహ్మదాబాద్), డైరెక్టర్ ప్లానింగ్ ఆఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో టీటీడీ వెబ్‌సైట్‌లో 'ట్రైనర్ మాడ్యూల్ ఆప్షన్‌ను బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.

పారదర్శకంగా హోటళ్ల కేటాయింపు

ఈవో, అదనపు ఈవో మాట్లాడుతూ.. తిరుమలలోని ఐదు జనతా, ఐదు బిగ్ క్యాంటీన్లను ఇటీవల పారదర్శకంగా కేటాయించామన్నారు. కొత్త పాలసీని రూపొందించి నిపుణుల కమిటీతో ఆయా సంస్థల కార్యకలాపాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాక కేటాయింపు జరిగిందన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా బ్రాండెడ్ హోటళ్లను ఎంపిక చేశామన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే ఆయా హోటళ్లను కేటాయించిన లైసెన్సులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

జిన్నర్ల సమస్యలు పరిష్కరించాలి

- సీసీఐకి వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశం
- రాష్ట్ర పరిధిలో నిబంధనల సడలింపునకు గ్రీన్‌సిగ్నల్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిధిలోని పత్తి మిల్లుల యజమానుల సమస్యల పరిష్కారం కోసం తక్షణమే చర్యలు చేపట్టాలని సీసీఐ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు టెండర్ ప్రక్రియను జిన్నర్లు బహిష్కరించిన నేపథ్యంలో సచివాలయంలో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు పాల్గొన్న ఈ సమావేశంలో టెండర్లు దాఖలకు అడ్డంకిగా మారిన నిబంధనలపై చర్చ జరిగింది. టెండర్ల ప్రక్రియను ఎందుకు బహిష్కరించాల్సి వచ్చిందో యజమానులు మంత్రికి వివరించారు. పత్తి కొనుగోలు కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, ఎల్ 4, ఎల్ 5గా మిల్లులను విభజించటం, దూది నాణ్యత పెంపు వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. మిల్లుల యజమానులు చెబుతున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిబంధనల సడలింపు వ్యవహారం తన పరిధిలో లేదని, సీఎండీ దృష్టికి తీసుకు వెళ్తానని సీసీఐ జీఎం రాజేంద్రషా మంత్రికి తెలిపారు. సీఎండీని పిలిపించి జిన్నర్లతో ఈ నెల 5వ తేదీ లోపు సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన మంత్రికి ఏపీ కాటన్ టీఎంసీ కన్సార్టియం అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్, జాయింట్ సెక్రటరీ మన్నవ హరినాథ్ బాబు, ఎల్ సీటీసీ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చివరి బ్యాచ్‌గా వ్యవసాయ విస్తరణాధికారులకు అవకాశం

అమరావతి, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణ అధికారులు బీఎస్సీ అగ్రికల్చర్ చదవటానికి ఇన్‌సర్వీస్ అభ్యర్థులుగా ఈ ఏడాది చివరి బ్యాచ్‌గా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ఏడాది వ్యవసాయ విస్తరణాధికారులను బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుకు చివరి బ్యాచ్‌గా మాత్రమే కొనసాగించనున్నట్లు బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.



శ్రీశైలం ప్రాజెక్టు రెండు గేట్ల నుంచి లీక్ అవుతున్న నీరు

శ్రీశైలం డ్యాం క్రస్టు గేట్ల నుంచి నీరు లీకేజీ

శ్రీశైలం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం 3, 10 రేడియల్ క్రస్టు గేట్ల నుంచి నీరు లీక్ అవుతోంది. జలాశయానికి వరద ప్రవాహం తగ్గడంతో అధికారులు మంగళవారం రాత్రి గేట్లు మూసివేశారు. అయితే గేట్లకు అమర్చిన రబ్బర్ సీల్స్ దెబ్బతినడంతో నీరు లీక్ అవుతోంది. ఈ విషయంపై జలవనరుల శాఖ సీఈ కబీర్ బాషా మాట్లాడుతూ ప్రస్తుతం లీకేజీ వల్ల ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఈ ఏడాది జలాశయానికి ముందస్తుగా వరద రావడంతో పనులకు ఆటంకం ఏర్పడిందని, త్వరలోనే రబ్బర్ సీల్స్‌ను మార్చడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్యామ్‌ను పరిశీలించిన కేఆర్ఎంబీ ఇన్‌చార్జి చైర్మన్

శ్రీశైలం జలాశయాన్ని కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఇన్‌చార్జి చైర్మన్ బీపీ పాండే, జలవనరుల శాఖ సీఈ కబీర్ బాషా, బోర్డు మెంబర్ కేకే జంగిడ్, డీఈఈ పవన్‌నాథ్, డీఎండీ ఈఈ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. జలాశయం గ్యాలరీ, గేట్స్, ప్లంజ్ పూల్, వరద నీటి చేరికలు, విద్యుదుత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. వీటి గురించి ఈఈ వేణుగోపాల్‌రెడ్డి మ్యాప్ ద్వారా వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆపదలో అఫ్ఘాన్

కుంగదీసే పేదరికం, కనికరం లేని ప్రకృతి, ఆంక్షల కట్టడిలో పాలకులు... అఫ్ఘానిస్తాన్‌ను సదా విడీవిడవని విషాదాలు. విశాల ప్రపంచం ఒక దోసెడు తీరుబాటు చేసుకుని ఆపదలో ఉన్న అఫ్ఘాన్ పట్ల ఒక జానెడు సానుభూతి చూపవలసిన ఆపత్సమయమిది.

నాలుగు సంవత్సరాల క్రితం అఫ్ఘానిస్తాన్‌లో ప్రజాస్వామిక ప్రభుత్వం కూలిపోయింది. మతఛాందసులైన తాలిబన్లు మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకున్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేశారు. పౌర హక్కులను కాలరాచి వేశారు. ఇస్లామిక్ చట్టాలను ఔదలదాల్చారు. ప్రపంచ దేశాల నుంచి సహాయ సహకారాలు నిలిచిపోయాయి. డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధికారానికి వచ్చిన తరువాత అమెరికా నుంచి అందుతున్న మానవతాపూర్వక సహాయమూ పూర్తిగా నిలిచిపోయింది. అఫ్ఘాన్ ప్రజల ఆర్థిక అవస్థలు మరింతగా మిక్కుటమయ్యాయి. ముఖ్యంగా ఆరోగ్య భద్రతా సదుపాయాలు పూర్తిగా కూలబడ్డాయి. తాలిబన్ల పాలనకు న్యాయబద్ధత కల్పించకుండా అఫ్ఘాన్ ప్రజలను ఆదుకోవడమెలా అనే విషయమై అనేక దేశాలు తర్జనభర్జన పడుతున్న తరుణంలో ఆ దేశంపై ప్రకృతి మరొకసారి ఆగ్రహించింది.

ఆదివారం రాత్రి అఫ్ఘానిస్తాన్‌కు ఒక కాళరాత్రి. అఫ్ఘాన్ తూర్పు ప్రాంతంలో సంభవించిన భూ ప్రళయంలో వందలాది ప్రజలు చనిపోయారు. వేలాది జనులు గాయపడ్డారు. రిక్టర్ స్కేల్‌పై 6.3 తీవ్రతతో నమోదైన ఈ భూకంప ప్రభావిత ప్రదేశం మారుమూల, దుర్భేద్యమైన పర్వత శ్రేణుల మధ్య ఉండడంతో పాటు అక్కడి గృహాలు భూకంప తాకిడికి తట్టుకునేవి కాకపోవడంతో మృతుల సంఖ్య మరెంతో అధికంగా ఉండవచ్చు.

అఫ్ఘానిస్తాన్‌కు భూకంపాలు అరుదు కాదు. తరచుగా ప్రాణాంతక భూకంపాలు సంభవించే దేశమది. ముఖ్యంగా ఈశాన్య అఫ్ఘాన్ ఈ ప్రాకృతిక విపత్తులకు నెలవుగా ఉన్నది. రెండు భిన్న టెక్టానిక్ ప్లేట్లు కలిసే హిందూ కుష్ పర్వత ప్రాంతంలో ఉన్న కారణంగా ఈశాన్య అఫ్ఘాన్ భూకంపాల తాకిడికి తరచు గురవుతోంది. 2023 అక్టోబర్‌లో హెరాత్ రాష్ట్రంలో సంభవించిన పెను భూకంపమే అందుకొక తార్కాణం. అప్పుడూ ఇప్పుడూ సంభవించిన ప్రాణనష్టం, ఆస్తినష్టం తక్కువేమీకాదు. అయితే అఫ్ఘాన్‌లో వలే పలు ఇతర దేశాలలో కూడా అంతే తీవ్రతతో సంభవిస్తున్న భూకంపాలలో ప్రాణ నష్టం, ఆస్తినష్టం తక్కువగా ఉంటోంది. అఫ్ఘాన్‌లో ఆ నష్టాలు భారీగా ఉండడానికి కారణమేమిటి?

'భూకంపాలు మనుషులను చంపవు, భవనాలు చంపుతాయి' అని అంటారు. భవనాల నిర్మాణ వైఫల్యం వల్లే భూకంపాల సమయంలో మనుషులు చనిపోవడం లేదా గాయపడడం జరుగుతుందనే వాదన భద్రతా నియమాలను పాటించకుండా నిర్మించిన భవనాలకు వర్తిస్తుంది. ఇది ఒక సరళీకృత వాదనే అయినప్పటికీ అది సూచిస్తున్న వాస్తవం కొట్టివేయలేనిది. ప్రస్తుత అఫ్ఘాన్ భూకంపం మాదిరిగానే 2011లో న్యూజీలాండ్‌లో అంతే తీవ్రతతో సంభవించిన భూ విపత్తులో కేవలం 185 మందే చనిపోయారు. ఆస్తినష్టమూ తక్కువే. ధరిత్రి దక్షిణ అంచున ఉన్న దక్షిణ అమెరికా దేశమైన చిలీలో సైతం రిక్టర్ స్కేల్‌పై 6కు మించిన తీవ్రతతో భూకంపాలు తరచు సంభవిస్తుంటాయి. అయినా ప్రాణనష్టం, ఆస్తినష్టం తక్కువగా ఉంటుంది. ప్రాణనష్టం అసలు ఉండని సందర్భాలే ఎక్కువ అని కూడా చెప్పవచ్చు. భవన నిర్మాణ నిబంధనలు కచ్చితంగా పాటించడం వల్లే ఆ ప్రమాదాలను సమర్థంగా ఎదుర్కోగలుగుతున్నారు. మరి అఫ్ఘాన్‌లో పరిస్థితి భిన్నంగా ఉండడానికి అక్కడి పేదరికమే కారణమని మరి చెప్పనవసరం లేదు.

ఆధునిక భవన నిర్మాణ సామగ్రిని ఉపయోగించుకోగల ఆర్థిక సామర్థ్యం అఫ్ఘాన్లకు లేదు. స్థానికంగా లభించే మట్టి, రాళ్లు, కలపను ఉపయోగించుకున్న గృహాలే అత్యధికంగా ఉంటాయి. ఈ కారణంగానే ఆదివారం రాత్రి భూకంపానికి వేలాది గృహలు నేలమట్టమయ్యాయి. ఆ గృహాలేవీ ఇంజనీర్లు రూపొందించిన ప్రణాళికల ప్రకారం నిర్మాణమయినవి కావు. భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధరీతుల్లో కట్టుకున్న ఇళ్లు అవి. మరి తక్కువ తీవ్రతతో సంభవించిన భూకంపానికి సైతం కూలిపోవడంలో ఆశ్చర్యం లేదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని వారి ఆర్థిక స్థితిగతులకు అనుకూలంగా ఉండే గృహ నిర్మాణ పద్ధతులను ప్రోత్సహించవలసిన అవసరమున్నది. ప్రస్తుత విపత్తు వేళ అఫ్ఘాన్‌కు మన దేశం అందించే సహాయంలో ఆ సులభ, సరళ సాంకేతికతలూ ఉండవలసిన అవసరమున్నది.

పేద ప్రజలకు ముఖ్యంగా భూకంపాల తాకిడి ఎక్కువగా ఉండే ప్రాంతాలలో భద్రమైన గృహ వసతి కల్పనకు వినూత్న పద్ధతులను అభివృద్ధిపరిచిన స్ట్రక్చరల్ ఇంజనీర్ ప్రొఫెసర్ ఆనంద్ స్వరూప్ ఆర్య (1931–2019)ను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవలసి ఉన్నది. అఫ్ఘాన్‌కు కానుకగా కాబూల్‌లో పార్లమెంటు భవనాన్ని నిర్మించిన భారత్, ఇప్పుడు భూకంప బాధిత ప్రాంతాలలో ప్రొఫెసర్ ఆనంద్ నిర్దేశించిన పద్ధతులలో వందలాది గృహాలు నిర్మించి అఫ్ఘాన్లను ఆదుకోవడం సముచితంగా ఉంటుంది.

రాజధానిపై ద్వేషంతోనే ముంపు వాదనలు!

అమరావతి మునిగిపోయిందనే ఒక వార్త మీద కొంచెం తీవ్రంగానే చర్చ జరుగుతోంది. నిర్మాణంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ముంపు నివారణ మార్గాల్ని అన్వేషించడం కోసం ఈ చర్చ జరుగుతూ ఉంటే దాన్ని అందరూ ఆహ్వానించాలి. అలా కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు అసలు రాజధానే లేకుండా చేయడానికి ఈ వాదనలు ముందుకు వస్తుంటే మాత్రం తీవ్రంగా ఖండించాలి. ఏ ప్రాజెక్టుకు అయినా అనుకూలతలు, ప్రతికూలతలు రెండూ ఉంటాయి. అనుకూలతల్ని పూర్తిగా వాడుకుంటూ ప్రతికూలతల్ని తగ్గించుకోవడమే మానవ ప్రయత్నం.





విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద నీటి విడుదల గరిష్ట సామర్థ్యం 11 లక్షల 90 వేల క్యూసెక్కులు. గత ఏడాది సెప్టెంబరు 1, 2 తేదీల్లో 11 లక్షల 80 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించింది. గోదావరి, కృష్ణా వరదలకు తోడు బుడమేరు పొంగింది. ఆ రోజు ఇంకొక్క శాతం వరద పెరిగి వుంటే జలప్రళయం సంభవించేది. ఆ నష్టాన్ని ఊహించడానికి కూడా భయం వేస్తుంది. చిత్రం ఏమంటే– రెండు వారాల్లో ప్రజాజీవితం సాధారణ స్థితికి చేరుకుంది. జీవన సౌందర్యం అంటే అదే!

1964 అక్టోబరు నెలలో కృష్ణా నదికి దాదాపు 10 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. విజయవాడ పరిసరాల్లో నదీతీరాన్న ఉన్న నివాసాలు వేల సంఖ్యలో కొట్టుకుపోయాయి. విఖ్యాత ఇంజనీరు డా. కె.ఎల్. రావు పర్యవేక్షణలో విజయవాడ ముంపు ప్రమాదాన్ని నివారించడానికి ఎత్తైన కరకట్ట నిర్మించారు. నదీ పరీవాహక ప్రాంతంలో నివాసాలు ఏర్పరచుకున్నవారిని నగరం వెలుపల ఉన్న ప్రాంతాలకు తరలించారు. అజిత్‌సింగ్ నగర్ తదితర ప్రాంతాలు అలా ఏర్పడ్డాయి. తరువాతి కాలంలో అనేక ఆసక్తికర పరిణామాలు జరిగాయి. కరకట్ట నేషనల్ హైవేగా మారింది. హైవేకు అవల నదీ పరివాహక ప్రాంతంలో మళ్ళీ నివాసాలు వచ్చి కృష్ణలంక, పడమటి లంక ఏర్పడ్డాయి. అక్కడ ఇప్పుడు ఓ పది మునిసిపల్ డివిజన్ల జనం నివసిస్తున్నారు. ప్రతి ఐదేళ్ళకో, పదేళ్ళకో వరద నీళ్ళు నివాసాల్లోకి వచ్చేసి ముంచేస్తుంటుంది. దాంతో వాళ్లు ఆందోళనలు చేసి ఇటీవల రిటైనింగ్‌వాల్ కట్టించుకున్నారు. వరద ముప్పును తప్పించుకున్నారు.

ఈ కథ ఇంతటితో ముగియలేదు. 1960లలో కృష్ణా వరద నిర్వాసితులుగా అజిత్‌సింగ్ నగర్ చేరినవాళ్ళు అక్కడా ఇంకో పది డివిజన్ల మేర పెరిగారు. విజయవాడ దుఃఖదాయినిగా భావించే బుడమేరు పరీవాహక ప్రాంతంలోనికి కూడా విస్తరించారు. ఐదేళ్ళకో, పదేళ్ళకో ఒకసారి బుడమేరు కూడా పొంగుతుంటుంది. నివాసాలు మునుగుతుంటాయి. నాలుగు రోజులు రెవెన్యూశాఖ రిలీఫ్ క్యాంపులు నిర్వహిస్తుంది. మళ్ళీ సాధారణ జీవితం మొదలవుతుంటుంది.

> **వర్షమో వరదో ఏదో ఒక సాకు చూపి అమరావతిలో రాజధాని నిర్మాణాన్ని ఆపాలని ఒక సమూహం సోషల్ మీడియాలో ప్రత్యేకంగా పోరాడుతోంది. వీరి వాల్ లోనికి వెళ్ళి చూస్తే వైసీపీతో రాజకీయ అనుబంధం కనిపిస్తుంది. జాగ్రత్తగా గమనిస్తే రాష్ట్రానికి అసలు రాజధానే లేకుండా చేసే పథకం జగన్ మూడు రాజధానుల సిద్ధాంతంలో కనిపిస్తుంది.**

గత ఏడాది బుడమేరు మరీ విజృంభించింది. దాదాపు లక్షమందిని బాధితులుగా మార్చేసింది. ముంపు ప్రాంతాల్లోని నివాసాలను తొలగించాలని కొందరు మేధావులు ప్రభుత్వానికి ఉచిత సలహాలు పడేశారు. గట్టున ఉన్నవాళ్లకన్నా నిండా మునిగిన వాళ్ళకు పరిష్కారాలు తోస్తాయి. వాళ్లు కొంచెం విజ్ఞానాన్ని ప్రదర్శిస్తారు. పాములా మెలికలు తిరిగే బుడమేరులో వరద నీరు వేగంగా ప్రవహించదు. అంచేత ముంపు ఎక్కువ రోజులు ఉండిపోతుంది. బుడమేరు స్ట్రెయిట్ కట్ నిర్మిస్తే ప్రవాహ వేగం పెరిగి సమస్య పరిష్కారం అవుతుంది. రిటైనింగ్ వాల్ కూడా నిర్మిస్తే ఇంకా సురక్షితం.

కృష్ణానదికి ఎడమగట్టున బుడమేరు కలిసినట్టే కుడిగట్టున కొండవీటి వాగు కలుస్తుంది. దీనికి కూడా అమరావతి దుఃఖదాయని అనే పేరుంది. దీనిని అమరావతి వరప్రదాయనిగా మార్చడం ఎలా అన్నది మన ముందున్న సవాలు. మనకు నిజామ్ ఉదాహరణ ఉంది. 1908 సెప్టెంబరు 28న మూసీనదికి కనీవినీ ఎరుగని వరదలొచ్చి హైదరాబాద్‌ను ముంచెత్తాయి. కనీసంగా 15వేల మంది చనిపోయారు. అప్పటి నిజాం మీర్ మహబూబ్ అలీ ఖాన్ సుప్రసిద్ధ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆహ్వానించి మూడు పనులు అప్పజెప్పాడు: మొదటిది మూసీ వరద క్రమబద్ధీకరణ, రెండోది ముంపు నివారణ, మూడోది తాగునీటి సరఫరా పథకాల రూపకల్పన. 1912లో నిజాం పాలకుడిగా మారిన మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ ఈ పథకాల నిర్మాణాలను చేపట్టాడు. వరదల్ని చూసి భయపడి దుకాణం బంద్ చేద్దామని అనుకోకపోగా, మూసీ నదిలో చేపపిల్లలు లక్షలు కోట్లుగా పెరుగుతున్నట్టు హైదరాబాద్ జనాభా పెరగాలని ఉస్మాన్ ఆలీ ఖాన్ కోరుకున్నాడట. జనాభా పెరుగుదలకు అవసరమయ్యే తాగునీటిని అంచనా వేసి అప్పుడే పటిష్ఠమైన ఏర్పాట్లు చేశాడు. ఆయన కోరుకున్నట్టే హైదరాబాద్ జనాభా కోటి దాటింది. ఆ కాలంలో నిజాం నవాబు నిర్మించిన చెరువులే 1990వ దశాబ్దం వరకూ హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించాయి.

కృష్ణానది కన్నా కొండవీటి వాగు పల్లంలో ఉంటుందని చాలామంది అంటుంటారు. ఇది పాక్షిక సత్యం మాత్రమే. కృష్ణానది ప్రశాంతంగా ప్రవహిస్తున్నపుడు కొండవీటి వాగు సహజంగానే పైనుంచి అందులో కలుస్తుంది. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు నది నీటి మట్టం 27 అడుగుల వరకు పెరుగుతుంది. అప్పుడు వాగులో నీటిని నదిలోనికి ఎత్తిపోయాలి. అలాగే వాగులో వరద లేనప్పుడు కృష్ణానది నీటిని రివర్సబుల్ పంపింగ్ స్కీమ్ ద్వారా ఎత్తిపోయవచ్చు. పంపింగ్ స్కీమ్‌కు ఇప్పుడున్న సామర్థ్యం సరిపోకపోతే దాన్ని పెంచుకోవచ్చు. అలాగే, 29గ్రామాల రాజధాని ప్రాంతంలో ఇతర వాగులతోపాటు కొన్ని చెరువులు కూడా ఉన్నాయి. వీటివల్ల తలెత్తే సమస్యల్ని పరిష్కరించడం కూడా అసాధ్యమేమీ కాదు.

ఈ ఏడాది కృష్ణా వరద ప్రమాద హెచ్చరికల స్థాయికి చేరుకున్నా నది నీళ్ళు కరకట్ట దాటలేదు. అమరావతి లోనికి వరద నీరు ప్రవేశించలేదు. ఆగస్టు 12 నుంచి 19 వరకు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీగా వర్షాలు కురిశాయి. అయినా, అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రమాదకర ముంపు అంటూ ఏమీలేదు. అయితే, దీనికి ఒక మినహాయింపు ఉంది. రాయపూడిలో ఒక్కొక్కటి నలభై అంతస్తులుగల నాలుగు ఐకానిక్ టవర్స్ నిర్మిస్తున్నారు. వాటికోసం 100–150 అడుగులకు పైగా పునాది స్తంభాలు (పైల్స్) దించుతున్నారు. ఇక్కడ ఉన్న మూడు టవర్లలో నాలుగో టవర్‌లో వర్షం నీరు చేరింది. పంపు సెట్లు పెట్టి నీళ్ళు తోడుతున్నారు. వర్షాకాలంలో సాగే భవన నిర్మాణపు పనుల్లో ఈ ఇబ్బందులు సహజం. వర్షమో వరదో ఏదో ఒక సాకు చూపి అమరావతిలో రాజధాని నిర్మాణాన్ని ఆపాలని ఒక సమూహం సోషల్ మీడియాలో ప్రత్యేకంగా పోరాడుతోంది. వీరి వాల్ లోనికి వెళ్ళి చూస్తే వైసీపీతో రాజకీయ అనుబంధం కనిపిస్తుంది.

వైయస్ జగన్ మూడు రాజధానుల ప్రతిపాదనలో భాగంగా అమరావతిలో శాసన రాజధానిని కొనసాగిస్తామన్నారు. కానీ, వైసీపీ అభిమానులు దానికి ఒప్పుకుంటున్నట్టు లేరు. ఆ మధ్య మంగళగిరి–కాజా దగ్గర క్లౌడ్ బరస్ట్ లాంటి వర్షం కురిసింది. ఆ కారణంగా రాజధాని నిర్మాణాన్ని అమరావతిలో ఆపి, నల్లమల అడవులకు మార్చాలని కొందరు సూచిస్తున్నారు. నల్లమల అడవుల్లో ఏకంగా క్యుమిలోనింబస్ వర్షాలు కురిసిన దాఖలాలున్నాయి. వాటి కారణంగా మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి చనిపోయారన్న విషయాన్ని వైసీపీ అభిమానులు ఇంత త్వరగా మరచిపోవడం ఆశ్చర్యకరం!

జగన్ మూడు రాజధానుల సిద్ధాంతం పైకి సమపంపకంగా కనిపిస్తుంది గానీ, అందులో ఒక బూటకం ఉంది. అమరావతిలో శాసన రాజధాని నిర్మాణాలను ఆయన ప్రభుత్వం కొనసాగించలేదు. విశాఖపట్నంలో పాలనా రాజధాని కోసం నిర్మాణాలను మొదలెట్టలేదు. కర్నూలులో న్యాయ రాజధాని నిర్మాణం అనేది ఆయన చేతుల్లో లేదు. రాష్ట్ర హైకోర్టు ఎక్కడ పెట్టాలనే అంశంపై రాష్ట్రపతి ఉత్తర్వులివ్వాలి, భారత ప్రధాన న్యాయమూర్తి జడ్జీలను నియమించాలి. అన్ని అనుమతులు వచ్చాక హైకోర్టు భవనాన్ని నిర్మించడం, నిర్వహణ భారం మోయడం ఒక్కటే రాష్ట్ర ప్రభుత్వం పని. జాగ్రత్తగా గమనిస్తే రాష్ట్రానికి అసలు రాజధానే లేకుండా చేసే పథకం జగన్ మూడు రాజధానుల సిద్ధాంతంలో కనిపిస్తుంది.

రాజధాని నిర్మాణం విషయంలో వైయస్ జగన్, చంద్రబాబులవి పరస్పర విరుద్ధ దృక్పథాలు. తప్పనిసరిగా చేయాల్సిన పనుల్ని కూడా జగన్ చేయరు. చేయలేని పనుల్ని కూడా చంద్రబాబు చేస్తానంటారు. రాజకీయ విభజన ఏ దశకు చేరుకుందంటే ఏపీకి రాజధాని కావాలని కోరేవాళ్ళు తెలుగుదేశం; రాజధాని అక్కరలేదనేవారు వైసీపీగా తయారైంది. చంద్రబాబు మార్కు అతిశయాలను అదుపు చేయడం వేరు, అసలు రాష్ట్రానికి రాజధానే లేకుండా చేయడం వేరు.



• డానీ
సమాజ విశ్లేషకులు

విఫల విధానం నుంచి విప్లవాత్మకం దాకా!

విదేశాంగ విధానం ఏ దేశానికైనా బాహ్య ప్రపంచంలో ఆ దేశ ప్రతిష్ఠను ప్రతిబింబించే అద్దం లాంటిది. ఒక దేశం లోపల ఎంత బలంగా ఉన్నా, అంతర్జాతీయ వేదికలపై తన గళాన్ని వినిపించుకోలేకపోతే ఆ బలం వృథా అవుతుంది. 2004–2014 మధ్య కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాల కాలం భారత విదేశాంగ చరిత్రలో అనేక విమర్శలకు గురైంది. ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ వ్యక్తిగతంగా శాంతమూర్తి, మితభాషి, ఆర్థిక శాస్త్రవేత్త అయినప్పటికీ, దేశాన్ని ముందుకు నడిపించే విషయంలో ధైర్యం, పట్టుదల, దూరదృష్టి లోపించిందని విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా, సోనియాగాంధీ ప్రభావం ప్రధానమంత్రి కార్యాచరణపై ఎక్కువగా ఉండడంతో, ఆయన ఒక 'రిమోట్ కంట్రోల్' చేతిలో ఉన్న మరబొమ్మలా మారిపోయారని అంతర్జాతీయ పత్రికలు కూడా వ్యాఖ్యానించాయి. 2008 ముంబయి ఉగ్రదాడులు భారతదేశాన్ని కుదిపేశాయి. వందలాది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. దాడులకు పాక్ ప్రేరేపిత సంస్థలు కారణమని స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ, యూపీఏ ప్రభుత్వం పాకిస్థాన్‌పై కఠిన చర్యలు తీసుకోలేకపోయింది. 2013లో డెప్సాంగ్ లోయలో చైనా సైన్యం 19 కిలోమీటర్లు చొచ్చుకువచ్చి వారాల తరబడి గుడారాలు వేసి కూర్చుంది. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాంతాన్ని కాపాడటంలో యూపీఏ ప్రభుత్వం విఫలమైంది. దీనిని 'చిన్న సంఘటనలు' అని తేలికగా తీసుకోవడం భారత భద్రతను బలహీనపరచింది. విదేశాంగ విధానం అంటే కేవలం ఒప్పందాలు, సమావేశాలు కాకుండా శత్రువులకు తగిన సమాధానం ఇవ్వడం కూడా.



యూపీఏ ప్రభుత్వాల కాలంలో భారత విదేశాంగ విధానం అనేక విమర్శలకు గురైంది. ఎన్డీయే పాలనలో ఆ విధానం కొత్త పుంతలు తొక్కింది. మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇందులో విప్లవాత్మక మార్పు వచ్చింది.

ఎన్డీయే పాలనలో భారత విదేశాంగం కొత్త పుంతలు తొక్కింది. ముఖ్యంగా అటల్ బిహారీ వాజపేయి కాలంలో ధైర్యం, శాంతి అనే ద్వంద్వ లక్షణాలను ప్రపంచానికి చూపింది. 1998 పోఖ్రాన్–2 అణు పరీక్షలతో భారత్ శాశ్వత అణు శక్తిగా నిలిచింది. ఆంక్షల బెదిరింపులను ఎదుర్కొని, అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌తో సంబంధాలను మెరుగుపరచడం ఆయన దౌత్య నైపుణ్యానికి నిదర్శనం. 1999లో పాక్ కార్గిల్ చొరబాటు సమయంలో భారత సైన్యం ధైర్యంగా పోరాడి, అమెరికా, చైనా వంటి దేశాలను కూడా పాక్ తప్పిదాన్ని అంగీకరింపజేయడం వాజపేయి ప్రభుత్వానికి గొప్ప విజయం. అదే సమయంలో లాహోర్ యాత్ర, ఆగ్రా చర్చలు వంటి శాంతి ప్రయత్నాలు కూడా జరిగాయి.

2014లో మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే భారత విదేశాంగ విధానంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. ఆయన దూకుడు, స్పష్టమైన జాతీయ హితం అనే లక్ష్యంతో ముందుకు సాగారు. 2017లో డోక్లాం ఘర్షణలో చైనా బహిరంగ యుద్ధ బెదిరింపులకు భారత్ వెనక్కి తగ్గకుండా 73 రోజులపాటు నిలబడి, చివరికి చైనాను వెనక్కి తగ్గించగలిగింది. 2020 గాల్వాన్ ఘర్షణ తరువాత మౌనం కాకుండా ఆర్థిక చర్యలు తీసుకుని, వందలాది చైనా యాప్‌లను నిషేధించడం, సైనిక బలం పెంచడంతో పాటు అంతర్జాతీయ వేదికలపై చైనాను ఎదుర్కొంది. ఉగ్రవాదంపై మోదీ ప్రభుత్వం చూపిన కఠిన వైఖరి భారత విదేశాంగ విధానాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లింది. యురి దాడి తరువాత సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా దాడి తరువాత బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్ అంతర్జాతీయంగా భారత నిర్ణయాత్మకతను నిరూపించాయి. ఈ ఏడాది జమ్ము–కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన దాడి తరువాత ఆపరేషన్ సిందూర్ నిర్వహించి పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయడం, సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయడం ద్వారా "భారత్ ఇకపై రాజీ పడదు" అని స్పష్టంగా తెలిపింది.

మోదీ విదేశాంగ విధానంలో మరో ప్రధాన బలం ఆర్థిక, సాంకేతిక స్వయం సమృద్ధి. 'ఆత్మనిర్భర్ భారత్', 'మేక్ ఇన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' వంటి కార్యక్రమాలు అంతర్గత అభివృద్ధికే కాక, విదేశాంగంలోనూ భారత్ ప్రతిష్ఠను పెంచాయి. రక్షణ రంగంలో ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి సొంత ఉత్పత్తులు, యుద్ధ ట్యాంకులు, జెట్లు భారత్ తయారు చేస్తోంది. రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు యూపీఏ కాలంతో పోలిస్తే ఇరవై రెట్లు పెరిగాయి. ఆర్థిక రంగంలో 2005–2014లో వచ్చిన ఎఫ్‌డీఐ 304 బిలియన్ డాలర్లు కాగా, 2014–2024లో అది 667 బిలియన్లకు చేరింది. డిజిటల్ ఇండియా కింద యూపీఐ వ్యవస్థ ఇప్పటికే సింగపూర్, యూఏఈలలో అమలులో ఉంది; మరో 20 దేశాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాయి.

2023లో న్యూఢిల్లీలో నిర్వహించిన జీ–20 సమ్మేళనం విజయవంతంగా సాగింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వల్ల విభేదాలు ఉన్నా, భారత్ చొరవతో ఏకగ్రీవ తీర్మానం ఆమోదమైంది. BRICSలో భారత్ కీలక పాత్ర పోషించింది. QUAD వేదికలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కలిసి ఇండో–పసిఫిక్‌లో చైనా ప్రభావాన్ని తగ్గించడంలో భాగస్వామ్యం అయింది.

మోదీ విదేశాంగంపై కొందరు అమెరికా సుంకాలు, ట్రంప్ వ్యాఖ్యలు, పొరుగు దేశాల సమస్యలను చూపిస్తూ విమర్శలు చేశారు. కానీ ట్రంప్ వ్యాఖ్యలను పట్టించుకోకపోవడం మౌన రాజదౌత్యం. అమెరికా సుంకాల సమస్యకు ప్రతిగా భారత్ కొత్త మార్కెట్ల వైపు దృష్టి పెట్టడం, PLI పథకాల ద్వారా పరిశ్రమలకు ఊతం ఇవ్వడం దీర్ఘకాలిక వ్యూహం. మొత్తంగా చూస్తే, యూపీఏ కాలంలో కనిపించిన బలహీనతలు, నిస్సహాయతలు ఇప్పుడు గతం. ఎన్డీయే నాయకత్వంలో భారత్ ప్రపంచంలో ఒక తరహా వినిపించే పేరుగా కాక, నిర్ణయించే పేరుగా మారింది. ఇది ప్రతి భారత పౌరుడికీ గర్వకారణం.

○ నాగోతు రమేశ్‌నాయుడు
ప్రధాన కార్యదర్శి, బీజేపీ, ఆంధ్రప్రదేశ్

ధైర్యం, నిబద్ధతకు ప్రతీక

నిజాయితీ, ధైర్యం, ప్రజాసేవ– ఇవే ఉమేశ్ చంద్ర వారసత్వం. చిన్న వయసులోనే దివికేగినా ఆయన గాథ నేటి పోలీస్ అధికారులకు, యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ప్రజాసేవే పరమ ధర్మమని ఆయన జీవితం చాటి చెప్పింది. "నిజాయితీతో నిలిచినవారు మరణించినా, వారి పేరు ఆచంద్రార్కం నిలుస్తుంది."

1966 మార్చి 29న గుంటూరు జిల్లా పెదపూడి గ్రామంలో జన్మించిన ఉమేశ్ చంద్ర చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, సత్యనిష్ఠకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. హైదరాబాదు పబ్లిక్ స్కూల్‌లో విద్యనభ్యసించి, నిజాం కాలేజీలో ఎకనమిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. ఆ తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో ఎకనమిక్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. విద్యలో అగ్రగామిగా ఉన్న ఆయన, ప్రజలకు సేవ చేయాలనే తపనతో 1991లో ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపికయ్యారు.



నేషనల్ పోలీస్ అకాడమీ శిక్షణ దశలోనే ఆయన కఠిన శ్రమ, ధైర్య స్వభావం అందరినీ ఆకట్టుకుంది. తరువాతి దశలో ఎక్కడ పనిచేసినా వినిపించిన ఒకే ఒక్క మాట– 'ఉమేశ్ చంద్ర అంటే ధైర్యానికి పర్యాయపదం'. వరంగల్‌లో ఏఎస్పీగా పనిచేస్తూ నక్సలైట్ల ఉనికిని సవాల్‌గా తీసుకున్నారు. తరువాత కడప ఎస్పీగా పని చేసి ఫ్యాక్షన్ కలహాలను అణచివేసి 'కడప సింహం'గా పేరుగాంచారు. కరీంనగర్‌లో నక్సలైట్లను అణచి శాంతి స్థాపనలో కీలక పాత్ర పోషించారు. చివరగా ఏఐజీ (క్రీడలు, సంక్షేమం)గా సేవలందించారు.

ప్రజల సమస్యలను స్వయంగా వినడం, పోలీస్ స్టేషన్లను ప్రజలకు అండగా మార్చడం ఉమేశ్ చంద్ర ప్రత్యేకత. సాధారణ ప్రజల పట్ల మమకారం చూపుతూ, నేరస్థుల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించారు. కడపలో ఆయనను 'ప్రజల పోలీస్' అని పిలిచేవారు. ఆయన బదిలీ వార్త తెలిసి ప్రజలు రోడ్డెక్కి కన్నీరు మున్నీరయ్యారు. రోడ్డుపై బారులు తీరి, వాహనం వెంబడి పరుగులు పెడుతూ తమ కుటుంబసభ్యునికే దూరం జరుగుతున్నంతగా ఆందోళన చెందారు. పోలీసు చరిత్రలో ఓ అధికారికి అలాంటి వీడ్కోలు లభించటం అత్యంత అరుదైన గౌరవం.

1999 సెప్టెంబర్ 4– హైదరాబాద్‌లో ఇంటి నుంచి కారులో పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు వెళుతున్న ఉమేశ్ చంద్రపై ఎస్.ఆర్. నగర్ సెంటర్ వద్ద నక్సలైట్లు కాల్పులు జరిపారు. ఈ దాడి రాష్ట్రాన్ని కుదిపేసింది. ప్రతి తెలుగువాడిని ఉలిక్కిపడేలా చేసింది. అకస్మాత్తుగా దాడి జరిగినా, ఆయన ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. చేతిలో ఆయుధం లేకపోయినా ధైర్యంగా ఎదురు తిరిగారు. దుండగులను నిలువరించడానికి ప్రయత్నించారు. వాహనంపై కాల్పులు మొదలైన క్షణం నుంచే ఆయన ఎదురు దాడి చేయడానికి యత్నించారు. రక్తస్రావం జరుగుతున్నా, క్షణం ఆలస్యం చేయకుండా సహచరులను రక్షించే ప్రయత్నం చేశారు. క్షణాల వ్యవధిలో గన్‌మాన్ రామచంద్రారెడ్డి, డ్రైవర్ సత్యనారాయణ బలయ్యారు. అయినా ఉమేశ్ చంద్ర వెనుకంజ వేయలేదు. చివరి శ్వాసవరకూ పోరాడుతూనే ఉన్నారు. చేతిలో తుపాకీ లేనప్పటికీ కారు దిగిన ఆయన, నక్సలైట్ల వెంటపడి వారిని కొంత దూరం తరిమారు. అయితే ఉమేశ్ చంద్ర వద్ద రివాల్వర్ లేదని గుర్తించిన నక్సలైట్లు ఎదురు తిరిగి బుల్లెట్ల వర్షం కురిపించారు. అవి ఆయన శరీరాన్ని ఛిద్రం చేశాయి. రక్తపు మడుగులో ఆయన కుప్పకూలిపోయారు. కేవలం మృత్యువు మాత్రమే ఆయన సాహసాన్ని నిలువరించగలిగింది. ఆ క్షణాలు పోలీస్ చరిత్రలో అమరగాథగా నిలిచాయి.

ఉమేష్ చంద్ర మరణం రాష్ట్రాన్ని కదిలించింది. ప్రజలు విగ్రహాలు ప్రతిష్ఠించారు. 2000 సంవత్సరంలో సంజీవరెడ్డినగర్ కూడలిలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఆయన వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ నివాళులు అర్పించడం మంచి సంప్రదాయంగా మారింది. పోలీస్ శిక్షణా శిబిరాల్లో ఆయన జీవితం పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. కడప, హైదరాబాద్, తెనాలిలో ఆయన పేరుతో ఏర్పాటైన రహదారులు, విగ్రహాలు నిరంతర స్ఫూర్తికి చిహ్నాలుగా నిలుస్తున్నాయి.

• రవికుమార్ బొప్పన
సీనియర్ పాత్రికేయులు

(నేడు ఉమేష్ చంద్ర 26వ వర్ధంతి)

తల్లడిల్లిన తోటి తల్లుల మాటేమిటి?

'నాన్నా నిన్ను చివరి చూపు చూస్తానా' అంటూ స్నేహలత మల్ల రాసిన వ్యాసం (ఆంధ్రజ్యోతి – ఆగస్టు 8) చదివాక అన్యాయంగా నక్సల్స్ చేత చంపబడ్డ వందలాదిమంది బిడ్డల తల్లుల హృదయాలు జ్ఞప్తికి వచ్చాయి. నక్సల్స్‌కు ఏదన్నా జరిగినప్పుడు పదుల సంఖ్యలో గొంతులు 'వసంత మేఘా'ల్లా గర్జిస్తాయి. కానీ అదే నక్సల్స్ చేతుల్లో చనిపోయిన ప్రజలు, రక్షణ దళాల సభ్యుల తరఫున ఒక్క గొంతు కూడా పెగలదు.

ఇంకా తన తండ్రి సజీవంగా ఎక్కడో ఉన్నాడన్న సమాచారం తెలిసి కూడా స్నేహలత అంత మథనపడుతున్నదే! మరి సమాజంలో అందరి మధ్యా రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ పాలనలో బతుకుతున్న తమ బిడ్డల్ని అకారణంగా తుపాకీ తూటాలతో కాల్చి చంపితే, ఇక తమ బిడ్డలు లేరనీ, రారనీ తెలిసిన ఆ తల్లుల బాధ ఇంకెంత తీవ్రంగా ఉంటుంది? యుద్ధంలో తన తండ్రి క్షేమాన్ని కోరుతున్న స్నేహలత ఆ వ్యాసంలో తన తండ్రి చేత చంపబడ్డ వారి విషయాన్ని మాత్రం కనీసం తలచుకోలేదు, ఆమెకు ఆ విషయంలో ఏ పశ్చాత్తాపమూ లేదు. పోనీ ఒక బిడ్డగా తన తండ్రిని తిరిగి రమ్మనో, మాతో మా కుటుంబంతో కలిసి ఉండాలనో రాస్తారేమో అనుకొని వ్యాసాన్ని ఆసాంతం చదివినా గానీ అలాంటి మాటలు కూడా ఎక్కడా కనపడలేదు. సరికదా తండ్రి తన యుద్ధంలో విజయం సాధించాలని రాశారు. అంటే ఇంకా వందలాదిమందిని పొట్టన పెట్టుకొని వందలాదిమంది తల్లులు తల్లడిల్లేలా రక్తం ఏరులై పారాలని ప్రోత్సహిస్తున్నట్టే కదా!

కరడుకట్టిన మృగాలుగా క్యాంపస్ హాస్టళ్లపైనా, గ్రామాలపైనా పడి క్రూరంగా చిత్రహింసలు పెట్టి కొంతమందినీ, విచక్షణారహితంగా తుపాకులతో కాల్చి ఎంతో మందినీ చంపిన నక్సల్స్ ముఠా నాయకుడు తన తండ్రి అయినందుకు పశ్చాత్తాపం ఏ మాత్రం చూపించకపోగా, ఆమె ఇలా తన తండ్రిపై అవ్యాజమైన ప్రేమను సమాజానికి చాటి చెప్పటం ద్వారా ఎలాంటి సందేశం ఇవ్వాలనుకున్నారు? కనీసం తన తండ్రి నమ్మిన కాలం చెల్లిన సిద్ధాంతం నేటి ఆధునిక సమాజానికి సరిపోదని, తిరిగి జనజీవన స్రవంతిలో కలవమనీ చెపితేనన్నా బాగుండేది. అలాగాక, అదొక యుద్ధం అంటూ మళ్ళీ దానికి అందమైన పేరొకటి పెట్టి నరహంతక ముఠా నాయకులను సమాజానికి హీరోలుగా చూపించే ప్రయత్నం చేశారు.

ఆమె తండ్రి మూడోవంతు జీవితాన్ని ఏ సమాజహితానికి అంకితం చేశారు? ఏ అభివృద్ధికి, ఏ దేశ నిర్మాణానికి త్యాగం చేశారు? వివరిస్తే బాగుండేది. సంఘ విచ్ఛిన్నకర నక్సల్ నాయకుడిని స్వాతంత్ర్య వీరులతో, దేశోద్ధారకులతో పోల్చడం నిజంగా ఆ స్వాతంత్ర్య వీరులని అవమానించడమే అవుతుంది. ఆ మాటకొస్తే శ్రీకాకుళం రైతాంగ పోరాటం నుంచి తెలంగాణ సాయుధ పోరాటం వరకు జరిగిన కమ్యూనిస్టుల అకృత్యాలు మొదలుకొని, నక్సల్‌బరి నుంచి నేటి మావోయిస్టు ఉద్యమం వరకు జరిగిన మైదాన పోరాటాలు, అజ్ఞాత పోరాటాల చరిత్ర సమస్తం రక్తసిక్తమే! మైదాన ప్రాంతాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయాల్లో పాల్గొనే కమ్యూనిస్టు నాయకులు కొన్నిసార్లు అజ్ఞాతంలోని తమ సోదరులకు అండదండలుగా ఉంటూ వారి ఎదుగుదలకు సహకరిస్తూ రెండు రకాలుగానూ సమాజానికి తీవ్ర నష్టం చేశారు. ఈ దేశానికి, ఈ కాలానికి అనువుగాని, సరితూగని సిద్ధాంతాన్ని బలవంతంగా, క్రూరంగా ఈ దేశ ప్రజలపై రుద్దేందుకు విఫల యత్నం చేస్తూనే వచ్చారు. శ్రీకాకుళ ప్రాంతం నుంచి తెలంగాణ వరకు తెలుగు నేలపై జమీందారీ, భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గ నిర్మూలన పేరిట అమాయకుల తలలను నరికి ఉట్లపై పెట్టి, రచ్చబండపై వేలాడతీసి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేయటం, ప్రజా కోర్టులో శిక్షలు అంటూ నడి ఊరిలో భార్యా బిడ్డల ముందే సజీవంగా కాల్చి చంపడం, విప్లవం పేరిట సమాజ నిర్మాణం అంటూ, భూమి, భుక్తి, విముక్తి అంటూ... ఇలా లెక్కకు మిక్కిలిగా వారు సాగించిన దురాగతాలను, నరమేధాన్ని చరిత్రపుటల్లో చేర్చాల్సిన అవసరం ఉంది.

> **వందలాదిమంది విద్యార్థులని, పోలీసుల్ని, అమాయకపు పౌరుల్ని మట్టుపెట్టిన నక్సల్స్ నేతపై కూతురిగా స్నేహలతకు ప్రేమ ఉండొచ్చు కానీ దాన్ని బహిరంగంగా వ్యక్తం చేసి వందల మంది తల్లుల శోకాన్ని మళ్లీ తట్టిలేపటం క్రూరత్వమే అవుతుంది. అంతేగాక, రాజ్యాంగ వ్యతిరేకశక్తులకు, చట్టవిరుద్ధ భావజాలానికి వత్తాసు పలుకుతూ, కీర్తిస్తూ ఇంకా ఎంతోమంది యువతను ఆ సిద్ధాంతం వైపు ప్రేరేపించటం ఏ మాత్రం మంచి విషయం కాదు.**



భవిష్యత్తులో ఆచరణ సాధ్యం అవుతుందో లేదో తెలియని మార్క్స్ అనే గతి తార్కిక మేధావి వల్లె వేసిన మాటల్ని నిజం చేయాలన్న తపనలో లక్షల కోట్ల ప్రజాధనాన్ని తగలబెట్టి; వందల మంది అమాయకుల్ని, దేశ రక్షణ కోసం పనిచేసే భద్రతా దళాలను కిరాతకంగా చంపుతూ; తమ దుశ్చర్య ఎంత అమానుషంగా విజయవంతం అయితే తమ సిద్ధాంతం అంత విజయవంతం అవుతుందని భావించే తండ్రినీ, దేశంపై ఆయన చేసున్న యుద్ధాన్నీ కీర్తిస్తూ రాయటం ఆ కూతురికి మాత్రమే ఆనందాన్ని మిగల్చగలదు. గోరుముద్దలు, చందమామ కథలు, అమ్మ ఒడి అంటూ ఆమె పేర్చిన పదాల కూర్పును వందలాది అమ్మలకు ఎందుకు అన్వయించరు?

తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఉస్మానియా, కాకతీయ, ఆర్‌ఈసీలలో 70వ దశకం నుండి 90వ దశకం చివరి వరకు సాగిన నక్సల్స్ విధ్వంసకాండ, వారు సాగించిన మారణహోమం గురించి ఇప్పటికీ కథలుగా చెప్తారు. ఎంతోమంది జాతీయవాదుల్ని, ఏబీవీపీ, ఆరెస్సెస్ నాయకుల్ని బహిరంగంగా కాల్చి చంపిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. కృష్ణ వర్ధన్, సామ జగన్మోహన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, పూజారి మాణిక్యం, ఏచూరి శ్రీనివాస్, మధుసూదన్‌గౌడ్, మేరెడ్డి చంద్రారెడ్డి లాంటి ఎంతోమంది విద్యార్థి నాయకులు నక్సలైట్ల నరమేధానికి బలయ్యారు. ఆ కుటుంబాల్ని కదిలిస్తే కన్నీళ్లు ఇప్పటికీ ఏరులై పారుతాయి. పాతికేళ్ళ నవయువకులైన తమ బిడ్డల్ని కళ్ళ ముందు బహిరంగంగా, అకారణంగా కాల్చి చంపితే ఆ తల్లుల బాధ ఎలా ఉంటుందో సాటి తల్లులకే తెలుస్తుంది. చదువుకునేందుకు వెళ్లిన కొడుకు శవంగా మారి ఇంటికి వస్తే తల్లడిల్లిన ఆ గుండెకే ఆ బాధ అర్థం అవుతుంది. అలాంటి వందలాదిమంది విద్యార్థులని, పోలీసుల్ని, అమాయకపు పౌరుల్ని మట్టుపెట్టిన నక్సల్స్ నేతపై కూతురిగా ఆమెకు ప్రేమ ఉండొచ్చు కానీ దాన్ని బహిరంగంగా వ్యక్తం చేసి, వందల మంది తల్లుల శోకాన్ని మళ్లీ తట్టిలేపటం క్రూరత్వమే అవుతుంది. అంతేగాక, రాజ్యాంగ వ్యతిరేకశక్తులకు, చట్టవిరుద్ధ భావజాలానికి వత్తాసు పలుకుతూ, కీర్తిస్తూ ఇంకా ఎంతోమంది యువతను ఆ సిద్ధాంతం వైపు ప్రేరేపించటం ఏ మాత్రం మంచి విషయం కాదు. నక్సల్స్ చేతిలో బిడ్డల్ని కోల్పోయిన తల్లులు కూడా మీలాంటి బిడ్డలే.

■ డా. దొంతగాని వీరబాబు
హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ





'ధన'పతి

నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో ఉన్న శ్రీవాసవీ మార్కెట్‌లో కొలువుదీరిన గణనాథుడిని బుధవారం రూ.కోటి కరెన్సీ నోట్లతో అలంకరించారు. స్వామి విగ్రహంతో పాటు పందిరి మొత్తాన్ని నోట్ల కట్టలతో అందంగా తీర్చిదిద్దారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. - నందిగామ



గొల్లేరు శ్రీనివాసరావు | జాన్సన్ దేవరాజ్ | బీపీ శ్రీధర్

ఉత్తమ ఉపాధ్యాయులు ముగ్గురు

జిల్లా నుంచి ఎంపిక చేసిన ప్రభుత్వం

విస్సన్నపేట/ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం ప్రభుత్వం బుధవారం ప్రకటించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు ఎంపీపీ స్కూల్ హెచ్ఎం గొల్లేరు శ్రీనివాసరావు, విస్సన్నపేట మండలంలోని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.జాన్సన్ దేవరాజ్, నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ టీచర్ బీవీ శ్రీధర్‌బాబుకు ఈ అవార్డులు దక్కాయి.

గొప్పవరం : హెచ్ఎం శ్రీనివాసరావు : 36 ఏళ్ల సర్వీసులో తనకు దక్కిన గొప్పవరం ఈ అవార్డు అని హెచ్ఎం మిగతా 6లో..

ఇదేం డ్రెయిన్

సర్కిల్-3లో కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం నిర్వాకం

కృష్ణవేణి రోడ్డులో పల్లం నుంచి ఎత్తుకు డ్రెయిన్ నిర్మాణం

- వాలు కోసం భారీగా గోతుల తవ్వకాలు
- రూ.కోట్ల విలువైన పనులపై బాధ్యతారాహిత్యం
- విస్తుగొల్పుతున్న ఇంజనీరింగ్ అధికారుల పనితీరు



ఎంత లోతు తవ్వుతారు?

ఈ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను కృష్ణవేణి రోడ్డు మీదుగా బందరు కాల్వలో కలిపేలా నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళిక వేశారు. పల్లం నుంచి ఎత్తుకు డ్రెయిన్‌ను నిర్మిస్తుండటం వల్ల వాలు కోసం ముందుకెళ్తున్నకొద్దీ లోతు పెంచుతున్నారు. కృష్ణవేణి రోడ్డుకు ఒక వంతు దూరం రాగానే ఆరు అడుగుల మేర తవ్వాల్సి వస్తోంది. బందరు కాల్వ వరకు ఇదే పరిస్థితి కొనసాగితే చివరికి వెళ్లేసరికి తాటిచెట్టంత లోతు తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒకవేళ కృష్ణానదికి అంచనాకు మించి వరద వస్తే బందరు కాల్వకు నీరు వదలక తప్పదు. అలాంటపుడు లోతుగా తవ్వే ఈ అవుట్‌ఫాల్ డ్రెయిన్ ద్వారా పటమట ప్రాంతాన్ని వరద ముంచెత్తే అవకాశం ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో తేలికపాటి వర్షానికే బెంజిసర్కిల్ వెంబడి ఎన్‌హెచ్-16, 65పై నీరు నిలిచిపోతోంది. వరద, మురుగు ఏకమై సర్వీసు రోడ్లపై రెండు, మూడడుగుల లోతున నీరు ఆగిపోతోంది. బెంజిసర్కిల్-ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఇదే సమస్య నెలకొంది. పటమటలోని మేజర్ డ్రెయిన్లు, స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్ల నుంచి వచ్చే వరద నీటిని మళ్లించడానికి వీలుగా కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు కృష్ణవేణి రోడ్డుపై మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించాలని నిర్ణయించారు. ఇది మంచి విషయమే అయినా.. ఈ డ్రెయిన్‌ను నిర్మించేందుకు ఎంచుకున్న విధానంపై విమర్శలు వస్తున్నాయి. పల్లం నుంచి ఎత్తుకు అవుట్‌ఫాల్ డ్రెయిన్ మిగతా 6లో..

'నీళ్లు పల్లమెరుగును..' ఇది అందరికీ తెలిసిన విషయమే. కానీ, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం మాత్రం 'నీళ్లు మెరకెరుగును..' అంటోంది. సర్కిల్-3 పరిధిలోని మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించి ఇంజనీరింగ్ అధికారులు అనుసరిస్తున్న 'మెరక వాలు' విధానం లోపభూయిష్టంగా ఉండటంతో పాటు తీవ్ర విమర్శలపాలవుతోంది. మురుగు సమస్య తీర్చటం సంగతి దేవుడెరుగు? వరద కష్టం తీసుకొచ్చే పరిస్థితి కల్పిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో అనధికార బెల్ట్ షాపుల హవా నడుస్తోంది. బడ్డీకొట్ల ముసుగులో భారీగా మద్యం అమ్మకాలకు తెరలేపుతున్నారు. ఎక్సైజ్ శాఖ కూడా సహకరిస్తుండటంతో నిన్న మొన్నటి వరకు ఇళ్లలో రహస్యంగా నిర్వహించిన బెల్ట్ షాపులు నేడు యథేచ్ఛగా సాగుతున్నాయి. విచ్చలవిడి బెల్ట్‌షాపులపై ప్రజలు తిరుగుబాటు చేస్తుండగా, అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

బెల్ట్ తీశారు..!

పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలో యథేచ్ఛగా బెల్ట్ షాపుల నిర్వహణ

- గ్రామగ్రామాన పుట్టగొడుగుల్లా వెలుస్తున్న షాపులు
- బడ్డీకొట్ల ముసుగులో మందు బాటిళ్ల అమ్మకాలు
- మామూళ్ల మత్తులో జోగుతున్న ఎక్సైజ్ అధికారులు
- శివారు గ్రామాల్లో సిట్టింగ్ ఏర్పాట్లు కూడా..
- నాలుగు నెలలుగా ఆగిపోయిన అధికారుల దాడులు
- ప్రజల్లో తీవ్రమవుతున్న వ్యతిరేకత
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో రోడ్డెక్కి నిరసన





ఏ.కొండూరు మండలంలో జాతీయ రహదారి పక్కన రేకుల షెడ్ బెల్ట్‌షాపు, సిట్టింగ్ ఏర్పాట్లు (ఇన్‌సెట్‌లో) చంద్రగూడెం ఊరి చివర జాతీయ రహదారి పక్కనే ఉన్న బెల్ట్ షాపు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం/నందిగామ) : మైలవరం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో అనధికార బెల్ట్ షాపులు ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్నాయి. గ్రామగ్రామాన కనీసం 5 నుంచి 10 బెల్ట్ షాపులు ఉంటున్నాయి. ఒక్కో షాపు నుంచి రూ.5 వేలు-రూ.10 వేల వరకు ఎక్సైజ్ శాఖకు మామూళ్లు అందుతున్నట్టు తెలుస్తోంది. అధికారులకు ఇవ్వాల్సిన మామూళ్లు కూడా తమ వద్ద గుంజుతున్నారని మందుబాబులు చెబుతున్నారు. ఒకప్పుడు బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి, కేసులు పెట్టి, తహసీల్దార్ల ఎదుట హాజరుపరిచి బైండోవర్ కేసులు పెట్టేవారు. దాడులకు ముందే బెల్ట్ నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇచ్చి, ఒకటి లేదా రెండు మద్యం సీసాలు పట్టుకుని, నామమాత్రపు అపరాధ రుసుం విధించి, వారికి కావాల్సింది తీసుకుని వెళ్లిపోయేవారు. ఇప్పుడు ఎక్సైజ్ అధికారులు మారారు. బెల్ట్ షాపులు లేకుంటే సారా మహమ్మారి విజృంభిస్తోందంటూ ఎక్సైజ్ మిగతా 6లో..

గ్రామాల్లో ఆందోళనలు

గ్రామాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన బెల్ట్ షాపుల వల్ల ఎక్కడపడితే అక్కడ మందు ఏరులై పారుతోంది. దీంతో ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో అశాంతి నెలకొంటోంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని షేర్ మహమ్మద్‌పేట గ్రామ సచివాలయం ఎదుట ఉన్న బెల్టు షాపును తీసేయాలని మహిళలు, ప్రజలు రోడ్డుపై నిరసన తెలిపారు.

ఎక్సైజ్ పర్యవేక్షణలోనే సరఫరా

నాలుగు నెలలుగా ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్ట్‌షాపులపై దాడులు చేయడమే మానేశారు. నెలనెలా మామూళ్లు చెల్లించే బెల్ట్‌షాపు నిర్వాహకులకు వారు అభయమిచ్చినట్టు తెలిసింది. పార్టీలతో పని లేకుండా, ఎవరైతే మామూళ్లు సక్రమంగా ముట్టజెబుతారో వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సరుకును వారే సరఫరా చేయిస్తున్నట్లు తెలుస్తోంది.



పేలుడుకు ధ్వంసమైన ఇల్లు

జూపూడిలో భారీ పేలుడు

- ఇంటికి ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేస్తుండగా పేలిన గ్యాస్
- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- ధ్వంసమైన ఇళ్లు.. బాణసంచా తయారీపై అనుమానాలు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం జూపూడి శివారు భీమేశ్వర కాలనీలోని రెంటపల్లి కోటమ్మ ఇంట్లో బుధవారం రాత్రి భారీ పేలుడు సంభవించింది. కేతుల మిగతా 6లో..

ఏమిస్తారో...

మంత్రి నారా లోకేశ్‌తో వంగవీటి రాధా భేటీ

- సుదీర్ఘ సమయం పాటు ఆంతరంగిక చర్చ
- కీలక బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ బుధవారం మంత్రి నారా లోకేశ్‌తో అంతరంగికంగా భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో రాధా రాజకీయ భవితవ్యంపై ఊహాగానాలు మొదలయ్యాయి. కీలక బాధ్యతలు కానీ, పదవులు కానీ అప్పగించనున్నారా..? అనే చర్చ ప్రారంభమైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరఫున వంగవీటి రాధా పోటీ చేయలేదు. కానీ, ప్రచారం నిర్వహించారు. రాధాకు ఇటీవల ఎమ్మెల్సీ పదవి ఇస్తారని అంతా అనుకున్నా.. పరిమిత స్థానాల కారణంగా, కొన్ని సమీకరణాల నేపథ్యంలో సాధ్యపడలేదు. ఆయన తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నప్పటికీ రాజకీయాల్లో క్రియాశీలకంగా మాత్రం ఉండట్లేదు. ఇటీవల గుడివాడ వచ్చిన సందర్భంలో ఈ విషయాలు చర్చకు రాగా.. తన మిగతా 6లో..



మంత్రి నారా లోకేశ్‌తో వంగవీటి రాధా

చెప్పులస్టాండ్, లగేజీ కౌంటర్లకు వేలం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై భక్తుల లగేజీ, పాదరక్షలను భద్రపరచుకునే కౌంటర్ల నిర్వహణకు శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులు మంగళవారం వేలంపాట నిర్వహించారు. మహామండపం ఆరో అంతస్థులో ఈ వేలం నిర్వహించారు. మొదట పాదరక్షలు భద్రపరచు కౌంటర్ నిర్వహణకు జరిగిన వేలంపాటలో మొత్తం నలుగురు పాల్గొన్నారు. వీరిలో కాంట్రాక్టర్ పార్వతి రూ.72 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. దీనివల్ల గతంలో కంటే దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం సమకూరింది. లగేజీ కౌంటర్‌కు అర్జునవీధికి చెందిన కె.రవీంద్ర ఏడాదికి రూ.90 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చారు. దీనివల్ల గతంలో కంటే దేవస్థానానికి రూ.18 లక్షల ఆదాయం సమకూరింది.

యూరియా వెతలు

పీఏసీఎస్‌లు, గ్రోమోర్ సెంటర్లకు పోటెత్తిన రైతులు

- అరకొరగా ఎరువుల పంపిణీపై ఆగ్రహం
- ఇప్పటి వరకు 27,200 టన్నుల యూరియా వచ్చినా సరిపోని వైనం
- పట్టించుకోని వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు
- వచ్చిన యూరియా ఎటు మళ్లించారో తెలియని స్థితి
- ఎకరానికి అరకట్ట మాత్రమే ఇస్తామని నిబంధన



పామర్రులో భారీగా తరలివచ్చిన రైతులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : అన్నదాతకు ఈ ఏడాది వ్యవసాయ ప్రారంభ దశ నుంచే కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులను కృష్ణాజిల్లా యంత్రాంగం సక్రమంగా అందించకపోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీలు, ఎరువుల దుకాణాల దగ్గర పడిగాపులు పడుతున్నారు. కృష్ణాజిల్లాకు ఆగస్టు నెల వరకు 27,200 టన్నుల యూరియా వచ్చినట్లుగా జిల్లా మిగతా 6లో..


యూరియా బస్తా రూ.400 పైనే..

45 కిలోల యూరియా బస్తాను రూ.266.60 విక్రయించాల్సి ఉండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.400 విక్రయిస్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలోని పీఏసీఎస్‌లకు యూరియాను పంపామని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. అయితే, యూరియాను కొందరు పెద్ద రైతులు తరలించుకుపోతుండటంతో సన్న, చిన్నకారు రైతులకు దొరకని పరిస్థితి ఏర్పడింది. పీఏసీఎస్‌లు, వ్యాపారులకు యూరియాను ఇచ్చామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా రైతులకు యూరియా అందుబాటులో ఉండట్లేదు.

కృష్ణాజిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. పీఏసీఎస్‌లు, గ్రోమోర్ సెంటర్లకు బుధవారం రైతులు పోటెత్తారు. క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి పడిగాపులు పడ్డారు. తీరా అందుకునే సమయానికి ఎకరానికి అరకట్టకు మించి ఇవ్వబోమని ఆంక్షలు పెట్టడంతో రైతులు ఎదురుతిరిగారు. పీఏసీఎస్‌లకు వచ్చిన యూరియాను ఎక్కడికి తరలించారని, అరకట్ట ఇస్తే ఏం చేసుకోవాలని వాగ్వాదానికి దిగారు. కాంప్లెక్స్ ఎరువులు చల్లాలంటే తప్పనిసరిగా యూరియాను కలపాలని, యూరియా అందుబాటులో లేదంటే తాము ఏం చేయాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల పంపిణీ

వెల్లడించిన సీఎం చంద్రబాబు



విజయవాడ సిటీ , సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లాలో డిమాండ్‌కు తగినట్టుగా ఎరువుల సరఫరా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. బుధవారం రాత్రి సీఎం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిల్వ ఉన్న ఎరువుల వివరాలను ప్రకటించారు. ముఖ్యమంత్రి పేర్కొన్న వివరాల ప్రకారం...

ఎన్టీఆర్ జిల్లాలో... : ఎన్టీఆర్ జిల్లాలో 94,931 హెక్టార్ల భూమి ఉండగా, అందులో 86,643 హెక్టార్లలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు జరుగుతోంది. 24,305 మెట్రిక్ టన్నుల యూరియా కావాల్సి ఉందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. కిందటి ఏడాది కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం అనూహ్యంగా పెరిగి ఎరువుల ఆవశ్యకతను పెంచిందన్నారు. దీంతో 29,032 మిగతా 6లో..

ఈ - దోపిడీ..!

- 'ఐ లవ్ యూ'తో రూ.11వేలు లాగేసిన నేరగాళ్లు
- కారు చూపించి బంగారం కొట్టేసిన వైనం
- కొత్త ట్రిక్‌లతో సైబర్ మోసాలు

8



దుర్గగుడిలో దసరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

పకడ్బందీగా దసరా ఏర్పాట్లు

» ఇంద్రకీలాద్రిపై పనులను పరిశీలించిన ఈవో

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు ఈవో వీకే శీనానాయక్ బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈసారి దసరాకు పాత ఆర్.బి.ఫ్రేమ్‌లకు బదులుగా సింహాచలం దేవస్థానం నుంచి తెప్పించిన క్యూ ఫ్రేమ్‌లను వినియోగిస్తున్నారు. క్యూల వ్యవస్థను పటిష్ఠం చేయడం ద్వారా, పండుగ సమయంలో భక్తులకు మెరుగైన దర్శనం కల్పించడం దీని ముఖ్య ఉద్దేశమని చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న ప్రసాదం పోటు భవనంలో డ్రెయినేజీ తదితర సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. కొండ పైభాగంలో ఏర్పాటు చేస్తున్న కొత్త పూజా మండపాల పనుల వివరాలను ఈఈ కోటేశ్వరరావు ఈవోకు వివరించారు. ఆలయంలోని ముఖ్య ప్రదేశాలలో జరుగుతున్న చిత్రలేఖన పనులను పరిశీలించారు. కొత్త అన్నదానం భవనం పనులను కూడా ఆయన పరిశీలించి, నాణ్యతతో కూడిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. దసరా నాటికి సిద్ధం కావాల్సిన ఎలివేటెడ్ క్యూల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. దసరా ఉత్సవాలు పకడ్బందీగా జరిగేందుకు తాను ప్రతిరోజూ ఆలయంలోని ప్రతి విభాగాన్ని, ప్రతిపని స్వయంగా పర్యవేక్షిస్తున్నామని ఈవో తెలిపారు.



బుల్లిరాజు కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

కనకదుర్గమ్మ సేవలో బాల నటుడు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో నటించిన బాలనటుడు పశ్చిమగోదావరి జిల్లా, భీమవరానికి చెందిన బీమాల రేవంత్ పవన్ సాయి సుభాష్ (బుల్లి రాజు) బుధవారం తల్లిదండ్రులు శ్రీనివాసరావు, దేవి, సోదరి ఆశ్రిత నైణితో కలిసి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో వీకే శీనానాయక్‌ను ఆయన చాంబర్‌లో కలిసి మెగాస్టార్ చిరంజీవితో నటించే తదుపరి చిత్రం, ఇతర అనుభవాలను పంచుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వేదపండితులు బుల్లిరాజు కుటుంబసభ్యులకు వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



రోగి శేషుకుమారితో సూపరింటెండెంట్ ఏవీ రావు, వైద్యుల బృందం

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

విజయవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మెదడులోని ద్రవం ముక్కు ద్వారా కారడం(సీఎస్ఎఫ్ రినోర్హియా) సమస్యతో బాధపడుతున్న మహిళకు జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శేషకుమారి అనే మహిళకు 2015లో తొలిసారి విజయవాడ జీజీహెచ్‌లో, రెండోసారి 2021లో గుంటూరులో ఓపెన్ క్రానియోటమీ చేశారు. అయితే రెండు శస్త్రచికిత్సలు విఫలమయ్యాయి. మూడోసారి క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిద్ధార్థ మెడికల్ కాలేజీ, ఈఎన్‌టీ విభాగం ఆధ్వర్యంలో ఆధునిక ఎండోస్కోపిక్ పద్ధతిలో విజయవంతంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ కె.రవి మాట్లాడుతూ, కేసును ఎండోస్కోపిక్ పద్ధతిలో విజయవంతం చేయడం గర్వంగా ఉందన్నారు. ఈ వ్యాధి స్థూలకాయం ఉన్న, పెరిమెనోపాజ్ దశలో ఉన్న మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుందని డాక్టర్ రవి పేర్కొన్నారు. శేషకుమారి ప్రస్తుతం కోలుకుంటున్నారని, మెడికల్ కాలేజీ ఈఎన్‌టీ, అనస్తీషియా విభాగాల సమన్వయంతో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు ఆయన తెలిపారు. వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ఆర్.రావు అభినందించారు.

అర్ధరాత్రి రెచ్చిపోయారు!

» చొక్కాలు పట్టుకుని కానిస్టేబుళ్ల ఘర్షణ

» ఇద్దరినీ సస్పెండ్ చేసిన పోలీసు కమిషనర్



రోడ్డుపై చొక్కాలు పట్టుకుని ఘర్షణ పడుతున్న కానిస్టేబుళ్లు, మహిళ

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఒకరు ట్రాఫిక్ కానిస్టేబుల్.. మరొకరు అజిత్‌సింగ్‌నగర్ స్టేషన్ కానిస్టేబుల్.. స్వల్ప విషయమై ఇద్దరిమధ్య మాటా మాటా వచ్చింది. సహనం కోల్పోయిన ఖాకీలు అర్ధరాత్రి నడిరోడ్డుపై చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. విషయం కమిషనర్ దృష్టికి వెళ్లడంతో బుధవారం ఇద్దరినీ సస్పెండ్ చేశారు. వివరాల ప్రకారం.. 4వ పట్టణ ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రీనివాస్ నాయక్ డాబాకొట్లు సెంటర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం అర్ధరాత్రి మూడుగంటల సమయంలో మధురానగర్ పసుపుతోటకు చెందిన ఓ మహిళతో శ్రీనివాస్ నాయక్ డాబాకొట్లు సెంటర్ వద్ద గొడవ పడుతున్నాడు. అటుగా బీట్ నిర్వహిస్తున్న అజిత్‌సింగ్‌నగర్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు వారిని ప్రశ్నించగా.. అజిత్‌సింగ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వచ్చానని.. దారిలో వాహనంలో పెట్రోల్ అయిపోయిందని మహిళ చెప్పుకొచ్చింది. తనకు శ్రీనివాస్ నాయక్ పరిచయస్తుడని చెప్పింది. దీంతో కోటేశ్వరరావు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి శ్రీనివాస్‌నాయక్, మహిళ రైతుబజార్ వద్ద ఘర్షణ పడుతుండగా చూసిన కానిస్టేబుల్ కోటేశ్వరరావు వారిని స్టేషన్‌కు రావాలని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన శ్రీనివాస్ నాయక్ ఘర్షణకు దిగాడు. మధ్యలో మహిళ కలుగజేసుకుని డ్యూటీలో ఉన్న కోటేశ్వరరావు చొక్కా పట్టుకుని రోడ్డుపైకి లాగింది. అనంతరం కోటేశ్వరరావు జరిగిన విషయాన్ని పైఅధికారులకు చెప్పడంతో కమిషనర్ రాజశేఖర్‌బాబు ఇద్దరిని సస్పెండ్ చేశారు. కాగా ఘర్షణలో మహిళ పాత్రపై పోలీసులు విచారిస్తున్నారు.

యూరియా.. ఇవ్వండయ్యా!



లింగారెడ్డిపాలెం పీఏసీఎస్ వద్ద యూరియా కోసం వేచిఉన్న రైతులు



» యూరియా కోసం రైతుల బారులు

» ఉదయం నుంచే సొసైటీల వద్ద పడిగాపులు

» అవసరానికి సరిపడా అందక అన్నదాతల అవస్థలు

» సమయానికి వేయకపోతే దిగుబడి రాదని ఆవేదన

కోడూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు యూరియా అవసరం అధికంగా ఉంది. అయితే అవసరాల మేరకు అందుబాటులో లేకపోవటంతో రైతులు యూరియా కోసం పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు పడుతున్నారు. కోడూరు మండలంలో సుమారు 17వేల ఎకరాల్లో 80 శాతం నాట్లు పూర్తయ్యాయి. పంటకు సకాలంలో యూరియా వేయకపోతే దిగుబడి రాదని రైతులు చెబుతున్నారు. అవసరాల మేరకు ఇప్పటికైనా యంత్రాంగం క్షేత్రస్థాయిలో యూరియా సరఫరాచేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. మండలంలోని ఆరు పీఏసీఎస్‌లకు 80 టన్నులు, గ్రోమోర్ సెంటర్‌కు 20 టన్నుల యూరియా వచ్చిందని, కట్ట యూరియా రూ.266.50 విక్రయిస్తున్నట్టు వ్యవసాయ శాఖ అధికారి ఎం.శ్రీధర్ తెలిపారు.



కోడూరు గ్రోమోర్ సెంటర్ వద్ద బారులుతీరిన రైతులు

జగ్గయ్యపేట రూరల్ : చిల్లకల్లులో బుధవారం యూరియా కోసం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు రావటంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. మార్క్‌ఫెడ్ నుంచి 335 బస్తాలు చిల్లకల్లు గోడౌన్‌కు చేరాయి. ఉదయం నుంచే కూపన్‌ల ప్రకారం యూరియాను పంపిణీ చేశారు. రైతుకు రెండు బస్తాలు పంపిణీ చేశారు.

ఎ.కొండూరు : మండలంలో బుధవారం యూరియాను రెవెన్యూ, పోలీసు అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తూ రైతులకు పంపిణీ చేశారు. కంభంపాడు గ్రోమోర్ ద్వారా 15 టన్నులు, ఎ.కొండూరు సొసైటీ ద్వారా 15 టన్నులు, కోడూరు సొసైటీ ద్వారా 10 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు.



చిల్లకల్లులో యూరియా కోసం..



ఎ.కొండూరు సొసైటీ వద్ద క్యూలో ఉన్న రైతులు

కొందరు రైతులకు యూరియా అందలేదు. రైతులందరికి యూరియా సరఫరా చేయాలని సీపీఎం నేత జె.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. కంభపాడు గ్రోమోర్ వద్ద ఉదయం 6 గంటల నుంచి క్యూలో ఉన్నా పలువురికి యూరియా అందలేదన్నారు.



ఉయ్యూరు మనగ్రోమోర్ షాపు వద్ద ..

ఉయ్యూరు : ఉయ్యూరులో యూరియా కోసం రైతులు మన గ్రోమోర్ షాపు వద్ద బుధవారం బారులుతీరారు. మండల పరిధి గ్రామాల రైతులు ఉదయాన్నే పెద్దయెత్తున తరలివచ్చి క్యూలో నిలుచున్నారు. మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో రైతులకు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న వారికి ఎకరాకు అరకట్ట చొప్పున యూరియా పంపిణీ చేశారు. మనగ్రోమోర్‌కు 35 టన్నుల యూరియా వచ్చిందని, ఎకరానికి అరకట్ట చొప్పున 20 ఎకరాలు అంతకంటే ఎక్కువ పొలం సాగు చేస్తున్నవారికి 8 కట్టలు మించకుండా పంపిణీచేస్తున్నామని వ్యవసాయ అధికారి తెలిపారు.

పది రోజులుగా యూరియా లేదు..

- జొన్నలగడ్డ రామారావు, రైతు



కోడూరులో 10 రోజులుగా యూరియా లేదు. అధికారులు మాత్రం కొరత లేదని ప్రకటనలు చేస్తున్నారు. పంటకు సకాలంలో యూరియా వేయకపోతే తీవ్రంగా నష్టపోతాం, ఖరీఫ్ సీజన్‌కు తగినంత యూరియాను అందించి ఆదుకోవాలి.

- రేపల్లె యోగ ప్రకాష్, రైతు



యూరియా సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్‌లో యూరియా లేకపోవడం కారణంగా సన్న, చిన్నకారు రైతులు సకాలంలో ఎరువులు వేయలేకపోతున్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయాలి.

యూరియా వెతలు

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. నిల్వలతో కలుపుకొని 28,743 టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని అధికారులు అంటున్నారు. రైతులకు విక్రయించగా, ఇంకా జిల్లాలో 1,443 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నా.. రైతులకు అందుబాటులోకి రావడం లేదు. పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాల ద్వారా యూరియాను విక్రయించట్లేదు. రెండు రోజుల క్రితం జిల్లాలోని ఎరువుల దుకాణాలకు 50 కట్టల చొప్పున ఇచ్చారు. ఈ ఎరువు 10 నిమిషాల వ్యవధిలోని విక్రయించేశారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా యూరియా కోసం రైతులు బారులు తీరడంతో పలు మండలాల్లో గందరగోళం ఏర్పడింది. ఈ సమస్యపై కలెక్టర్ బాలాజీ బుధవారం స్పందించారు. జిల్లాకు ఈ నెల 1న గ్రోమోర్ కంపెనీ నుంచి 243 టన్నులు, 2న కోరమాండల్ కంపెనీ నుంచి 1,200 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. రానున్న 10 రోజుల్లో 4 వేల టన్నుల యూరియా వస్తుందన్నారు.

ఎరువుల లారీని అడ్డుకున్న వైసీపీ నాయకులు

మొవ్వ మండలం చినముత్తేవి గ్రామం మీదుగా మంగళవారం రాత్రి నిడుమోలు గ్రామానికి వెళ్తున్న ఎరువుల లారీని చినముత్తేవిలో వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. లారీడ్రైవర్ అన్ని ఆధారాలు చూపినా వైసీపీ నాయకులు వినిపించుకోలేదు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీలో 150 బస్తాలు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు.

పీఏసీలు, గ్రోమోర్ సెంటర్ల వద్ద బారులు తీరి..

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎరువులు రావడం, రైతుల అవసరాలకు మించి కాస్త అదనంగానే యూరియాను అందుబాటులో ఉంచామని జిల్లా యంత్రాంగం ప్రకటించడంతో బుధవారం కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఎరువుల కోసం రైతులు భారీగా తరలివచ్చారు. రైతులను అదుపు చేయటానికి పోలీసులు అపసోపాలు పడ్డారు. డిమాండ్‌కు అనుగుణంగా యూరియాను అందించలేకపోవటంతో అధికారులపై రైతులు మండిపడ్డారు.



నందిగామలో గ్రోమోర్ షాపును తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

నందిగామ : యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని సందర్శించిన కలెక్టర్ స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. అక్కడ ఉన్న రైతులతో మాట్లాడిన కలెక్టర్ యూరియా కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. వారం రోజుల్లో పూర్తిగా అందుబాటులోకి రానున్నట్టు చెప్పారు. ఎక్కడైనా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ టోల్‌ఫ్రీ నెంబర్‌తో కూడిన బోర్డును దుకాణం ఎదుట ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల పంపిణీ

(5వ పేజీ తరువాయి)

టన్నుల యూరియా కావాలని అధికారులు రెండో దఫా నివేదిక ఇచ్చారు. అందులో ఇప్పటి వరకు 25,558 మెట్రిక్ టన్నుల యూరియాను 103 పీఏసీఎస్‌లు, 227 రైతు శిక్షణా కేంద్రాలు, 229 మంది ప్రవేటు డీలర్ల ద్వారా విక్రయించారు. ప్రస్తుతం జిల్లాలో 3,474 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంది. దీంతో పాటు 1,311 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,246 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 12,948 మెట్రిక్ టన్నుల ఎన్‌పీకే, 2,195 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 83 మెట్రిక్ టన్నుల కంపోస్ట్, 30 మెట్రిక్ టన్నుల ఎఫ్‌వోఎం నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ నెల ఆరోవ తేదీ నుంచి 10వ తేదీ మధ్యలో జిల్లాకు 3,650 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

కృష్ణాజిల్లాలో..: కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1,67,667హెక్టార్లలో ఈ ఏడాది 1,49,817 హెక్టార్లలో ఖరీఫ్ సాగు జరుగుతోంది. దీని కోసం 35,529 మెట్రిక్ టన్నుల యూరియా కావాలని అధికారులు నివేదిక ఇవ్వగా 30,546 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. దీనిలో ఇప్పటి వరకు 27,677 మెట్రిక్ టన్నులను రైతులకు 194 పీఏసీఎస్‌లు, 340 మంది ప్రవేటు డీలర్‌లు, 300 రైతు శిక్షణ కేంద్రాల ద్వారా సరఫరా చేశారు. ప్రస్తుతం 2,870 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంది. ఈ నెల 10వ తేదీ లోపు జిల్లాకు మరో 2,150 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

ముగ్గురు అక్రమార్కులపై కేసులు నమోదు

ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్న ముగ్గురిపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం కేసులు నమోదు చేసింది. పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎరువుల దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరులో కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిని గుర్తించారు. ఆయా దుకాణాల్లో నిల్వ ఉన్న ఎరువులు, రికార్డుల్లో నమోదు చేసిన లెక్కలు తేడా ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. అక్రమంగా ఎరువులు నిల్వ ఉంచిన వారిపై ఆయా పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు చేశారు. ఎరువుల దుకాణాలపై పోలీసుల తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, కృత్రిమ కొరత సృష్టించినా, రికార్డులు సక్రమంగా లేకపోయినా, అధిక ధరలకు విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా పోలీస్ యంత్రాంగం హెచ్చరిక చేసింది.

జూపూడిలో భారీ పేలుడు

(5వ పేజీ తరువాయి)

బెడద తట్టుకోలేక ఇంటి చుట్టూ ఐరెన్ గ్రిల్స్ ఏర్పాటు చేయిస్తుండగా, ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించాయని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. పేలుడు ధాటికి వెల్డింగ్ చేస్తున్న గోపీ, మహేశ్ తీవ్రంగా గాయపడ్డారు. గోపీ పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరినీ చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి పంపారు. కోటమ్మ కుమారుడు అవినాశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న మూడు ఇళ్లు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే, ఒక గ్యాస్ బండ పేలితే ఇంత విస్ఫోటనం జరగదని చెబుతున్నారు. దీపావళి మందుగుండు సామాగ్రి తయారీ వస్తువులు ఇంట్లో ఉండటమే ప్రమాదానికి కారణం అని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పోలీసులు, క్లూస్‌టీమ్స్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ దుర్గారావు మాట్లాడుతూ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని విధాలా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

బెల్ట్ తీశారు..!

(5వ పేజీ తరువాయి)

అధికారులే బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

అందరికీ మామూళ్లు

నందిగామ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నందిగామ, చందర్లపాడు, పెనుగంచిప్రోలు మండలాల్లో మొత్తం 16 షాపులు ఉన్నాయి. ఈ షాపుల పరిధిలో 150 వరకూ బెల్ట్ షాపులు ఉన్నాయి. ప్రతి గ్రామంలోనూ నాలుగైదు షాపులు నడుస్తున్నాయి. బెల్ట్ షాపుల నిర్వాహకుల దగ్గర కొందరు అధికార పార్టీ నాయకులు సైతం మామూళ్ల వసూలు చేస్తున్నారు. దీంతో నిర్వాహకులు వారికి ఇష్టం వచ్చిన ధరకు అమ్మకాలు జరుపుతున్నారు. గ్రామాల్లో ఒకరిపై ఒకరు ఆధిపత్యానికి దిగి గొడవలు పడుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. జగ్గయ్యపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు మండలాలు ఉన్నాయి. అక్కడ మొత్తం 7 షాపులు ఉండగా, 100కు పైగా బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి. వత్సవాయి మండలంలో కూడా బెల్ట్‌షాపులను ధైర్యంగా నిర్వహిస్తున్నారు.

శివారు ప్రాంతాల్లో ఇష్టారాజ్యం

గ్రామాల శివారు ప్రాంతాల్లో హోటళ్లు, బడ్డీకొట్లలో మద్యం విక్రయిస్తున్నారు. బయటకు బడ్డీకొట్టులా కనిపిస్తున్నా లోపల మాత్రం మందు సీసాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ ఏకంగా బార్ మాదిరిగా సిట్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. స్టఫ్ కూడా వారే సరఫరా చేస్తున్నారు. దీంతో మందుబాబులు బెల్టుషాపుల వద్ద క్యూ కడుతున్నారు. ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి-30,విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి 65 పక్కనే బడ్డీలు, హోటళ్లలో కూడా ఈ వ్యాపారం సాగుతోంది. వైన్‌షాపులు మూసేసినా బెల్టు షాపుల్లో మందు లభిస్తుండటంతో కొంతమంది వాహనచోదకులు అక్కడ ఆగి తాగి వాహనాలు నడుపుతున్నారు. మైలవరం రూరల్, ఏ.కొండూరు ప్రాంతాల్లో బడ్డీల్లోనే బెల్ట్ షాపులు నడుపుతున్నారు.

బెల్ట్ షాపుల్లో అమ్మకాలిలా..

తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు, రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు బెల్టుషాపుల్లో కోరుకున్న బ్రాండ్ లభిస్తోంది. వైన్‌షాపులు లేని గ్రామాల్లో అయితే 24 గంటలకు బెల్ట్‌షాపుల్లో మందు అమ్మకాలు సాగుతున్నాయి.

ఇదేం డ్రెయిన్

(5వ పేజీ తరువాయి)

నిర్మాణానికి పూనుకున్నారు. రూ.కోట్ల వ్యయంతో తలపెడుతున్న డ్రెయిన్ విషయంలో ఇంజనీరింగ్ అధికారులు ఇంత బాధ్యతారాహిత్యంగా ఉండటమేంటనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

ఇలా మళ్లిస్తే బెటర్

ప్రస్తుత కృష్ణవేణి రోడ్డు నుంచి పంటకాల్వ రోడ్డు వరకు అంతా గతంలో ఓ సాగునీటి కాల్వగా ఉండేది. అప్పట్లో దీనిని పంటకాల్వగా పేర్కొనేవారు. కాలక్రమంలో వ్యవసాయం తగ్గి పట్టణీకరణ సంతరించుకున్నాక పంటకాల్వను పూడ్చేసి, రోడ్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మించాలనుకుంటే.. ప్రస్తుత పంట కాల్వ రోడ్డును ఎంచుకుంటే బాగుండేది. ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర భూమి లోపల ఇప్పటికీ నాటి కాల్వ కానాలు ఉన్నాయి. రోడ్డు వేసే క్రమంలో పూడ్చివేశారు. ప్రస్తుత సెంట్రల్ డివైడర్‌ను తాత్కాలికంగా తొలగించి భూగర్భంలో పైపులైన్ కానీ, అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను కానీ నిర్మించి, పైన స్లాబ్ వేసి సెంట్రల్ డివైడర్‌ను ఏర్పాటు చేయవచ్చు. డ్రెయిన్‌ను పరిశీలించటానికి అక్కడక్కడ సెంట్రల్ మీడియం దగ్గర గ్రిల్స్, డోర్లు ఏర్పాటు చేయవచ్చు. ఇలా కనుక చేసి ఉంటే.. ఈ డ్రెయిన్‌ను నేరుగా సనత్‌నగర్, కానూరు, ఆటోనగర్ మీదుగా వెళ్లే గుంటుతిప్ప డ్రెయిన్‌కు అనుసంధానించవచ్చు. తద్వారా ఈ నీటిని బుడమేరు లేదా ఏలూరు కాల్వలోకి పంపవచ్చు.

ఇప్పటికైనా అవకాశం ఉంది

కృష్ణవేణి రోడ్డులో పూర్తిస్థాయిలో డ్రెయినేజీని నిర్మించలేదు. కొంత మేర మాత్రమే నిర్మించారు. మిగిలిన నిర్మాణం కోసం తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటికైనా లోపం గ్రహించి డ్రెయిన్‌ను పంటకాల్వ మీదుగా తీసుకెళ్లే ఆలోచన చేయాలి.

ఉత్తమ ఉపాధ్యాయులు..

(5వ పేజీ తరువాయి)

జి.శ్రీనివాసరావు ఆనందం వ్యక్తం చేశారు. తమ విద్యార్థులు సమగ్రాభివృద్ధి చెందేలా బోధన చేసి, యోగా, లలిత కళలు, ముఖ్యంగా గేయాలు నేర్పించామన్నారు. రాగభావ యుక్తంగా గేయాలు నేర్పడంతో పాటు పిల్లలు పదాలపై పట్టు సాధించేందుకు ఎంతో కృషి చేశామన్నారు.

ఆంగ్లంపై ఉన్న భయాన్ని పోగొట్టా : టీచర్ శ్రీధర్‌బాబు

కేవలం బోధనకే కాకుండా విద్యార్థుల వ్యక్తిగత సమస్యలను తెలుసుకుని వారిలో విద్య పట్ల ఆసక్తిని కలిగించామని ఇంగ్లీష్ టీచర్ శ్రీధర్‌బాబు తెలిపారు. వినూత్న పద్ధతిలో విద్యాబోధన చేశానన్నారు. పాఠశాల సమయమే కాకుండా అదనపు సమయం తీసుకుని, తన ఇంటికి తీసుకెళ్లి ఆంగ్లంపై విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టానన్నారు. సొంత ఖర్చుతో భోజనం పెట్టించినట్లు చెప్పారు.

8 సార్లు అవార్డు వచ్చింది : ప్రిన్సిపాల్ జి.జాన్సన్ దేవరాజ్

గురుకులాల్లోని ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా శిక్షణ ఇచ్చానని, అభ్యాసిక అనే పాఠ్య పుస్తకం రాశానని ప్రిన్సిపాల్ జి.జాన్సన్ దేవరాజ్ తెలిపారు. పదేళ్లుగా వరుసగా 8 సార్లు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిందని, కేంద్ర ప్రభుత్వం అందించే స్వచ్ఛ విద్యాలయ గురుకులం పురస్కారం కూడా అందుకున్నానన్నారు.

ఏమిస్తారో..

(5వ పేజీ తరువాయి)

భవితవ్యాన్ని పార్టీ చూసుకుంటుందన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన లోకేశ్‌ను కలిశారు. రాధానే స్వయంగా వెళ్లారా? లోకేశ్ పిలిపించుకున్నారా? అనే అంశాలపై కూడా టీడీపీ వర్గాల్లో చర్చ మొదలైంది. లోకేష్‌తో భేటీ తర్వాత రాధా సమావేశ వివరాలను తెలియజేయలేదు. ఇది కేవలం మర్యాదపూర్వకంగా జరిగిన సమావేశం మాత్రమేనన్నారు. మంత్రి లోకేశ్ కూడా సమావేశం గురించి ఏమీ మాట్లాడలేదు.

పార్టీ పదవి కట్టబెట్టే అవకాశం ఉందా?

ఎన్టీఆర్, కృష్ణాజిల్లా రథసారథుల ఎంపికకు సంబంధించి ఇటీవల అధిష్ఠానం నియమించిన త్రీమెన్ కమిటీలు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపాయి. ఈ క్రమంలో రెండు జిల్లాలకు మూడేసి పేర్లను ప్రతిపాదించారు. అయితే, పార్టీ అధిష్ఠానం ఇప్పటి వరకు అధ్యక్షులను ప్రకటించలేదు. కాగా, ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ఏదైనా ఒక జిల్లా బాధ్యతలు రాధాకు అప్పగిస్తారా..? అనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఇందుకు రాధా సుముఖంగా ఉంటారా, లేదా అన్నది కూడా ప్రశ్నగానే మారింది. పార్టీలో పదవుల విషయంలో ఆయన పెద్దగా ఆసక్తి చూపించరు. గతంలో ఆయన కాంగ్రెస్, వైసీపీలో పనిచేసినపుడు కూడా ఈ విషయం తేటతెల్లమైంది.

ఆర్చరీలో రిషికీర్తన ప్రతిభ

విజయవాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని ఆర్చరీలో ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. జూనియర్ ఇంటర్ చదువుతున్న కె.రిషికీర్తన తిరుపతిలో ఆగస్టు 24 నుంచి 26 వరకు స్పోర్ట్స్ అథారిటీ నిర్వహించిన ఆర్చరీలో రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, అధ్యాపకులు అభినందించారు.



ఐశ్వర్య ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు

జిమ్నాస్టిక్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

విజయవాడ(స్పోర్ట్స్), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి జిమ్నాస్టిక్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని ఎస్.ఐశ్వర్య రజత పతకం సాధించినట్లు పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ మేకా రమేష్ తెలిపారు. ట్రాంపోలిన్ అంశంలో 30.54స్కోర్‌తో ఈ పతకం సాధించినట్లు తెలిపారు. ఐశ్వర్యను కళాశాల డీన్ ఆచార్య రాజేష్, సి.జంపాల. డైరెక్టర్ వి.బాబూరావు, క్రీడా విభాగాధినేత టి.వి.బాలకృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యులు అభినందించారు.

పక్షపాతంగా బ్యానర్ల తొలగింపు : టీడీపీ

రాణిగారితోట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): టౌన్‌ప్లానింగ్ అధికారులు పక్షపతంగా తమ బ్యానర్‌లు తొలగిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. రాణిగారితోట 18వ డివిజన్‌లో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కొక్కెర తిరుపతయ్య సహకారంతో పలు చోట్ల గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటికి సంబంధించి బ్యానర్లు ఏర్పాటు చేశారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది వాటిని తొలగించారు. తొలగించినవి తిరుపతయ్యవి కావటంతో టౌన్ ప్లానింగ్ అధికారిని నిలదిశారు. గతంలో కూడా అధికారి ఇదే తీరులో వ్యవహరించారన్నారు. దీంతో కొంత సేపు ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు సర్ది చెప్పటంతో వివాదం ముగిసింది. తిరుపతయ్య మాట్లాడుతూ గతంలో కూడా కక్షపూరితంగా తమ బ్యానర్లు తొలగించారు. అధికారి తీరును ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వద్ద తెల్చుకుంటా మని తెలిపారు. అధికారి మాత్రం తనపై ఎవరి ఒత్తిడి లేదని, ఇకపై ఇటువంటివి జరగకుండా చూసుకుంటానన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విజయవాడ భేష్

● అంతర్జాతీయ బృందం ప్రశంస

కార్పొరేషన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో విజయవాడ భేష్ అని జీఈఎఫ్, యూఎన్‌ఐడీవో పరిశీలకుల బృందం ప్రశంసించింది. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రను బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో కలిసి అభినందించారు. విజయవాడ నగరం సుందరంగా, పరిశుభ్రంగా ఉందని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్లోబల్ ఎన్విరాన్మెంట్ ఫెసిలిటీ, యూనిడో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రామలింగేశ్వర నగర్ 20ఎంఎల్‌డీ, సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పునరుద్ధరణ, బయోగ్యాస్ ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్ట్ పురోగతిపై బృందం పరిశీలించింది. సస్టెనబుల్ సిటీస్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ పైలెట్ ఇన్ ఇండియా (ఎస్‌సీఐఏపీ) ప్రాజెక్టులో భాగంగా దేశంలో ఐదు పైలట్ నగరాలను ఎంపిక చేశారని అందులో విజయవాడ ఉందన్నారు. కమిషనర్ స్పందిస్తూ నగరపాలక సంస్థ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. పరిశీలకుడు రేనాల్డ్ వంగ్, జాతీయ పరిశీలకుడు డాక్టర్ శ్రీనివాస్ ష్రాఫ్, యూనిడో సీనియర్ టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ నందపాల్ సింగ్, యూనిడో నేషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దీపిక శ్రీపాద పాల్గొన్నారు.



కమిషనర్ ధ్యానచంద్రతో అంతర్జాతీయ బృందం

నాగ వరప్రసాద్‌కు అభినందనలు

లబ్బీపేట, సెప్టెంబర్3(ఆంధ్రజ్యోతి): ఏషియన్ మస్క్యులో స్కెలిటల్ సొసైటీ అధ్యక్షుడిగా రేడియాలజిస్టు డాక్టర్ వి.ఎన్.వరప్రసాద్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.వి.మోహన్ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం బందర్‌రోడ్డులోని హోటల్ మినర్వాలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ డాక్టర్ వేమూరి నాగ వరప్రసాద్ ఈ పదవి చేపట్టిన అభినందనీయం అన్నారు. అనంతరం డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ వచ్చే రెండేళ్లల్లో ఈ థీమ్ లక్ష్యాలన్ని నెరవేర్చడానికి కృషి చేస్తానన్నారు. శరీరంలోని కీళ్లు, కండరాలు, ఎముకలతో కూడిన ఈ మస్క్యులో స్కెలిటల్ విభాగం వ్యాధి నిర్ధారణలో ఆధునిక పద్ధతులైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో నూతనంగా రూపొందించిన సిటీస్కాన్, ఎమ్మార్ఐ, అల్ట్రాసౌండ్ వంటి పరికరాలు మస్క్యులో స్కెలిటల్ రేడియాలజి వైద్యంలో కీలక పాత్ర వహిస్తాయన్నారు. సమావేశంలో ఐఆర్ ఐఏ, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ చలసాని కులదీప్, ఐఆర్ఐఏ విజయవాడ చాప్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ నేత్రదానంపై అవగాహన అవసరం

● డాక్టర్ సమరం

పటమట, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని స్వేచ్ఛ ఘోర ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సమరం అన్నారు. వాసవ్య నర్సింగ్ హోమ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సదస్సులో నేత్రదానం అనే అంశంపై ఆయన మాట్లాడుతూ అమూల్యమైన నేత్రాలను మట్టిపాలు, బుగ్గిపాలు చేయవద్దని ఒకరి నేత్రదానంతో ఇద్దరు అంధులకు జీవితం ప్రసాదించవచ్చునన్నారు. మరణించిన తరువాత కూడా చేయగలిగిన దానం నేత్రదానమన్నారు. ప్రతిఒక్కరూ నేత్రదానానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించి ఈ ఉద్యమంలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈనెల 8వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు బి.కీర్తి అధ్యక్షత వహించగా, మేనేజర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సమరం

పేదరికం చదువుకు అడ్డు కారాదు

● దాత మండవ వెంకటేశ్వరరావు

పటమట, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): పేదరికం చదువుకు అడ్డంకి కారాదు అనే ఆలోచనతో మండవ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు స్థాపించి ప్రతిభ గల పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు దాత మండవ వెంకటేశ్వరరావు తెలిపారు. 2024-25 సంవత్సరం కేఎస్ఆర్ జడ్పీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియట్ బైపీసీలో 946 మార్కులు సాధించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కొక్కిలిగడ్డ దుర్గ డిగ్రీ పూర్తి చేసేంతవరకు సంవత్సరానికి రూ.30వేలు చొప్పున మూడు సంవత్సరాలకు ఆమెకు సహాయం చేస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు. తొలి విడత రూ.30వేల చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొక్కిలిగడ్డ దుర్గకు చెక్కు అందజేస్తున్న మండవ వెంకటేశ్వరరావు

రోడ్డు వేశారు .. వ్యర్థాలు మరిచారు

పటమట, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాలనీ మెగా ఎస్టేట్ రోడ్డులో కొత్తగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. కొత్త రోడ్డు వేసే క్రమంలో పాత తారురోడ్డును తొలగించి తారు ముక్కలను రోడ్డు చివర గుట్టలు గుట్టలుగా పోశారు. కొట్టివేసిన చెట్ల కొమ్మలను మరోపక్క గుట్టలుగా పెట్టారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమలకు ఆవాసంగా మారక ముందే వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా గణపతి పూజలు



పూజల్లో పాల్గొన్న గద్దె క్రాంతి

రాణిగారితోట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణలంక ద్వారకానగర్ లో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం కుంకుమ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ద్వారకానగర్ ఉత్సవ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సభ్యులు చిన్ని, మోహన్, నవీన్ శ్రీనివాస్, కళ్యాణ్, పండు,లక్ష్మీత్, నాని, బాబి, వర్షిత, వీనిల పాల్గొన్నారు.

రాణిగారితోట 18వ డివిజన్‌లోని మద్రి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో గద్దె క్రాంతి పాల్గొన్నారు. బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో 1500మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. వేముల దుర్గారావు, వెంకటేశ్వరరెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.



కుంకుమ పూజా లో పాల్గొన్న మహిళలు

కృష్ణలంక : కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ చవితి పందిరిలో కృష్ణలంక సీఐ నాగరాజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మహోత్సవ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒక్కంతుల కృష్ణయ్య, చాపరాల వెంకట్రావు, అత్తలూరి కోటేశ్వరరావు, షరాబు గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

భారతీనగర్: మూడో డివిజన్ పరిధిలోని శ్రీరామచంద్రనగర్ కాలనీ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన గణేష్ పందిరిలో పోలీసు అధికారులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పడమట పోలీస్‌శాఖ అధికారి పవన్ కిషోర్, మాచవరం పోలీస్‌శాఖ అధికారి ప్రకాష్, కృష్ణలంక పోలీస్‌శాఖ అధికారి బాలమురళి, ట్రాఫిక్ పోలీస్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.



లడ్డూని విరాళంగా ఇస్తున్న నగరానికి చెందిన చెర్రీస్ స్వీట్స్ షాప్ అధినేత రవి, సభ్యులు

భారతీనగర్: 10వ డివిజన్ పరిధిలోని ఫన్‌టైమ్స్ క్లబ్ రోడ్డులో ఫన్‌టైమ్స్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి వేడుకల్లో భాగంగా చెర్రీస్ స్వీట్స్ షాప్ అధినేత తుమ్మల రవి స్వామివారికి 329 కేజీల భారీ లడ్డూను ప్రసాదంగా ఇచ్చారు. ఉదయం మేళతాళాల నడుమ ఈ లడ్డూను తుమ్మల రవి కమిటీ సభ్యులకు అందజేశారు. చెర్రీస్ స్వీట్స్ షాప్ అధినేత తుమ్మల రవి స్వామికి ప్రసాదంగా అందించారు. గురువారం లడ్డూ వేలం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఫన్‌టైమ్స్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు విజయ్ కృష్ణ, ముప్పవరపు సతీష్, పి.శ్రీనివాస్, నాగభూషణం, అశోక్, కృష్ణకాంత్, శ్రీనివాసరెడ్డి, దాసరి హరికృష్ణ, సాయి పాల్గొన్నారు.



చవితి పందిరిలో పూజలు నిర్వహిస్తున్న కృష్ణలంక సీఐ నాగరాజు



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్‌శాఖ అధికారులు

నిత్యాన్నదానానికి దాతలు విరాళాలు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి పలువురు దాతలు బుధ వారం ఆలయ అధికారులకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి చిత్ర పటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, అం దించారు. విజయవాడ, కానూరుకు చెందిన ఆరో ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాని చింత శివరామకృష్ణ రూ.1,00,116, మచిలీపట్నం ఆజాద్ రోడ్డుకు సర్వ కృష్ణ మోహన్ ప్రసాద్ రూ.2,00,000 అధికారులకు అందజేశారు.



చింతా రామకృష్ణకు అమ్మవారి చిత్ర పటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారులు

15న రవాణా శాఖ మంత్రి కార్యాలయం ఎదుట ధర్నా

గాంధీనగర్: స్త్రీ శక్తి పథకం వల్ల జీవనోపాధి కోల్పోతున్న ఆటో కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా నగరంలోని రవాణాశాఖ మంత్రి కార్యాలయం ఎదుట 15న ధర్నా చేపడతామని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దోనేపూడి శంకర్ అన్నారు. యూనియన్ ప్రధానకార్యదర్శి గూడేల జనార్దన్, పి.సుబ్రమణ్యం, కమ్మిలి శ్రీను చారి, ఎం.ఆత్మారాం పాల్గొన్నారు.

అన్నదాతలకు యూరియా అందించండి

● కౌలు రైతుల సంఘం

గవర్నర్‌పేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం అన్నదాతలు పడిగాపులు పడుతున్నా ఎలాంటి ఫలితం కనిపించడం లేదని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. ఏపీ కౌలు రైతుల సంఘం కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలు మానుకొని అన్నదాతకు యూరియా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం నుంచి తగినంత యూరియాను రాబట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రైతాంగాన్ని పక్కదారి పట్టించి సమస్య నుంచి ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తోందన్నారు. ఎరువులు దారిమళ్లకుండా సక్రమంగా రైతులకు అందేలా, ప్రతి పరపతి సంఘం వద్ద అధికారులు రైతులతో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని డిమాండ్ చేశారు.

న్యాయ విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెరగాలి

● సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చాన్సలర్ కె. వీరయ్య చౌదరి

కానూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): న్యాయ విద్యార్థులకు చట్టాలు, న్యాయస్థాన తీర్పులపై అవగాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిద్ధార్థ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చాన్సలర్ కొసరాజు వీరయ్య చౌదరి అన్నారు. కానూరులోని సిద్ధార్థ న్యాయ కళాశాల సెమినార్ హాలులో బుధవారం జరిగిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో చాన్సలర్ వీరయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. న్యాయ వాదులు ఏదైనా ఒక కేసు వాదించాల్సి వచ్చినప్పుడు ఆకేసు పూర్తి వాస్తవాలను అర్థం చేసుకున్నప్పుడే సరైన చట్టాలను ఈ కేసుకు అన్వయించగలుగుతామన్నారు. ప్రతి వ్యక్తి తాను ఎంచుకునే వృత్తిలో నిజమైన వృత్తి నైపుణ్యాలను కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థి జీవిత లక్ష్యాలను నెరవేర్చుకునేందుకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానం కూడా అవసరమని ఆయన చెప్పారు. ప్రస్తుతం మన దేశంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని అందుకోగలిగిన మానవ వనరులను పెంపొందించుకోలేకపోతున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ తమకున్న అర్హతలు, నైపుణ్యాలను వీలైనంత ఎక్కువగా పెంపొందించుకోవాలని వీరయ్య చౌదరి విద్యార్థులను కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి కూడా నిజమైన పూర్తి జ్ఞానం పొందాలంటే వ్యక్తిగత పరిశీలన, స్వీయ జవాబుదారితనం కలిగి ఉండా లని సూచించారు. కార్యక్రమంలో సిద్ధార్థ వర్సిటీ వైస్‌చాన్సలర్ పి. వెంకటేశ్వరరావు, ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కొసరాజు వీరయ్య చౌదరి



పశు సంవర్ధక శాఖా మంత్రి అచ్చెన్నాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి పొందిన అధికారులు

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన జేడీలు

కృష్ణలంక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో జాయింట్ డైరెక్టర్లుగా పదోన్నతి పొందిన అధికారులు ఆ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోస్టింగ్స్ కోసం పోటీ లేకుండా అందరూ సమన్వయంతో వ్యవహరించి ఎవరికి కావలసిన చోట వారికి ఆమోదయోగ్యంగా ప్రజా అవసరాలకు, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా వ్యవహరించి ఏకాభిప్రాయంతో పోస్టింగ్స్ తీసుకోవాలని కోరారు. పదవి అనేది బాధ్యతని అధికారం కాదని మంత్రి హితవు పలికారు.



నిమజ్జనానికి వెళ్లేముందు లడ్డూను వేలంపాట వేస్తున్న బాలురు

లడ్డూ వేలంపాటలో రాజకీయాలా..?

● పోటీపడ్డ వైసీపీ, టీడీపీ, జనసేన అభిమానులు

గుణదల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతరల సమయంలో రాజకీయాలు చేయడం చూశాం. వినాయక చవితి, నవమి పందిళ్ల ఏర్పాటులోనూ రాజకీయ నేతలు వారి వారి ప్రాభల్యం చూపించుకోవడం చూశాం. అభం శుభం ఎరుగని చిన్నారులు ఏర్పాటు చేసుకున్న చవితి పందిరి వద్ద అదీను వినాయక లడ్డూ ప్రసాదం వేలంపాట విషయంలో వైసీపీ, జనసేన, టీడీపీ అభిమానులమని చెప్పుకునే యువకులు పోటీపడటం ఆశ్చర్యానికి గురిచేసింది. విజయవాడ రూరల్ మండలంలోని ప్రసాదంపాడు గ్రామంలో మూడేళ్ల నుంచి 20ఏళ్లలోపు వయసున్న ఒకేప్రాంతానికి చెందిన 15మంది బాలురు చవితి పందిరి ఏర్పాటు చేశారు. చందాలతోపాటు వినాయక విగ్రహానికి, ఊరేగింపురోజు నిమజ్జనానికి తీసుకెళ్లేందుకు తీన్‌మార్ ఏర్పాటుకు ఎవరో ఒకరిని దాతను వెతుక్కునేవారు. అలాగే నిమజ్జనం రోజున లడ్డూను వేలంపాట వేస్తున్నారు. ఈ యేడాది 5 కేజీల లడ్డూను వేలంపాట వేయగా రూ.2116తో పాట ప్రారంభించగా, జగన్‌మోహన్ రెడ్డి పాట అంటూ రూ.5వేలు, చంద్రబాబు పాట అని రూ.10వేలు చెప్పడంతో మరో గుంపు పవన్ కల్యాణ్ పాట రూ.20,116 అంటూ పాడుకోవడంతో యువకులు ఆశ్చర్యపోయారు. లడ్డూ అంత ధర పలుకుతుందని ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఓ భక్తుడు వినాయకుడికి సమర్పించుకున్న చాక్లెట్ల దండను కూడా వేలం వేద్దామని రూ.వెయ్యితో ప్రారంభించగా దాన్ని కూడా ఆయా పార్టీ అభిమానులు పోటీపడి చివరకు లోకేశ్ పాట అంటూ రూ.8116కు సొంతం చేసుకున్నారు.

ప్రకృతి సేద్యంలో ఎన్టీఆర్ జిల్లా నెంబర్‌వన్

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించాలని, శాస్త్రీయ ఆధారాలతో అపోహలు తొలగించి, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ప్రకృతి సాగు దిశగా చేయిపట్టి నడిపించాలని, ఇందుకు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్ఎఫ్), నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్)పై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం యూనిట్‌గా ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే ఘన, ద్రవ జీవామృతాల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి మాట్లాడుతూ నేల ఆరోగ్యం, వాతావరణ స్థితిస్థాపకతలకు అనుగుణంగా రైతులకు ఖర్చు తగ్గించి నికరాదాయం పెంచేలా ప్రకృతి సేద్య విధానాలతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై శంకర్ నాయక్ మాట్లాడుతూ ఎన్ఎంఎన్ఎఫ్ అనేది కేంద్ర ప్రాయోజిత పథకమని, ఇది వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తోందన్నారు. జిల్లాస్థాయిలో ప్రస్తుతం 149 వీవోలు పనిచేస్తున్నాయని, వీటిలో 94 వీవోలను ఎన్ఎంఎన్ఎఫ్ కింద తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ప్రకృతి వ్యవసాయం, వివిధ పంటల్లో పురుగులు/తెగుళ్ల యాజమాన్య దీపిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ఉద్యాన అధికారి పీ బాలాజీ కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ హనుమంతరావు, ఏటీఎంఏ ఏడీ టీ మాధవీలత, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం రవికిశోర్, ఆర్‌వైఎస్ఎస్ సీనియర్ టీమ్ లీడర్ సీహెచ్ చంద్రశేఖర్, ఆర్ అరుణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నవంబరు 4 నుంచి మారనున్న
డెల్టా ఎక్స్‌ప్రెస్ వేళలు.!

45 నిమిషాల ముందే నగరానికి రానున్న రేపల్లె నుంచి-వికారాబాద్ రైలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రేపల్లె-వికారాబాద్ మార్గంలో నడిచే డెల్టా ఎక్స్‌ప్రెస్ (17626) నవంబరు 4నుంచి మారనున్నాయి. ప్రస్తుతం రేపల్లె నుంచి ప్రతిరోజూ రాత్రి 10.40 గంటలకు బయల్దేరి సికింద్రాబాద్‌కు తర్వాతి రోజు ఉదయం 7.20 గంటలకు చేరుకుంటోంది. కాగా, నవంబరు 4నుంచి వేళల్లో మార్పు కారణంగా ఈ రైలు సికింద్రాబాద్‌కు 45 నిమిషాలు ముందే (ఉదయం 6.35 గంటలకు) రానుంది. అలాగే, వికారాబాద్‌కు ప్రస్తుతం చేరుకునే సమయం (9.40) కన్నా వేళలు మారాక 20 నిమిషాల ముందుగానే (9.20గంటలకు) రానుండడం గమనార్హం. రైల్వే శాఖ నిర్ణయంతో డెల్టా ప్రాంతం నుంచి నగరానికి వచ్చేవారికి ప్రయాణ సమయం ఆదా కానుందని ప్రయాణికుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

దేవాలయాలే.. టార్గెట్

వరుసగా రెండు రోజులు ఆలయాల్లోని హుండీల్లో నగదు చోరీ ● సీసీ కెమెరాల ద్వారా ఆచూకీ కనుగొన్న పోలీసులు

కృష్ణలంక, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లోని హుండీలనే టార్గెట్‌గా పెట్టుకొన్నాడు ఆ దొంగ వరుసగా రెండు రోజులు వేర్వేరు ఆలయాల్లోని హుండీలను బ్రేక్ చేసి వేలాది రూపాయల నగదును చోరీ చేశాడు. చివరికి పాపం పండి మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడిన గుడిలో సీసీ కెమెరాలకు చిక్కాడు. కృష్ణలంక పోలీసులు దొంగ ఆచూకీని గుర్తించారు. త్వరలోనే పట్టుకొంటామని సీఐ నాగరాజు తెలిపారు. వారం క్రితం కృష్ణలంక 22వ డివిజన్‌లోని మార్వాడీ గుడిలో పూజారిగా పనిచేస్తున్న అప్పయ్య శర్మ ఆలయం సమీపంలో ఓ ఇంటిలో నివసిస్తున్నారు. పై అంతస్తులో ఉన్న ఆయన ఇంటికి అర్ధరాత్రి 2 గంటల సమయంలో దొంగ ప్రవేశించగా అలికిడి కావడంతో శర్మ లేచి గట్టిగా అరవగా పరారయ్యాడు. తర్వాత సోమవారం అర్ధరాత్రి 1.30 నుంచి 2 గంటల మధ్య కుర్తాళం పీఠంలో ప్రత్యాంగిరా దేవి ఆలయంలోకి దొంగ గోడ దూకి ప్రవేశించి ఆలయం ముందున్న హుండీని బ్రేక్ చేసి అందులో సుమారు రూ.10వేలు నగదు చోరీ చేశాడు. ఇదేదో బాగుందనుకొని వెంటనే మంగళవారం రాత్రి కుర్తాళం పీఠానికి కూతవేటు దూరంలో ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోకి ఇలాగే ప్రవేశించి హుండీని బ్రేక్ చేసి దాదాపు రూ.1.50 లక్షల వరకు నగదు మూట కట్టుకొని పారిపోయాడు. గుడి ఆవరణలోని సీసీ కెమెరాలను కృష్ణలంక పోలీసులు పరిశీలించగా తలపై చోరీ సొమ్ము ఉన్న మూటను తీసుకెళ్తుండటాన్ని గుర్తించారు. అతడి చేతిపై శ్రీనివాస్ అనే పచ్చబొట్టు ఉండటంతో పోలీసులు గుర్తించారు. త్వరలోనే నిందితుడిని పట్టుకొంటామని సీఐ నాగరాజు తెలిపారు.




కృష్ణలంక మెట్లబజారులోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో, కృష్ణలంక పాత పోస్టాఫీసు రోడ్డులోని కుర్తాళం పీఠంలో పగిలిపోయిన ఉన్న హుండీలు



ఎలక్ట్రిక్ బస్ తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేస్తున్న స్విచ్ మొబిలిటీ ఆటోమోటివ్ సంస్థ సీఈవో

టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ బస్సు

తిరుమల, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చెన్నైకి చెందిన స్విచ్ మొబిలిటీ ఆటోమోటివ్ లిమిటెడ్ టీటీడీకి ఓ ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా అందజేసింది. ఆ సంస్థ సీఈవో గణేష్ మణి, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వెంకటరమణ రూ.1.33 కోట్ల విలువైన ఈ బస్సుకు బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, తాళాలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

సీపీఎస్ రద్దు హామీ నెరవేర్చాలి

▸▸ ప్రభుత్వానికి ఏపీసీపీఎస్ఈఏ విజ్ఞప్తి

విజయవాడ (గాంధీనగర్) సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కె.రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2004 సెప్టెంబరు 1 నుంచి అమలు చేస్తున్న సీపీఎస్ రద్దు చేయాలని దశాబ్ద కాలంగా అనేక ఉద్యమాలు చేస్తున్నా ఫలితం లేదని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు లక్షల సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లకుండా గురువారం జరగబోయే మంత్రివర్గ సమావేశంలో సీపీఎస్ రద్దుకు తగిన రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వంలో సీపీఎస్ ఉద్యోగులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

▸▸ సీఎంకు ఏపీ పెన్షనర్స్ పార్టీ విజ్ఞప్తి

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్టు ఏపీ పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి. సుబ్బరాయన్ తెలిపారు. అమరావతి సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును కలిసి ఈమేరకు వినతి పత్రం అందజేసినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వందలాది మంది పెన్షనర్లు తమ జీవిత కాల కష్టార్జితం అయిన తమ బకాయిలను అనుభవించకుండానే చనిపోతున్నారని, పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలని సీఎంను కోరామని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్స్ సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు వెంటనే చేయాలని కోరినట్టు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్‌లో చర్చించాలి: పఠాన్ బాజీ

గుంటూరు సిటీ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం) ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్‌లో చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పఠాన్ బాజీ కోరారు. బుధవారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబరు 1 నుంచి సీపీఎస్‌ను రద్దు చేయాలని పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కూటమి నేతలు ఎన్నికలకు ముందు సీపీఎస్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సుమారు 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల జీవితాలతో ముడిపడిన సమస్యకు క్యాబినెట్ సమావేశంలో రూట్ మ్యాప్ రూపొందించాలన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

▸▸ నవ్యాంధ్ర ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్

కాకినాడ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేసి ఏళ్లు గడుస్తున్నా తమకు రావల్సిన బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని నవ్యాంధ్ర ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రవికుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. బుధవారం కాకినాడలో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామలింగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జలజీవన్ పథకం పనులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కాంట్రాక్టర్లు పెద్దఎత్తున తరలివచ్చి తమ సమస్యలపై చర్చించారు. జలజీవన్ మిషన్ పనులకు బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా చేపట్టిన అన్ని పనులు నిలిపివేయాలని నిర్ణయించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రవికుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ కాంట్రాక్టర్లకు ఆర్థిక భరోసా కల్పించేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన రూ.150 కోట్ల బకాయిలను చిన్నచిన్న కాంట్రాక్టర్‌కు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్‌గా నారాయణ స్వామి బాధ్యతల స్వీకరణ



అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ కార్పొరేషన్ చైర్మన్‌గా గుడుపూటి నారాయణ స్వామి బుధవారం విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమానికి కూటమి ప్రభుత్వ కృషి భేష్

▸▸ ఏబీబీఎం ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ సంక్షేమానికి చేస్తున్న కృషి అభినందనీయమని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు, అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం (ఏబీబీఎం) ఉపాధ్యక్షుడు జి.సుబ్రహ్మణ్యశర్మ కొనియాడారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆయన ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ నియమితులైన బుచ్చి రాంప్రసాద్‌తో భేటీ అయ్యారు.

రేపు డీఎస్ఎన్ఎల్‌యూ సంయుక్త స్నాతకోత్సవం

విశాఖపట్నం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవాన్ని (8, 9, 10, 11, 12వ స్నాతకోత్సవాలు) ఈ నెల ఐదో తేదీనవిశాఖ బీచ్‌రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు వెల్లడించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నరసింహ గౌరవ అతిథిగా, విశిష్ట అతిథులుగా సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ జే కే మహేశ్వరి, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ హాజరవుతారన్నారు. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి, డీఎస్ఎల్ఎన్‌యూ గౌరవ చాన్సలర్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారని చెప్పారు.

చేతబడి నెపంతో వృద్ధుడి దారుణ హత్య

పలాస, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చేతబడి చేస్తున్నాడనే అనుమానంతో శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కేశపురం గ్రామంలో ఓ వృద్ధుడిని దారుణంగా హతమార్చారు. మృతుడి సమీప బంధువులే ఈ దారుణానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన అంబలి తులసీరావు, ఉంగ రాములు వరుసకు అన్నదమ్ములు. తులసీరావు మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. ఆయనకు చేతబడి చేశారని కుటుంబీకులు అనుమానించి సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన తాంత్రిక పూజలు చేసే వ్యక్తిని తీసుకువచ్చి మంగళవారం రాత్రి పూజలు జరిపారు. తులసీరావుకు గ్రామంలో ఉంటున్న వారే చేతబడి చేశారని పూజలు చేసిన వ్యక్తి చెప్పాడు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి సమయంలో అంబలి తులసీరావు, అంబలి చంద్రయ్య, సారిపతి రాజ్‌కుమార్, బుడ్డ తేజేశ్వరరావు, బుడ్డ లక్ష్మీకాంత్, అంబలి రాశి, కోనారి సూర్యనారాయణ, అంబలి భీమారావు.. కర్రలు, రాళ్లు చేతపట్టుకుని రాములు(80) ఇంటికి చేరుకుని ముందుగా రాళ్లు విసిరారు. బయటకు వచ్చిన రాములును కర్రలు, రాళ్లతో కొట్టడంతో అక్కడిక్కడే కుప్పకూలి మృతి చెందాడు. గ్రామంలో నివాసం ఉంటున్న అతని కుమార్తెలు ముగ్గురు ఘటనా స్థలానికి చేరుకుని కేకలు వేయడంతో నిందితులంతా పరారయ్యారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ పి.సూర్యనారాయణ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ప్రయాణం నరకప్రాయం

● భారీవర్షాలకు జిల్లాలో దెబ్బతిన్న 105 ఆర్ అండ్ బీ రోడ్లు
● తక్షణ మరమ్మతులకు రూ.19 కోట్లు
● పూర్తి నిర్మాణానికి రూ.193 కోట్లు అవసరమని అధికారుల అంచనా
● అంచనాలు రూపొందించి కలెక్టర్ లక్ష్మీశకు అందజేత

భారీ గుంతలతో రోడ్లు అతలాకుతలం

అంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ద్రోణి జిల్లాలోని రహదారులను ఛిద్రం చేశాయి. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అప్పటికే కొద్దిగా పాడైన రోడ్లను జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలు మరింతగా దెబ్బతీశాయి. ప్రస్తుతం భారీగుంతలు, మొనతేలిన కంకర రాళ్లతో భయంకరంగా దర్శనమిస్తున్నాయి. కనీసం నడిచేందుకుకైనా వీలు లేకుండా తయారయ్యి ప్రయాణికులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రధానంగా రాష్ట్ర రహదారులు, జిల్లా ప్రధాన రహదారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. తాజాగా జిల్లాలో 105 రోడ్లు దెబ్బతిన్నాయని, భారీ గుంతలతో దర్శనమిస్తున్నాయని ఆర్ అండ్ బీ అధికారులు నివేదిక తయారు చేసి కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశకు మంగళవారం అందజేశారు.




భారీ వర్షాలకు దెబ్బతిన్న మైలవరం మండలంలోని వెల్వడం అడ్డరోడ్డు, మైలవరం మండలం గణపవరం గ్రామంలోని విస్సన్నపేట-విజయవాడ ప్రధాన రహదారి

493 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం

విజయవాడ, మైలవరం ఆర్‌అండ్‌బీ డివిజన్లలో 493.25 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. వరద నీటి ప్రవాహంతో 12 రోడ్లు దెబ్బతిన్నాయని, 24 రోడ్లపై వంతెనలు, కల్వర్టులు, రెయిలింగ్ దెబ్బతిన్నాయని, 17 రోడ్లు కోతకు గురయ్యాయని, మూడు రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని స్పష్టం చేశారు. వీటిని వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు రూ.19.48 కోట్లు, శాశ్వత రోడ్డు నిర్మాణానికి రూ.193.47 కోట్లు అవసరమని నివేదికలో పొందుపర్చారు.

ఈ దోపిడీ..!

● 'ఐ లవ్ యూ'తో రూ.11వేలు లాగేసిన నేరగాళ్లు
● కారు చూపించి బంగారం కొట్టేసిన వైనం
● కొత్త ట్రిక్‌లతో సైబర్ మోసాలు

అంధ్రజ్యోతి - విజయవాడ: విజయవాడకు చెందిన ఓ అబ్బాయికి ఇన్‌స్టాలో ఓ అమ్మాయి పరిచయమైంది. ఒకరి వీడియోలకు ఒకరు లైక్‌లు కొట్టుకున్నారు. రిప్లైలుగా కన్ను కొట్టే ఎమోజీలు పంపుకున్నారు. కొన్ని రోజుల క్రితం ఇన్‌స్టాలోనే అబ్బాయికి అమ్మాయి ఐ లవ్ యూ అని మెసేజ్ పెట్టింది. దీనికి రిప్లైగా అబ్బాయి ఐ లవ్ యూ టూ అని మెసేజ్ పంపాడు. మర్నాడు ఆ అబ్బాయి ఫోన్ నంబరుకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఇన్‌స్టాలో పరిచయమైన అమ్మాయికి ఐ లవ్ యూ అని చెప్తావా? ఈ విషయం ఆమె భర్తకు తెలిసి ఫోన్ పగలు కొట్టేశాడని చెప్పాడు. తామంతా మైలవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్నామని, అక్కడికి రావాలని బెదిరించాడు. ఈ మాటలకు బెదిరిపోయిన అబ్బాయి ఏం చెప్తే అది చేస్తానని ఏడ్చాశాడు. దీన్ని ఒక అవకాశంగా మార్చుకున్న అవతలి వ్యక్తి ముందుగా రూ.5వేలు ఫోన్ పే చేయించుకున్నాడు. తర్వాత కాసేపటికి మరో రూ.6వేలు జమ చేయించుకున్నాడు. కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది. ఇన్‌స్టాలో సైబర్ నేరగాళ్లు ఫేక్ ప్రొఫైల్‌తో ఐ లవ్ యూ చెప్పి రూ.11వేలను లాగేశారు. ఒక నేరంపై ప్రజలకు అవగాహన వచ్చిందని తెలిసిన తర్వాత ఈ మోసంలోకి కొత్తరకం ట్రెండ్‌ను దింపుతున్నారు. ఇప్పటి వరకు డిజిటల్ అరెస్టులతో ప్రజలను భయ పెట్టిన ఈ నేరగాళ్లు కొత్త ప్రయోగాలు చేశారు. ఇందులో ఒక ప్రయోగంలో యువకుడు రూ.11వేలను పోగొట్టుకున్నాడు. మరో వ్యాపారి డబ్బులను చెల్లించేసినా వాటిని చెక్కుచెదరకుండా సైబర్ క్రైం పోలీసులు బ్లాక్ చేయించారు. ఈ రెండింటి పైనా పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు చూపించి బంగారం కొనేశారు

ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టిన కారును చూపించి దాన్ని కొనుగోలు చేయాలనుకున్న వ్యక్తి డబ్బులతో సైబర్ నేరగాళ్లు బంగారం బిస్కట్లు కొనిపించారు. ఈ ఘటనలో బాధితుడు సైబర్ నేరగాళ్లకు పంపిన డబ్బులు మరో ఖాతాలోకి వెళ్లకుండా పోలీసులు 'బ్లాక్' వలయం బిగించారు. గొల్లపూడికి చెందిన అనపర్తి శ్రీకాంత్ కారుల కొనుగోలు, అమ్మకాలు చేస్తుంటాడు. ఏపీ39 క్యూటీ 6856 నంబరు గల ఇన్నోవా క్రిస్టా కారు 30వేల కిలోమీటర్లు తిరిగింది. దీని యజమాని ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టారు. దీన్ని గమనించిన సైబర్ నేరగాళ్లు మోసానికి ప్రణాళిక వేశారు. ఓఎల్ఎక్స్‌లో ఉన్న కారు ఫొటోను, దాని కింద ఉన్న ఫోన్ నంబరును సైబర్ నేరగాళ్లు తీసుకున్నారు. ఈ కారు ఫొటోను శ్రీకాంత్ వాట్సాప్‌కు పంపారు. కారును చూసుకోవడానికి వెళ్లాల్సిన ప్రదేశం చెప్పి పంపించారు. కారును చూసుకోవడానికి తాము వస్తున్నామని యజమానితో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన తన బావమరిది నంబరు ఇచ్చారు. అదే నంబరు శ్రీకాంత్‌కు ఇచ్చారు. కారు నచ్చడంతో శ్రీకాంత్ కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు. రూ.11లక్షలకు బేరం కుదిరింది. ఆ మొత్తాన్ని పంపించేందుకు నేరగాళ్లు తునిలో ఉన్న ఓ జువెలరీ షాపు బ్యాంక్ ఖాతా నంబరు ఇచ్చారు. శ్రీకాంత్ డబ్బుల ఆర్టీసీఎస్ ద్వారా పంపేటప్పుడు జువెలరీ షాపు పేరు వచ్చింది. దీనితో ఆయన సైబర్ నేరగాళ్లతో మాట్లాడారు. అకౌంట్ పేరు జువెలరీ షాపు పేరు మీద ఉందని అడిగితే దానికే డబ్బులు పంపమని చెప్పారు. ఈ డబ్బులతో సైబర్ నేరగాళ్లు బంగారం బిస్కట్లు కొనుగోలు చేశారు. డబ్బులు పంపిన తర్వాత సందేహం వచ్చి కారును చూపించిన వ్యక్తికి ఫోన్ మొత్తం డబ్బులు పంపాననిన్నాడు. ఆయన తనకు ఎలాంటి డబ్బులు రాలేదని చెప్పాడు. దీనితో మోసపోయాయని గ్రహించిన శ్రీకాంత్ వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. అదే సమయంలో బ్యాంక్ మేనేజర్‌కు ఫోన్ చేసి తాను పంపిన డబ్బులను బ్లాక్ చేయాలని చెప్పాడు. బ్యాంక్ మేనేజర్ బ్లాక్ చేయకుండా లీన్(ఆ మొత్తాన్ని మాత్రమే బ్లాక్ చేయడం) చేశారు. కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు నోటీసులు ఇవ్వడంతో మొత్తం అకౌంట్‌ను బ్లాక్ చేశారు. ఈ కేసులో ఒక్క రూపాయి ఈ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకట్ట వేశారు.

టెక్కీ ఉద్యోగాల పేరుతో టోకరా

విజయవాడ/చిట్టినగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్‌లో టెక్కీ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి రూ.1.50 లక్షలను లాగేశాడు. దీనిపై బాధితుడు కొత్తపేట పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. చిట్టినగర్ రామచంద్రరాజు వీధికి చెందిన వట్నాన యువరాజ్ గన్నవరంలోని హెచ్‌సీఎల్ కంపెనీలో సీనియర్ ఎనలిస్ట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. తనతోపాటు పనిచేసే చింత సాయితేజ అనే యువకుడి ద్వారా తరుణ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. తాను చెన్నైలోని కన్సల్టెన్సీలో పనిచేస్తున్నట్టు చెప్పుకొచ్చాడు. అమెజాన్, హెచ్‌సీఎల్ వంటి ప్రముఖ సంస్థల్లో తాను 14 మందికి ఉద్యోగాలు ఇప్పించానని చెప్పాడు. హెచ్‌సీఎల్ ఉద్యోగవకాశాలున్నాయని ఒక్కో ఉద్యోగానికి రూ.2.50లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. యువరాజు ఈ విషయాన్ని చిన్నమ్మ కుమార్తె భవానీకి చెప్పడంతో ఆమె ముందుకొచ్చింది. ఆమెకు సంబంధించిన గుర్తింపు కార్డు, ధ్రువీకరణపత్రాలు పంపాలని తరుణ్ అడిగాడు. తర్వాత తరుణ్ ఫోన్ చేసి ఆమె తరఫున పరీక్ష రాశానని చెప్పాడు. దీనికి రూ.60వేలు పంపమని బ్యాంక్ ఖాతా నంబరు ఇచ్చాడు. ఒకసారి రూ.40వేలు, మరోసారి రూ.20వేలు పంపారు. ఇంటర్వ్యూ సమయానికి ముందు మరికొంత ఇవ్వాలని చెప్పాడు. మొత్తంగా రూ.1.50 లక్షలను తరుణ్‌కు పంపారు. భవానీకి హెచ్‌సీఎల్ కంపెనీ పంపినట్టుగా మెయిల్స్ పంపాడు. మిగిలిన డబ్బుల కోసం పదేపదే ఫోన్లు చేసి తొందర పెడుతుండడంతో అనుమానం వచ్చిన వారు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆంధ్రజ్యోతి

9

నవ్య

కుటుంబ కదంబం

గురువారం • 4 సెప్టెంబరు 2025

• రేపు ఉపాధ్యాయ దినోత్సవం





ఏడేళ్ల క్రితం... ఆ పాఠశాలలో ఇద్దరే విద్యార్థులు.
ఆ బడిని మూసేయాలని అధికారులు భావిస్తున్న దశలో...
ఉపాధ్యాయినిగా బాధ్యతలు చేపట్టారు **కళ్యాణి కుమారి.**
ఇంటింటికీ వెళ్లి, తల్లిదండ్రులను ఒప్పించి... విద్యార్థుల సంఖ్య పెరిగేలా
కృషి చేశారు. ప్రస్తుతం 55 మంది పిల్లలు చదువుతున్న ఆ పాఠశాలలో
అనేక మార్పులకు శ్రీకారం చుట్టారు.
సర్వత్రా ప్రశంసలతోపాటు పలు పురస్కారాలను కూడా
అందుకున్న కళ్యాణి ఎందరికో ఆదర్శంగా
నిలుస్తున్నారు.



బడిని బతికించారు!

పేదల జీవితాలు మారాలంటే అది విద్యతోనే సాధ్యమని కళ్యాణి కుమారి గట్టిగా నమ్ముతారు. ఆమెది కర్నూలు జిల్లా ఆలూరుకు చెందిన మధ్యతరగతి కుటుంబం. లక్ష్మీదేవి, నెట్టేకల్ దంపతులకు మూడో సంతానమైన ఆమె చదువు సరైన వసతులు లేని ప్రభుత్వ పాఠశాలలో సాగింది. తండ్రి చిన్నస్థాయి ప్రభుత్వ ఉద్యోగి. ఆదోనిలో బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన కళ్యాణికి... వైద్యశాఖలో పని చేస్తున్న రమేష్‌తో వివాహమయింది. భర్త ప్రోత్సాహంతో డీఎస్సీ పరీక్ష రాశారు. 2010లో హొళగుంద మండలంలోని నాగరకన్వి ప్రాథమిక పాఠశాలలో తొలిసారిగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఆ తరువాత పత్తికొండ మండలం రాజీవ్‌నగర్ స్కూల్‌లో పని చేసేవారు. వాహన సౌకర్యం లేని ఆ ప్రాంతానికి రోజూ రెండున్నర కిలోమీటర్లు నడిచివెళ్లి పిల్లలకు పాఠాలు చెప్పేవారు. తర్వాత పత్తికొండకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీవరాళ్లమల తండా (జేఎం తండా) పాఠశాలకు 2017లో బదిలీ అయ్యారు. అప్పటికి ఆ బడిలో ఉన్నది ఇద్దరే విద్యార్థులు. దీనితో ఆ పాఠశాలను మూసివేయాలనే ప్రయత్నంతో విద్యాశాఖ అధికారులు ఉన్నారు. ఇది కళ్యాణిని ఎంతగానో కలవరపరిచింది.

గడప గడపకూ తిరిగి...

"ఆ గ్రామంలో 700 మందికి పైగా జనాభా ఉన్నారు. పాఠశాల హాజరు పట్టికలో 14 మంది పేర్లు ఉన్నప్పటికీ... బడికి వచ్చేవారు ఇద్దరే. కేవలం ఇద్దరికి పాఠాలు చెప్పి, జీతం తీసుకోవడం నాకు మనస్కరించలేదు. పరిస్థితులను నెల రోజులు పరిశీలించాను. అక్షరాస్యతకు నోచుకోని జేఎం తండాలోని పిల్లలను ఉన్నత విద్యావంతులుగా చేయాలనుకున్నాను. విద్యార్థులు రావాలంటే బడిని సుందరంగా మార్చాలనుకున్నాను. దానికి నా భర్త సహకారం తీసుకున్నాను. ఆయన ఉద్యోగానికి సెలవు పెట్టి మరీ పాఠశాల సుందరీకరణలో భాగమయ్యారు" అని చెప్పారు కళ్యాణి. వారం రోజుల పాటు వారిద్దరూ కష్టపడ్డారు. ముందుగా పాఠశాల పరిసరాల్లో తాగుబోతులు పారేసిన మద్యం సీసాలను, ఆ తరువాత పిచ్చి మొక్కలు, బండరాళ్ల, చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఆ ప్రాంతాన్ని ఆహ్లాదమైన పార్కులా మార్చేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారితో సహా ఇంటింటికీ తిరిగి, పిల్లలను బడికి పంపాలని కోరారు. అయితే పిల్లలను తమతో పనులకు తీసుకువెళ్లడానికే తల్లిదండ్రులు మొగ్గుచూపారు. అయినప్పటికీ కళ్యాణి పట్టు వదలలేదు. పదే పదే తండాలో ప్రతి గడపకూ వెళ్లారు. నిరక్షరాస్యులైన వారి తల్లిదండ్రులను చివరకు ఒప్పించారు. ఆమె సంకల్పంలో తొలి అడుగు విజయవంతం అయింది. ఇద్దరు పిల్లల సంఖ్య పదికి చేరింది. ఆ తరువాత... పిల్లలకు పాఠాలు చక్కగా అర్థం కావడం కోసం చార్టులపై ఇంట్లోనే బొమ్మలు వేసి, పిల్లలకు వివరించేవారు. వారిలో ఆసక్తి పెంచడానికి ల్యాప్‌టాప్‌లో వీడియోలు చూపించారు. ఉదయం ప్రార్థన, సాయంత్రం ఆటలు... ఇలా అన్నీ క్రమం తప్పకుండా చేయించారు. ఇది గమనించిన గ్రామస్తులకు ఆమెపై గట్టి నమ్మకం ఏర్పడింది.

ఆధునిక పద్ధతుల్లో బోధన

బోధనలో విద్యార్థులను ఆకట్టుకోవడానికి ఆధునిక పద్ధతులను కళ్యాణి అనుసరిస్తున్నారు. ప్రతి వారం విద్యార్థులకు వివిధ సబ్జెక్ట్‌లో 'స్టార్ ఆఫ్ ది వీక్' పేరుతో పరీక్షలు నిర్వహించి, చిన్న చిన్న బహుమతులతో విద్యపట్ల వారి అభిరుచిని పెంచారు. ప్రాథమిక విద్య తరువాత... వివిధ పరీక్షలకు వారిని సిద్ధం చేస్తూ... ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో సీట్లు, సైనిక్ స్కూల్, గురుకుల, నవోదయ పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించేలా శిక్షణ ఇచ్చారు. గడిచిన అయిదేళ్లలో 35 మంది వివిధ పాఠశాలల్లో ప్రవేశాలు పొందారు.

> **అందరూ ప్రభుత్వ బడికే...**
>
> ఒకప్పుడు నాటుసారాకు నిలయంగా పేరుపడిన జేఎం తండా ఇప్పుడు సరస్వతీ పుత్రులకు చిరునామాగా మారుతోంది. పిల్లల పట్ల కళ్యాణి చూపించే శ్రద్ధకు ముగ్ధులైన ఆ గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల వారు కూడా... ప్రైవేటు పాఠశాలలకు బదులు ఈ ప్రభుత్వ పాఠశాలకే తమ పిల్లల్ని పంపుతున్నారు. కళ్యాణి సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుతోపాటు ప్రతిభా పురస్కారాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నో అవార్డులు, ఇతర పురస్కారాలు స్వచ్ఛంద సంస్థలు, విద్యాశాఖ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి పలు సత్కారాలు పొందారు. అలాగే శ్రీశక్తి ప్రతిభా పురస్కార్, జ్యోతిరావు పూలే అవార్డులు కూడా ఆమెను వరించాయి.

అలాగే 'దీర్ఘాయుష్మాన్ భవ' పేరిట విద్యార్థుల పుట్టిన రోజులను నిర్వహించారు. అయితే స్వీట్లు, చాక్లెట్లు పిల్లల ఆరోగ్యం మీద ప్రభావం చూపుతాయన్న ఆలోచనతో... వాటికి బదులు సబ్బులు, షాంపూలు, టూత్ పేస్టులు, టూత్ బ్రష్‌లను అందించారు. వారితో మొక్కలు నాటించారు. తద్వారా వారి వ్యక్తిగత పరిశుభ్రతకు, పర్యావరణ పరిరక్షణకు ఆమె దోహదపడుతున్నారు. ఆ పిల్లలందరూ పేద కుటుంబాలవారు కాబట్టి... వారికి కావలసిన పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని కొనడానికి, ఇతర సౌకర్యాల కోసం తన జీతంలో కొంత భాగాన్ని కళ్యాణి కేటాయించారు. సొంత డబ్బుతో అంగన్‌వాడీ బడికి దోమతెరలు, ఫ్యాన్లు, పేద పిల్లలకు పుస్తకాలు కొని ఇచ్చారు. ఆమె చొరవతో ఇప్పుడు ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 55కు చేరుకుంది. ఒకప్పుడు ఆ పాఠశాలను మూసేయాలనుకున్న అధికారులు ఇప్పుడు మరో ఉపాధ్యాయుడిని నియమించారు.

ఉద్యోగం కాదు, సామాజిక సేవ

మారుమూల గిరిజన తండా పిల్లల చదువు కోసం కృషి చేస్తున్న కళ్యాణి సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాది జూన్ 2న అమరావతికి ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను ఆహ్వానించి సత్కరించారు. ఆమె చేసిన, భవిష్యత్తులో చేయాలనుకుంటున్న కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె చెప్పిన పలు అంశాలను నోట్ చేసుకున్నారు. "ఉపాధ్యాయ వృత్తి ఆదర్శవంతమైనది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద వర్గాల పిల్లలకు కూడా ఎంతో ప్రతిభ ఉంటుందని నిరూపించాలనేది నా ప్రయత్నం. ఈ వృత్తిని ఉద్యోగంలా కాకుండా సామాజిక సేవగా భావిస్తున్నాను. కుటుంబంలో ఒక వ్యక్తి చదువుకుంటే ఆ కుటుంబం బాగుపడుతుంది. వంద కుటుంబాల్లో విద్యావంతులు ఉంటే సమాజం మరింత ముందంజ వేస్తుంది" అంటున్నారు కళ్యాణి.

• **చల్లా నవీన్‌కుమార్ నాయుడు,**
కర్నూలు

డాక్టర్ తరచూ వెన్ను నొప్పి వేధిస్తోంది. ఎంతో అసౌకర్యానికి గురవుతున్నాను. ఈ సమస్యకు తప్పుడు శరీర భంగిమలే కారణమా? దీన్ని వెన్నుకు సంబంధించిన సమస్యగా భావించాలా? ఒకవేళ వెన్ను సమస్య అయితే, సర్జరీతో ఫలితం ఉంటుందా? సర్జరీ ఎంతవరకూ సురక్షితం?

- ఓ సోదరి,
హైదరాబాద్.

వెన్ను నొప్పి వేధిస్తోందా?



ఎక్కువ సమయంపాటు కుర్చీలో ఒకే భంగిమలో కూర్చుని పని చేయడం వల్ల శరీర భారం వెన్ను మీద పడి, నొప్పి మొదలవవచ్చు. స్థూలకాయులైతే, ఎక్కువ సమయంపాటు నిలబడి పని చేయడం వల్ల శరీర బరువు వెన్ను మీద పడి నొప్పి మొదలవవచ్చు. ఈ నొప్పుల బారిన పడకుండా ఉండాలంటే జీవనశైలిలో, అలవాట్లలో, శరీర భంగిమల్లో మార్పులు చేసుకోవాలి. మీ వెన్ను సమస్యకు కారణాలు ఇవే అయితే, వాటిని సరిదిద్దుకోవాలి. అలాగే బరువులు ఎత్తేటప్పుడు మోకాళ్లను వంచి, బరువులు లేపాలి. స్థూలకాయులైతే అధిక బరువు తగ్గించుకోవాలి. ఎక్కువ సమయం కుర్చీలో కూర్చుని పని చేసే ఉద్యోగస్తులైతే, తరచుగా లేచి పది నిమిషాలు నడుస్తూ ఉండాలి. ఒకవేళ వెన్ను సమస్య జీవనశైలి మార్పులతో సరి అయ్యేది కాదని తేలితే, 'స్పైన్ ఎండోస్కోపీ' శస్త్రచికిత్సను ఆశ్రయించవచ్చు. వెన్ను నొప్పి, డిస్క్ ప్రొలాప్స్ సమస్యలకు పూర్వం వెన్ను ప్రదేశంలో గాటు పెట్టి సర్జరీ చేసేవారు. కానీ ఇప్పుడు అత్యాధునిక స్పైన్ ఎండోస్కోపీ సహాయంతో గాటుతో పని లేకుండా, వెన్ను కండరాలకు నష్టం కలగకుండా, రోగి త్వరగా కోలుకునేలా సర్జరీ ముగించే వీలుంది. ఈ సర్జరీలో సమస్యకు కారణమైన ప్రదేశాన్ని వైద్యులు తేలికగా, స్పష్టంగా గుర్తించి సరిదిద్దే వీలుంటుంది. కాబట్టి వెన్ను నొప్పికి కారణాలను పరిశీలించుకుని, తగిన చికిత్స ద్వారా సమస్యను శాశ్వతంగా అధిగమించే వీలుంది.

- **డాక్టర్ సుకుమార్ సూర**
సీనియర్ స్పైన్ అండ్ న్యూరో సర్జన్,
హైదరాబాద్.

అందమైన అధరాల కోసం!

పెదవులు అమ్మాయిల అందాన్ని రెట్టింపు చేస్తాయి. కానీ రకరకాల కారణాల వలన పెదవులు నల్లగా మారడం, పొడిబారడం వంటి సమస్యలు తలెత్తుతాయి. పెదవులను అందంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం..

- ప్రతిరోజూ రాత్రి పడుకోబోయే ముందు పెదాలకు బీట్‌రూట్ రసాన్ని రాసుకుంటే క్రమక్రమంగా అధరాలు కాంతులీనుతాయి.
- రోజూ పెదవులకు కొబ్బరి నూనె రాస్తే నునుపు అవుతాయి.
- పెదవులకు వెన్న రాసి మర్దనా చేసినా మృదువుగా మారతాయి.
- ఆలివ్ నూనె రాయడం వలన పెదాలకు తేమ అందుతుంది.
- పెదాలకు తేనె రాయడం వలన కూడా నలుపు రంగు తగ్గుతుంది.



వర్షాల్లో ట్రిప్‌కు వెళ్తున్నారా?

వర్షాకాలంలో ప్రకృతి చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. అందుకే ప్రకృతిని ఆస్వాదించాలనుకునేవారు ఈ కాలంలో ట్రిప్‌లు ప్లాన్ చేసుకుంటారు. కానీ పలు జాగ్రత్తలు తీసుకోకపోతే పర్యాటక ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పవు. కాబట్టి వర్షాకాలం ట్రిప్‌ల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకుందాం...

- కొన్నిసార్లు అంచనాలను తారుమారు చేస్తూ వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో తెలియదు. కాబట్టి గొడుగు, రెయిన్‌కోట్, వాటర్‌ప్రూఫ్ జాకెట్ వంటివి తీసుకెళ్లాలి. వాతావరణ పరిస్థితి ఎప్పటికి అప్పుడు తెలుసుకోవాలి.
- ఈ కాలంలో దోమలు ఎక్కువగా ఉంటుంటాయి. వాటి వలన మలేరియా, డెంగ్యూ సోకే ప్రమాదముంటుంది. కాబట్టి దోమతెర, మస్కిటో రెపెల్లెంట్ వెంట తీసుకెళ్లడం ఉత్తమం.
- వాతావరణ మార్పుల వలన కొందరు త్వరగా అనారోగ్యానికి గురవుతారు. కాబట్టి అత్యవసర మందులతో పాటు ఫస్ట్ ఎయిడ్ కిట్ వెంట తీసుకెళ్లాలి.
- వర్షాల కారణంగా నేల బురదగా ఉంటుంది. కాబట్టి చెప్పుల విషయంలో జాగ్రత్త వహించాలి. వాటర్‌ప్రూఫ్, గ్రిప్ ఉండే చెప్పులు, షూలు ఎంచుకోవాలి.
- ఎక్కడికి వెళ్లినా వెంట నీళ్ల సీసా ఉంచుకోవడం మంచిది. అలాగే వేడి చేసి చల్లార్చిన నీటిని తాగడానికి ప్రయత్నించాలి. రోడ్డు పక్కన దొరికే ఆహారాన్ని తినకుండా ఉండేందుకు చూడాలి.
- ఫోన్‌లు, ల్యాప్‌టాప్, కెమెరా వంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు తడవకుండా వాటర్‌ప్రూఫ్ కవర్లు, బ్యాగులు తీసుకెళ్లాలి.
- మొబైల్ ఫోన్ చార్జింగ్ పెట్టుకునే వెసులుబాటు అన్నిచోట్లా ఉండదు. కాబట్టి పవర్ బ్యాంక్, అడాప్టర్ వంటివి వెంట ఉంచుకోవాలి.
- గూగుల్ మ్యాప్ చాలావరకూ ఉపయోగకరంగా ఉంటుంది.. కానీ భారీ వర్షాల్లో గూగుల్ మ్యాప్ మీద ఆధారపడకూడదు. కాబట్టి పర్యాటక ప్రాంతాల్లో తిరిగేందుకు స్థానిక రవాణాను ఉపయోగించుకోవడం మంచిది.
- జలపాతాలు, సముద్రాల దగ్గర జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువ లోతుకు వెళ్లకూడదు. ఈ కాలంలో కొండచరియలు విరిగి పడడం, బురద, తేమ వంటి సమస్యలుంటాయి కాబట్టి ట్రెక్కింగ్‌కు వెళ్లకపోవడం మంచిది. ఒకవేళ వెళ్తే జలగలు, క్రిమికీటకాల నుంచి రక్షణ కోసం ఉప్పు, లైటర్ తీసుకెళ్లాలి.
- పర్యాటక ప్రదేశాల్లో అన్నిచోట్లా సిగ్నల్స్ ఉండకపోవచ్చు. కార్డ్‌లు, యూపీఐ పేమెంట్‌లు చేసే వెసులుబాటు ఉండకపోవచ్చు. కాబట్టి చేతిలో డబ్బులు ఉంచుకోవాలి.
- ఎక్కడికి వెళ్లాలనుకున్నా ముందుగానే అక్కడ వసతి ఏర్పాట్లు చేసుకోవడం మంచిది.
- ఎంత జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉన్నా కొన్నిసార్లు అనుకోని ప్రమాదాలు జరగవచ్చు. కాబట్టి ప్రయాణబీమా చేయించుకోవాలి.



సెలబ్ టాక్

ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ తనయగా వెండితెరకు పరిచయమైనా... తనదైన నటనతో అలరిస్తున్న నటి కల్యాణి ప్రియదర్శన్. తెలుగులో 'హలో' అంటూ మొదలైన ఆమె కెరీర్... హిట్లు, ఫ్లాపులతో సంబంధం లేకుండా జెట్ స్పీడ్‌తో దూసుకుపోతోంది. ఇటీవల విడుదలైన 'లోక చాప్టర్ 1: చంద్ర'... ఆమెను మరో స్థాయిలో నిలబెట్టింది. అందులో 'చంద్ర'గా నటించిన కల్యాణి... భారతీయ చిత్ర పరిశ్రమలో సూపర్‌ఉమన్ పాత్ర పోషించిన మొట్టమొదటి హీరోయిన్‌గా చరిత్ర సృష్టించారు. ఈ సందర్భంగా తన అనుభవాలు పంచుకున్నారు. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...



మన తెరపై సూపర్‌ఉమన్

నేను 'లోక చాప్టర్ 1: చంద్ర' ప్రాజెక్ట్‌లోకి రావడానికి రెండు మూడేళ్ల ముందు నుంచే సినిమాటోగ్రాఫర్ నిమిష్ రవితో కలిసి దర్శకుడు డోమినిక్ అరుణ్ దీనిపై పని చేశారు. తొలుత చిన్న బడ్జెట్ చిత్రంగా అనుకున్నారు. కానీ నిర్మాతగా దుల్కర్ సల్మాన్ ప్రాజెక్ట్‌ను మరో కోణంలో చూశారు. దీన్ని కేవలం స్త్రీ ప్రధానమైన చిత్రంగానే పరిమితం చేయవద్దని, కథ పరిధిని మరింత విస్తరించవచ్చని సూచించారు. వీటన్నిటి నేపథ్యంలో సినిమాలో నా పాత్ర... 'చంద్ర' ప్రయాణం మొదట అనుకున్నదాని కంటే చాలా పెద్దదిగా మారింది. ఆ క్షణమే గట్టిగా నిర్ణయించుకున్నా... 'చంద్ర'గా మెప్పించడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని.

కష్టమే... కానీ...

నేను చేసిన అత్యంత కష్టతరమైన ప్రాజెక్ట్‌ల్లో ఇది ఒకటి. ఎక్కువగా రాత్రి వేళల్లో షూటింగ్ చేశాం. అదికూడా నెలల తరబడి చిత్రీకరణ సాగింది. కానీ ప్రతి క్షణం ఆస్వాదించాను. యాక్షన్ సన్నివేశాలను మూడు వారాలపాటు ఏకధాటిగా చేయాల్సి వచ్చింది. స్టంట్స్, ఫైట్స్ షూటింగ్ అవ్వగానే ట్రైనింగ్ తీవ్ర స్థాయిలో సాగింది. అయితే నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చినప్పుడే స్టంట్స్ ట్రైనింగ్ మొదలుపెట్టాను. గతంలో ఎప్పుడూ ఇలాంటివి చేయలేదు. నాకు పూర్తిగా కొత్త. చిన్నప్పుడు అథ్లెటిక్స్ లాంటి వాటిలో కూడా ప్రవేశం లేదు. ఈ శిక్షణ నన్ను పూర్తిగా మార్చేసింది. హద్దులు చెరిపేసి, నాలోని శక్తిని మేల్కొలిపింది. వెనక్కి తిరిగి చూసుకొంటే... ఆ రోజులు ఎంత కష్టంగా అనిపించాయో... అంతకంటే ఎక్కువగా, జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకాలను అందించాయి.

కొత్త ద్వారాలు తెరుచుకున్నాయి...

సాధారణంగా మహిళ ప్రధాన పాత్రలుగా సాగే చిత్రాలపై సందేహాలు, సంకోచాలు ఉంటాయి. కానీ ఈ సినిమాతో అలాంటి కథలకు కొత్త ద్వారాలు తెరుచుకున్నాయని భావిస్తున్నా. నాకు తెలిసి మనందరం సరైన కథ, కథకుల కోసం ఎదురు చూస్తున్నాం. దుల్కర్ సల్మాన్ లాంటివారు ఇలాంటి కథలకు అండగా నిలిస్తే... అవి పూర్తి స్థాయిలో అలరించగలవని అనుకొంటున్నా. మహిళలే కాకుండా... మగవారు కూడా చిత్ర విజయాన్ని గొప్పగా చెబుతున్నారు. మంచి కథ ఉంటే ఆదరించడానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధమే. మనమే వారిని తక్కువ అంచనా వేస్తున్నాం.

నాన్న నేర్పిన పాఠం...

నటిగా నా ఈ ప్రయాణం అందంగా, నిలకడగా సాగుతోందంటే అందుకు ప్రధాన కారణం నాన్న నేర్పిన పాఠాలే. కీర్తి కంటే కళకు విలువ ఇవ్వాలని చిన్నప్పటి నుంచీ చెప్పేవారు. అలాగే నాకు ప్రేరణనిచ్చే, ప్రభావితం చేసే కథల కోసం వేచివుండే అవకాశం లభించడం నిజంగా నా అదృష్టం. ఇలాంటి వెసులుబాటు అందరికీ ఉండదు. ఈ అవకాశాన్ని ఒక బాధ్యతగా భావించి, నాకు సవాలు విసిరే పాత్రలను ఎంచుకోవడానికి ప్రాధాన్యం ఇస్తాను. కష్టపడి పనిచేసే తత్వం, ఓర్పు, భగవంతుడి ఆశీస్సుల ఫలితం విజయవంతమైన నా ఈ ప్రయాణం. ప్రతి చిత్రం నుంచీ ఏదోఒకటి నేర్చుకొంటాను. కొందరు ముందుకు నెట్టారు. మరికొందరు ఆగి ఆలోచించేలా చేశారు. ఇక నా రాబోయే ప్రాజెక్టుల్లో... రవి మోహన్ సర్‌తో 'జెనీ' విడుదలకు సిద్ధంగా ఉంది. కార్తి సర్‌తో 'మార్షల్' చేస్తున్నా. రెండూ భిన్నమైన కథలు, విభిన్న పాత్రలు.

ఎప్పుడు వద్దని చెప్పాలి..?

పిల్లల ప్రవర్తనను సరిదిద్ది వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమనే చెప్పాలి. పిల్లలు అడిగినవన్నీ ఇచ్చేయడం, ఏ పని చేసినా సమర్థించడం ఆమోదించదగ్గ అంశాలు కావని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు 'వద్దు' అని చెప్పడం తల్లిదండ్రులు నేర్చుకోవాలని సూచిస్తున్నారు. తల్లిదండ్రులు ఏ సందర్భాల్లో పిల్లలకు వద్దని గట్టిగా చెప్పాలో తెలుసుకుందాం..

- పిల్లలు రోడ్డు మీద పరుగెత్తడం, ఎత్తయిన ప్రదేశాలు ఎక్కడం లాంటివి చేస్తూ ఉంటారు. అలా చేయడం ఎంత ప్రమాదకరమో వివరిస్తూ మరోసారి అలా చేయవద్దని గట్టిగా హెచ్చరించాలి. అప్పుడే పిల్లలు భద్రత నియమాలు అర్థం చేసుకోగల్గుతారు.
- పిల్లలు తరచూ చాక్లెట్లు, స్వీట్లు, ఇతరత్రా జంక్ ఫుడ్ కావాలని అడుగుతూ ఉంటారు. వాటివల్ల వచ్చే అనారోగ్య సమస్యల గురించి చెబుతూ వద్దని వారించాలి. దీనివల్ల పిల్లలకు పోషకాహారం విలువ తెలుస్తుంది.
- పిల్లలు హోంవర్క్ చేయకుండా బయట ఆడుకోవడానికి వెళతామని అడుగుతూ ఉంటారు. ఇంట్లో ఏ చిన్న పని చెప్పినా చేయకుండా తప్పించుకుంటూ ఉంటారు. అలాంటి సందర్భాల్లో కూడా వద్దని గట్టిగా చెప్పాలి. ఎప్పటి పనులు అప్పుడే పూర్తిచేయాలని నచ్చచెప్పాలి. దీంతో పిల్లలు క్రమశిక్షణ, సమయపాలన నేర్చుకుంటారు.
- తోటివారిపట్ల అమర్యాదగా ప్రవర్తించినా, పెద్దలతో అగౌరవంగా మాట్లాడినా పిల్లలను వద్దని వారించాలి. అందరితో స్నేహభావంతో మెలిగే మంచి ప్రవర్తనను అలవాటు చేయాలి.



- తోటి పిల్లల దగ్గర చూసిన ప్రతి ఆటవస్తువూ కావాలని పట్టుబట్టినా, తరచూ మొబైల్ ఫోన్ కావాలని అడిగినా వద్దని గట్టిగా చెప్పాలి. డబ్బు, సమయం విలువను పిల్లలకు అర్థమయ్యే రీతిలో వివరించాలి.
- పరిమితికి మించి పిల్లలు అల్లరి చేస్తున్నా, కోపంతో వస్తువులు విసిరి వేస్తున్నా, తరచూ చెడు మాటలు మాట్లాడుతున్నా వద్దని గట్టిగా చెప్పాలి. శాంతంగా ఉండడం, సంయమనంగా వ్యవహరించడం, భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడాన్ని పిల్లలకు నేర్పించాలి.
- ఇంట్లో క్రమశిక్షణ నియమాలు పాటించకపోయినా, ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నా కూడా వద్దని చెప్పాలి. దీనివల్ల పిల్లలకు హద్దుల్లో ప్రవర్తించడం తెలుస్తుంది.

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా
ఆసియా కప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హార్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహూన్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.


మన్‌దీప్ సింగ్

జోకో.. జోరు

యూఎస్ ఓపెన్



సెమీస్‌కు నొవాక్, సబలెంక


సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖి పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడనుకొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసొవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ ప్యూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు

మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ 'కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

ఇక.. రసవత్తర పోరు

- వెస్ట్‌తో సెంట్రల్, సౌత్‌తో నార్త్ ఢీ
- దులీప్ ట్రోఫీ సెమీస్ నేటి నుంచే

బెంగళూరు: దులీప్ ట్రోఫీలో రసవత్తర సెమీస్ సమరానికి వేళైంది. గురువారం నుంచి జరిగే సెమీస్ మ్యాచ్‌లో వెస్ట్ జోన్‌తో సెంట్రల్ జోన్, సౌత్ జోన్‌తో నార్త్ జోన్ తలపడనున్నాయి. శ్రేయాస్ అయ్యర్, యశస్వి జైస్వాల్, శార్దూల్ ఠాకూర్‌పై అందరి దృష్టి ఉంది. జైస్వాల్‌కు కూడా ఈ టోర్నీ కీలకంగా మారింది. రుతురాజ్ గైక్వాడ్, తనుష్ కోటియాన్ అదిరే ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాలనుకొంటున్నారు.

బలహీనంగా సౌత్..: తిలక్ వర్మ ఆసియా కప్ సన్నాహకాల్లో ఉండడం.. పేసర్ వైశాక్ విజయ్ కుమార్, సాయి కిషోర్ గాయపడడంతో సౌత్ జోన్ కొంత బలహీనపడింది. అయితే, జగదీశన్, దేవ్‌దత్ పడిక్కల్, రికీ భుయ్, తన్మయ్ అగర్వాల్, త్రిపురాన విజయ్, షేక్ రషీద్ చెలరేగాల్సి ఉంది. నార్త్ జోన్ టీమ్‌లో ఆయుష్ బదోని, యష్ ధుల్, అన్షుల్ కాంబోజ్ కీలకం.

టాప్ ఆల్‌రౌండర్‌గా సికందర్ రికార్డు



దుబాయ్: వన్డే ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచిన తొలి జింబాబ్వే ఆటగాడిగా సికందర్ రజా రికార్డు సృష్టించాడు. బుధవారం ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకుల జాబితాలో సికందర్ ఒక మెట్టెక్కి నెం:1 ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. అఫ్ఘానిస్థాన్ ఆటగాళ్లు ఒమర్జాయ్, నబి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. టీ20ల్లో హార్దిక్ పాండ్యా టాప్ ఆల్‌రౌండర్‌గా కొనసాగుతున్నాడు.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తోపాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు 'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది.. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుభ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్ధం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్ధంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవాంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లీ



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

బిజినెస్

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీతోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4.23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యుండయ్ హ్యాచ్ బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్ : సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ చైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ధి చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు మున్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్ జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యుండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు

కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పనిచేసే కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అవమానానికి గురయ్యాం

● పరువు నష్టం దావా కేసులో నాగార్జున తుది వాంగ్మూలం



తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావాలో అక్కినేని నాగార్జున తుది వాంగ్మూలం ఇచ్చారు. బుధవారం నాగార్జున తన కొడుకు నాగచైతన్యతో కలసి నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో విచారణకు హాజరయ్యారు. సురేఖ తమ కుటుంబంపై చేసిన అభ్యంతరకర, నిరాధార వ్యాఖ్యలతో తమకు తీవ్రమైన అవమానం జరిగిందని, మనోవేదనకు లోనయ్యామని నాగార్జున పేర్కొన్నారు. తన వాంగ్మూలంలో పేర్కొన్న విషయాలకు సంబంధించి ఛానెల్స్‌లో ప్రసారమైన వీడియోలు, పత్రికల్లో వచ్చిన కథనాలను నాగార్జున కోర్టులో సమర్పించారు. ఈనెల 24 నుంచి ఈ కేసు ట్రయల్ ప్రారంభమవనుంది. తదుపరి విచారణలో నాగార్జునను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

రాజ్ తరుణ్‌పై లావణ్య మరో ఫిర్యాదు



నటుడు రాజ్‌తరుణ్‌పై ఆయన మాజీ ప్రియురాలు లావణ్య మరో ఫిర్యాదు చేశారు. రాజ్ తరుణ్ తన అనుచరులను పంపి తనపై దాడిచేయించాడని, తన పెంపుడు కుక్కలను చంపాడని, కోర్టులో కేసు పెండింగ్ ఉండగా, ఖాళీ సీసాలు, గాజు పెంకులతో దాడి చేశారని ఆమె నార్సింగ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

కళ్లు చెదిరే ధరకు ఓజీ టికెట్



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'ఓజీ'పై ప్రేక్షకుల్లో ఏ రేంజ్‌లో అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఈ నెల 25న విడుదలవుతున్న ఈ సినిమా టికెట్ కళ్లు చెదిరే మొత్తానికి అమ్ముడవ్వడం ఇప్పుడు టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారింది. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా తొలి టికెట్‌కు ఆయన అభిమానులు ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించారు. ఈ టికెట్‌ను రూ.5 లక్షలకు నార్త్ అమెరికా పవన్‌కల్యాణ్ టీమ్ దక్కించుకుంది. ఈ మొత్తాన్ని జనసేన పార్టీకి విరాళంగా ఇవ్వనుంది.

అభిమానులకు డబుల్ బొనాంజా...

'ఓజీ'లో ఓజాస్ గంభీర అనే శక్తిమంతమైన పాత్రను పవన్‌కల్యాణ్ పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ప్రియాంక అరుళ్‌మోహన్ కథానాయిక. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఓ ప్రత్యేక పోస్టర్‌తో పాటు 'లవ్ ఓమీ' అనే గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇవి చూసిన అభిమానులు వింటేజ్ పవన్‌ను చూశామని ఖుషీ అవుతున్నారు.

శీలావతిగా గుర్తుండిపోతాను



అనుష్క

"'ఘాటి'లో చేసిన పాత్రను నేను ఇప్పటివరకూ చేయలేదు. నా కంఫర్ట్ జోన్ దాటి చేసిన సినిమా ఇది. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి తర్వాత మళ్లీ ఈ సినిమాలో అంతటి బలమైన పాత్రను చేశాను. శీలావతి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. క్రిష్‌గారు నా పాత్రను బలంగా తీర్చిదిద్దారు' అని హీరోయిన్ అనుష్క అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా 'ఘాటి' విశేషాలను అనుష్క మీడియాతో పంచుకున్నారు.

● 'వేదం' తర్వాత క్రిష్‌తో సినిమా చేయాలనే కోరిక ఈచిత్రంతో తీరింది. నాపైన నమ్మకం ఉంచి ఈ చిత్రాన్ని గ్రాండియర్‌గా నిర్మించిన నిర్మాతలు రాజీవ్‌రెడ్డి, యువీ క్రియేషన్స్ వారికి ధన్యవాదాలు. నేను రెండేళ్లుగా కుటుంబంతోనే ఎక్కువ గడుపుతున్నాను. ఖాళీ దొరికితే విహార యాత్రలకు వెళ్తుంటాను. పుస్తకాలు బాగా చదువుతాను. ప్రస్తుతం భైరప్ప గారి రచన 'పర్వ' చదువుతున్నాను.

● సినిమాల పరంగానే అయినా అనుష్క టాపిక్ వచ్చిన ప్రతిసారీ ప్రభాస్ పేరు కూడా వినిపిస్తుందని అనడం వెనుక కొంతమందికి ఉన్న ఉద్దేశాన్ని నేను అర్థం చేసుకోగలను. మేమిద్దరం నటించిన సినిమాల్లోని కథ, పాత్రలను దర్శకులు మలచిన తీరే అందుకు ప్రధాన కారణం. రాజమౌళి గారితో ఛత్రపతి చేసినప్పటి నుంచి ప్రభాస్ నాకు తెలుసు. అప్పటి నుంచి మేమిద్దరం స్నేహితులం. అందువల్ల నటించేటప్పుడు కొంచెం సౌకర్యంగా ఉంటుంది. అయితే మంచి పాత్ర చిత్రణ లేకుండా ఏం చేసినా తెరపైన కెమిస్ట్రీ పండదు.

దీపావళికి నవ్వుల టపాసులు



ప్రియదర్శి, విష్ణు ఓయ్, రాగ్‌మయూర్, నిహారిక ఎన్ ఎమ్ ప్రధాన పాత్రల్లో విజయేందర్ ఎస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాను అక్టోబరు 16న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, ఓ పోస్టర్‌ను, వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ దీపావళికి థియేటర్లలో నవ్వుల టపాసులకు సిద్ధం కండి అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: పీకే, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ ఎస్‌జే, సంగీతం: ఆర్ ఆర్ ధృవన్.

ప్రజాభీష్టమే సర్వోన్నతం

గవర్నర్లు, రాష్ట్రపతి ఇష్టాయిష్టాలకు అది లోబడి ఉండరాదు

- **చట్టాల రాజ్యాంగబద్ధతను తేల్చాల్సింది న్యాయస్థానాలే**
- **చట్టాల విషయంలో పార్లమెంటుకు ఎలాంటి సార్వభౌమాధికారం ఉందో రాష్ట్రాలకూ అలాగే ఉంది**
- **సుప్రీంలో కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్ వాదనలు**



న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: రాష్ట్ర ప్రభుత్వాలు పంపే బిల్లులకు గవర్నర్ల ఆమోదం కేసులో కేంద్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి సమర్పించిన వాదనలు చూస్తుంటే.. రాజ్యాంగ మూలసూత్రాలనే కేంద్రం పరోక్షంగా రద్దు చేయాలనుకుంటున్నట్టుగా కనిపిస్తోందని కర్ణాటక, పశ్చిమబెంగాల్, హిమాచల్‌ప్రదేశ్ ఆందోళన వ్యక్తం చేశాయి. రాష్ట్రాలను మునిసిపాలిటీల మాదిరిగా చూడకూడదని వాదించాయి. "బిల్లుల రూపంలోని ప్రజాభీష్టం ఎప్పుడూ కార్యనిర్వాహక వ్యవస్థ (గవర్నర్లు, రాష్ట్రపతి) ఇష్టాయిష్టాలకు లోబడి ఉండరాదు. శాసనప్రక్రియలో కార్యనిర్వాహక జోక్యాన్ని రాజ్యాంగం నిషేధించింది. ప్రజాస్వామ్యానికి అధిపతి అయిన ప్రజల అభీష్టమే సర్వోన్నతం" అని తేల్చిచెప్పాయి. బుధవారం ఈ కేసు విచారణలో భాగంగా కాంగ్రెస్ పాలిత కర్ణాటక సర్కారు తరపున వాదనలు వినిపించిన సీనియర్ అడ్వొకేట్ గోపాల్ సుబ్రమణియం.. మంత్రివర్గ ఆధారిత ప్రజాస్వామ్య ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో ప్రధాన భాగమని గుర్తుచేశారు. గవర్నర్లకు ఎలాంటి శాసనాధికారమూ ఉండదని ఆయన స్పష్టం చేశారు. హిమాచల్‌ప్రదేశ్ తరపున వాదనలు వినిపించిన అడ్వొకేట్ ఆనంద్ శర్మ.. చట్టాలు చేయడంలో గవర్నర్లకు, రాష్ట్రపతికి పాత్ర ఉండదని స్పష్టం చేశారు. గవర్నర్లేమీ వైస్రాయ్‌లు, గవర్నర్‌జనరళ్లు కారని.. వారు మంత్రి మండలి సలహాసూచనలకు కట్టుబడి ఉండాలని తెలిపారు. ప్రజల అభీష్టాన్ని వమ్ము చేయడానికి గవర్నర్ కార్యాలయాలను ఉపయోగించుకోరాదంటూ కేంద్రంపై విమర్శలు చేశారు.

రాజ్యాంగం సజీవ పత్రం..

పశ్చిమ బెంగాల్ తరఫున వాదనలు వినిపించిన మరో సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్.. "రాజ్యాంగం ఒక సజీవ పత్రం. దాని ఆరంభం గతంలో ఉన్నా దాని విధేయత భవిష్యత్తుకే. ఆ భవిష్యత్తు మీరే (న్యాయమూర్తులు). ఎందుకంటే.. రాజ్యాంగాన్ని విశ్లేషించి చెప్పేది మీరే. రాజ్యాంగం అమలులో గవర్నర్లను అడ్డంకిగా మార్చేందుకు పన్నిన ఉచ్చుకు మనం చిక్కుకోకూడదు" అని పేర్కొన్నారు. ఒకవేళ శాసనసభలు ఆమోదించే బిల్లులు శాసనాధికార పరిధికి అనుగుణంగా లేకపోయినా గవర్నర్లు వాటికి ఆమోదం తెలపాలా? ఆ బిల్లుల చట్టబద్ధతను కోర్టుల్లో సవాల్ చేయవచ్చా అని ధర్మాసనం ప్రశ్నించగా.. ప్రజాసంకల్పానికి కార్యనిర్వాహక వ్యవస్థ ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డంకిగా ఉండరాదని.. చట్టాల రాజ్యాంగబద్ధతను తేల్చాల్సింది కోర్టులే తప్ప కార్యనిర్వాహక వ్యవస్థ కాదని సిబల్ స్పష్టం చేశారు. దీనికి సుప్రీం ధర్మాసనం.. "ఒకవేళ రాష్ట్రం చేసే బిల్లు కేంద్ర చట్టానికి వ్యతిరేకంగా ఉంటే గవర్నర్ దానికి ఆమోదం తెలపకుండా నిలిపి ఉంచగలరా?" అని ప్రశ్నించగా.. అలాంటి సందర్భాలు అత్యంత అరుదుగా మాత్రమే ఉంటాయని సిబల్ బదులిచ్చారు. ప్రజాభీష్టం ఎప్పుడూ గవర్నర్ల ఇష్టాయిష్టాలకు లోబడి ఉండకూడదని తేల్చిచెప్పారు. బిల్లుల ఆమోదంపై రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధించడం రాజ్యాంగ సవరణతో సమానమన్న వాదనను తిరస్కరించారు.

అలా కుదరదు..

బిల్లుకు ఆమోదం తెలపాలా? వద్దా? అనే విషయమై గవర్నర్‌కు వ్యక్తిగత నిర్ణయాధికారం ఇస్తే అప్పుడు గవర్నర్ ఎవరికీ జవాబుదారీగా ఉండరని సిబల్ ఆందోళన వెలిబుచ్చారు. గవర్నర్ అలా సొంత నిర్ణయాలు తీసుకుని.. 'నేను ఈ బిల్లును ఆమోదించను (లేదా) పెండింగ్‌లో పెడుతున్నాను' అంటే.. అప్పుడు రాజ్యాంగంలోని 361 కింద లభించే రక్షణ (ఈ ఆర్టికల్ ప్రకారం.. రాష్ట్రపతి/గవర్నర్ తమ విధినిర్వహణలో భాగంగా చేసిన పనులకు వారిపై వ్యక్తిగత బాధ్యత ఉండదు. వాటిని న్యాయస్థానాల్లో ఎవరూ ప్రశ్నించలేరు) గవర్నర్లకు వర్తిస్తుందా? అని ప్రశ్నించారు. ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్ ఎవరికీ జవాబుదారీ కాదంటూనే.. ఆర్టికల్ 200 కింద బిల్లులను ఆపే శక్తి ఇస్తామంటే కుదరదని వాదించారు. చట్టాలు చేసే విషయంలో పార్లమెంటు సార్వభౌమాధికారం ఎంత ముఖ్యమైనదో.. రాష్ట్రాల సార్వభౌమాధికారం కూడా అంతే ముఖ్యమైనదని పేర్కొన్నారు. కాగా.. ఈ కేసు తదుపరి విచారణ 9వ తేదీన కొనసాగనుంది.

సీఏఏ కటాఫ్ తేదీ పొడిగింపు

- **2024 డిసెంబరు 31లోపు వచ్చినవారు దేశంలో ఉండొచ్చు**
- **కేంద్ర హోం శాఖ ఉత్తర్వుల జారీ**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 3: పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లలో మతపరమైన హింసకు గురై లేదా, అలాంటి భయంతో 2024 డిసెంబరు 31లోపు భారతదేశంలోకి ప్రవేశించిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వారంతా పాస్‌పోర్టు, వీసా, మరే ఇతర పత్రాలు లేకపోయినా దేశంలో ఉండొచ్చని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా అమల్లోకి వచ్చిన వలసలు మరియు విదేశీయుల చట్టం-2025 కింద ఈ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రత్యేకించి 2014 తర్వాత పెద్ద సంఖ్యలో పాకిస్థాన్ నుంచి దేశంలోకి వచ్చిన హిందువులకు ఇది భారీగా ఉపశమనం కలిగించనుంది. వారంతా ఇప్పటివరకు తమ భవితవ్యం గురించి ఆందోళనలో ఉన్నారు. కాగా, గతేడాది అమల్లోకి వచ్చిన పౌరసత్వ(సవరణ) చట్టం(సీఏఏ) మేరకు ఆయా దేశాల్లో హింసకు గురైన మతపరమైన మైనారిటీలు 2014 డిసెంబరు 31లోపు భారతదేశంలోకి ప్రవేశిస్తే వారికి భారత పౌరసత్వాన్ని మంజూరు చేస్తారు. ఇదిలా ఉండగా, నేపాల్, భూటాన్ పౌరులు పాస్‌పోర్టు, వీసా లేకుండానే భారతదేశంలోకి ప్రవేశించేందుకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. వారు రోడ్డు లేదా వాయు మార్గాలలో తమ దేశాల సరిహద్దులు దాటి భారతదేశంలోకి ప్రవేశించేందుకు పాస్‌పోర్టు, వీసా అవసరం లేదని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, వారు భారతదేశంలోకి ప్రవేశించాలంటే ఏ ఏ పత్రాలు అవసరమో తెలియజేస్తూ ఒక జాబితాను విడుదల చేసింది. అయితే, వీరంతా నేపాల్/భూటాన్ నుంచి కాకుండా మరో దేశం నుంచి భారతదేశంలోకి ప్రవేశించాలంటే పాస్‌పోర్టు ఉండాల్సిందే.

ఏపీ విద్యాసంస్కరణలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

- 'పాల్'తో విద్యార్థుల అభ్యసన స్థాయి పెరిగింది
- మంత్రి లోకేశ్‌తో భేటీలో ప్రొఫెసర్ మైఖేల్ క్రెమర్ వెల్లడి



మైఖేల్ క్రెమర్‌ను సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యావ్యవస్థలో చేపట్టిన సంస్కరణలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని నోబెల్ బహుమతి గ్రహీత, ఆర్థికవేత్త, యూనివర్సిటీ ఆఫ్ చికాగో ప్రొఫెసర్ మైఖేల్ క్రెమర్ కొనియాడారు. బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమావేశమయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగో బృందం నిర్వహించిన అధ్యయనం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఎడ్‌టెక్ సామర్థ్యం పెరిగిందన్నారు. పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) కార్యక్రమాన్ని ఉపయోగించిన విద్యార్థులు 17 నెలల్లోనే మిగతా పాఠశాలల విద్యార్థుల కంటే 2.25 రెట్లు అభ్యసన పురోగతిని సాధించారని వివరించారు. 'పాల్' వినియోగంలో ఏపీ ప్రథమ స్థానంతో దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. 2018లో 60 పాఠశాలల్లో ప్రారంభమైన 'పాల్' కార్యక్రమం ప్రస్తుతం 26 జిల్లాల్లోని 1,224 పాఠశాలలకు విస్తరించి, 3.25 లక్షల మందికి పైగా విద్యార్థులకు చేరువైందని తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు 78 మంది

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 78 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికైన టీచర్ల జాబితాలను బుధవారం విడుదల చేసింది. రాష్ట్ర అవార్డులకు ఎంపికైన టీచర్లను శుక్రవారం విజయవాడలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొనేందుకు రిలీవ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదేశాలు జారీచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తమ టీచర్లకు అవార్డులు అందజేస్తారు. ఉత్తమ టీచర్లకు మెడల్, ప్రశంసా పత్రం, రూ.20వేల నగదు అందజేస్తారు.

ఆర్జీయూకేటీల్లో ల్యాబ్ సిబ్బందికి ఎంటీఎస్ కొనసాగింపు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ నూజివీడు, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ల్యాబ్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లకు మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) కొనసాగిస్తూ ఉన్నత విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రెండు క్యాంపస్‌లలో పనిచేస్తున్న 42 మందికి ఈ ప్రయోజనం వర్తించనుంది.

కలెక్టర్లకు ట్రెడ్స్ సదస్సుల బాధ్యత

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక సంస్థల బిల్లుల పరిష్కారం కోసం భాగస్వామ్య పక్షాల సమన్వయంతో అన్ని జిల్లాల్లో ట్రెడ్స్ (ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్) అవగాహన వర్క్‌షాపులను నిర్వహించే బాధ్యతను ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. ఈ నెల వరకు నిర్వహించాల్సిన వర్క్‌షాపులకు మంజూరు చేసిన నిధులలో 80 శాతం ముందుగానే కలెక్టర్లకు విడుదల చేయడానికి అనుమతించింది. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్ఎంఈడీసీ) సీఈవో చేసిన ఈ ప్రతిపాదనలను ఆమోదిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, రాష్ట్ర స్థాయి స్వయం ప్రతిపత్తి సంస్థలు, సంఘాలకు వస్తు, సేవలందించే సరఫరాదారులైన ఎంఎస్ఎంఈలకు బిల్లుల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వ 'ర్యాంప్' (రైజింగ్ అండ్ యాక్సెలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్) పథకంలో భాగంగా ఈ ట్రెడ్స్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశారు.

లోకాయుక్తను నియమించకపోవడాన్ని సవాల్ చేస్తూ పిల్

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత ఏడాది సెప్టెంబరు 14 నుంచి ఖాళీగా ఉన్న లోకాయుక్త పోస్టును భర్తీ చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. లోకాయుక్త నియామక ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఇది బుధవారం విచారణకు రాగా పార్టీ ఇన్‌పర్సన్ తాండవ యోగేష్ వాదనలు వినిపించారు. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ... లోకాయుక్త నియామకం విషయంలో రాష్ట్రప్రభుత్వం చట్టసవరణ చేసిందని, పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచుతామని తెలిపారు.

గిరిజన కళాకారుల మెరుగైన జీవనోపాధికి కృషి: సదాభార్గవి

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంస్కృతిలోని సుందరమైన కళలకు మంచి గుర్తింపును తీసుకురావడానికి, కళాకారులకు మెరుగైన జీవనోపాధి కల్పించడానికి తగిన ప్రణాళికలు రూపొందించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ సదాభార్గవి తెలిపారు. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ కార్యాలయంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఐటీడీఏ పరిధిలోని గిరిజన కళాకారులు, చేతివృత్తి కళాకారులు, సాంస్కృతిక కళాకారులు పాల్గొన్నారు.

పీఎంజీఎస్‌వై రహదారుల నిర్వహణకు 43 కోట్లు

అమరావతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద 1,177 రోడ్ల పనులకు, 142 వంతెనలకు సాధారణ నిర్వహణ కోసం రూ.43.32 కోట్లను మంజూరుచేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2024-25 సంవత్సరానికిగాను, 3417 కి.మీ మేర 596 రోడ్ల నిర్వహణకు రూ.19.14 కోట్లు, 113 వంతెనలకు సంబంధించి 6557 మీటర్ల నిర్వహణకు రూ.1.55 కోట్లు వెరసి మొత్తం 709 పనులకు రూ.20.70 కోట్లు మంజూరుచేశారు. 2025-26 సంవత్సరానికి.. 581 రోడ్లకు రూ.21.76 కోట్లు, 29 వంతెనల నిర్వహణకు రూ.85లక్షలు.. వెరసి రూ.22.62 కోట్లు మంజూరుచేస్తూ ఆదేశాలిచ్చారు.

ప్రీతి కేసు సీబీఐకి.. సీఎంకు ధన్యవాదాలు: బాలకోటయ్య

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సుగాలి ప్రీతి కేసును సీబీఐకి ఇవ్వాలని నిర్ణయించిన సీఎం చంద్రబాబుకు ఏపీ సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడబట్టే అందరికీ తెలిసిందన్నారు.

2026 జూన్‌లోగా పోలవరం పనులు పూర్తి

- రూ.739 కోట్లతో పునరావాస కాలనీల నిర్మాణం: నిమ్మల

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కనెక్టివిటీస్‌కు గ్యాంట్రీస్ సంఖ్యను పెంచి 2026 జూన్ కల్లా పనులు పూర్తి చేసేలా ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. బుధవారం పోలవరం ప్రాజెక్టు, దాని ఎడమ ప్రధాన కాలవ, పునరావాస పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. 'వానాకాలం, భారీ వరదల్లో సైతం డీవాటరింగ్ చేస్తూ, పోలవరం పనులు జరుగుతుండటంపై విదేశీ నిపుణులు సంతృప్తి వ్యక్తం చేశారు. బట్రెస్ డ్యాంతో ఎగువ కాఫర్‌డ్యాం సీపేజ్‌ను కంట్రోల్ చేసి, పనులు చేయగలుగుతున్నాం. గ్యాప్-1 రాక్ ఫిల్ పనులపై సంతృప్తి వ్యక్తంచేస్తూ, మోడల్ డ్యామ్‌ను పూర్తి చేయాలని నిపుణులు సూచించారు. షెడ్యూల్ ప్రకారమే డయాఫ్రం వాల్ నిర్మాణం జరుగుతూ, 42 శాతం పూర్తైంది. పోలవరం నిర్మాణంతోపాటు భూసేకరణ, పునరావాసం పనులకు సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. పునరావాస కాలనీల ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం రూ.739కోట్ల పనులకు టెండర్లు పిలిచాం. ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తరలించేలా పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయి. టీఎంసీకి, క్యూసెక్కులకు తేడా తెలియని జగన్, వైసీపీ నాయకులు పోలవరంపై దుష్ప్రచారం చేస్తే నమ్మే స్థితిలో ప్రజలు లేరు' అన్నారు. సమీక్షలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ రాంసుందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



శరవేగంగా నిర్మాణం పూర్తి చేసుకుంటున్న రాష్ట్ర రాజధాని అమరావతిలోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం, లోపలి భాగాలు

గ్రాఫిక్స్ అనేవారు ఇక్కడకు రండి

అమరావతిపై దుష్ప్రచారం తగదు.. వారిని ప్రజలు క్షమించరు

- మార్చినెలాఖరు కల్లా అధికారులు, ఉద్యోగుల భవనాలు పూర్తి
- మూడేళ్లలో రాజధాని సిద్ధం: నారాయణ

గుంటూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే మార్చి నెలాఖరు నాటికి అమరావతిలోని అధికారులు, ఉద్యోగుల భవనాలను సిద్ధం చేస్తామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. "అసలు అమరావతిలో పనులేమీ జరగడం లేదని, గ్రాఫిక్స్ మాత్రం చూపిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని ప్రజలు క్షమించరు. వారు క్షేత్రస్థాయికి వచ్చి పరిస్థితిని చూడాలి." అని ఆయన సవాలు విసిరారు. రాజధానిలోని నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్-1, టైప్ -2 భవనాలతో పాటు గ్రూప్-డి ఉద్యోగుల భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయి...ఎప్పటికల్లా పూర్తవుతాయి... భవనాలతోపాటు ఇతర మౌళిక వసతుల కల్పన ఎప్పటికి పూర్తవుతుందనే వివరాలను సీఆర్డీయే ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. అమరావతి



అమరావతిలో పనుల ప్రగతిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారాయణ

అత్యంత సురక్షితమైన రాజధాని అని ఆయన మరోసారి స్పష్టం చేశారు. అయితే, కొంతమంది పనిగట్టుకుని మరీ అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. "అమరావతిలో ప్రస్తుతం 13 వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనులు చేస్తున్నారు. సుమారు 2500 వరకూ ప్రొక్లెయిన్‌లు, జేసీబీలు, ఇతర యంత్రాలు పని చేస్తున్నాయి. గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్-1 భవనాల్లో 4 టవర్లలోని 384 ఫ్లాట్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. టైప్ -2 భవనాల్లో మరో 4 టవర్లలో 336 ఫ్లాట్లు, గ్రూప్-డి ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్లలో 720 ఫ్లాట్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది. మొత్తం 1,440 ఇళ్ల నిర్మాణాలు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. సీవరేజ్ ప్లాంట్ నిర్మాణం కూడా వేగంగా జరుగుతోంది. అన్ని భవనాలు మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నాం. వీటిలో 50 శాతం ఇళ్లు అక్టోబరు రెండు నాటికి పూర్తవుతాయి." అని నారాయణ వివరించారు.

అమరావతి సేఫ్..

అమరావతిలో 360 కిలోమీటర్ల మేర ట్రంక్ రోడ్లు, 1,500 కిలోమీటర్ల మేర లే అవుట్ రోడ్లు, 4వేల నివాస భవనాలు, ఐకానిక్ భవనాల పనులు ఎంతో వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. అమరావతి చాలా సేఫ్ సిటీ అని మంత్రి తేల్చిచెప్పారు. అమరావతిలో వరద నివారణ కోసం నెదర్లాండ్స్ నిపుణులతో డిజైన్ చేయించామని చెప్పారు. అమరావతికి ఎలాంటి ముంపు లేకుండా కాలువలు, రిజర్వాయర్లు నిర్మాణం చేస్తున్నామని, మూడేళ్లలో అమరావతిని పూర్తి చేస్తామని మంత్రి నారాయణ పునరుద్ఘాటించారు.

అమరావతిలో అమరజీవి కాంస్య విగ్రహం

- 6.8 ఎకరాల్లో 58 అడుగుల ఎత్తున ఏర్పాటు
- నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- రూ.కోటి విరాళం ప్రకటించిన మంత్రి టీజీ భరత్

తుళ్లూరు సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసి కోట్లాది మంది తెలుగువారికి దారిచూపిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని మంత్రి లోకేశ్ అన్నారు. ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అమరావతిలోని తుళ్లూరు, పెదపరిమి మధ్య 6.8 ఎకరాల విస్తీర్ణంలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహంతో పాటు ఆడిటోరియం, స్మృతివనం నిర్మాణాలకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా



అమరావతిలో ఏర్పాటు చేయనున్న పొట్టి శ్రీరాములు స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

ఏర్పాటు చేసిన సభలో లోకేశ్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుతో పాటు మొత్తం ప్రాజెక్టు పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేశ్‌కు సూచించారు. వచ్చే మార్చి 16 నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని డూండి రాకేశ్ తెలిపారు. టీజీవీ గ్రూప్ తరఫున విగ్రహం ఏర్పాటుకు మొదటి విరాళం రూ.కోటి అందిస్తున్నామని మంత్రి టీజీ భరత్ ప్రకటించారు. పొట్టి శ్రీరాములు వారసులు నలుగురిని శాలువాలతో లోకేశ్ సత్కరించారు మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, రాజధాని రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఫొటోతో సదరం సర్టిఫికెట్!

- ఇద్దరు సచివాలయ ఉద్యోగుల సస్పెన్షన్
- మరో ఇద్దరికి షోకాజు నోటీసులు జారీ



జగన్ ఫొటోతో జారీ చేసిన సదరం సర్టిఫికెట్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 3(ఆంధ్ర జ్యోతి): గుంటూరులో సచివాలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు దాటినా ఇంకా జగనే ముఖ్యమంత్రిగా భావిస్తున్నారు. జగన్ ఫొటోతో ఉన్న సదరం సర్టిఫికెట్లను ఇటీవల జారీ చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేశారు. వివరాలు.. గుంటూరు బ్రాడీపేటకు చెందిన ఓ దివ్యాంగ బాలిక సదరం సరిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకుంది. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఆ బాలికను పరీక్షించిన వైద్య బృందం 100 శాతం వైకల్యం ఉన్నట్లు నిర్ధారించింది. సమీపంలోని సచివాలయం ద్వారా సదరం సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించింది. బ్రాడీపేటకు చెందిన 127వ సచివాలయ ఉద్యోగులు ఆరు నెలల తర్వాత తీరిగ్గా ఆమెకు సదరం ధ్రువపత్రాన్ని ఇచ్చారు. దానిపై జగన్ ఫొటో ఉండటంతో దాన్నిమార్చి మరొకటి ఇవ్వాలని ఆమె బంధువులు కోరారు. వారితో సచివాలయ ఉద్యోగులు దురుసుగా మాట్లాడటంతో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన జగన్ ఫొటోతో ముద్రించి ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దుచేసి, కొత్త ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. దీనికి బాధ్యులైన 127వ సచివాలయ ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి రామబిల్వకాదేవి, వెల్ఫేర్ కార్యదర్శి రవికుమార్‌ను సస్పెండ్ చేశారు. నోడల్ అధికారి సాంబశివరావు, అడ్మిన్ కార్యదర్శి నాగమణికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

వెబ్‌సైట్‌లో ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఏడో తేదీన నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్ www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో గురువారం నుంచి అందుబాటులో ఉంటుందని ప్రభుత్వ పరీక్షల సంచాలకుడు డాక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. 'దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ 30.9.2025. రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000లోపు ఉన్న విద్యార్థులందరూ ఈ పరీక్ష రాయడానికి అర్హులు' అని శ్రీనివాసులురెడ్డి వివరించారు.

ఫేక్‌ల పని పడతాం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ప్రస్తుతం 94,892 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నదని, కేంద్రం మరో 53వేల టన్నులు కేటాయించిందని తెలిపారు. "ఫేక్ పార్టీ, నేరాలను నమ్ముకున్న పార్టీ విషపు విత్తనాలను చల్లుతోంది. కానీ, ఇది సీబీఎన్ ప్రభుత్వం. డ్రామాలు ఆడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఎరువులు, యూరియాపై దుష్ప్రచారం చేసేవారిని జైలుకు పంపుతాం." అని హెచ్చరించారు. యూరియా విషయంలో కృష్ణా జిల్లాలో వైసీపీకి చెందిన యర్రా వాసు, రామ్మూర్తి, చీలి వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు కుట్రపూరితంగా వ్యవహరించారని, ఎరువుల లారీని హైజాక్ చేసే ప్రయత్నం చేశారని తెలిపారు. "రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్ ఎరువుల విషయంలో దుష్ప్రచారం చేస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఎంతెంత స్టాక్ ఉందో.. ఏయే దుకాణాల్లో ఎంత నిల్వలు ఉన్నాయనే వివరాలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. తప్పుడు ప్రచారం చేసి, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకోం. ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయడానికి ప్రయత్నిస్తే సహించబోం. కఠినంగా వ్యవహరిస్తాం. రైతుల ముసుగులో రాజకీయం చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరిస్తున్నాం. నేరాలు, ఘోరాలు చేసి వైసీపీ నేతలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కుప్పంలో నీరిస్తే నీళ్లు లేవని ప్రచారం చేశారు. పులివెందులకు మేం నీరిస్తే వైసీపీ వాళ్లు వెళ్లి తామే ఇచ్చినట్లుగా హారతులు ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్‌కు రూ.12వేల కోట్ల కేంద్రం నిధులు ఇస్తే పేటీఎం బ్యాచ్ ద్వారా ప్రైవేటుపరం చేస్తున్నామని దుష్ప్రచారం చేశారు. ఉద్యోగుల వయోపరిమితి మీద ఏకంగా ఫేక్ జీవో తెచ్చి ఫేక్ ప్రచారం చేశారు. తప్పుడు పోస్టులు, తప్పుడు ప్రచారాలు చేసి రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తే తాట తీస్తాం." అని తీవ్ర స్వరం వినిపించారు.

జిల్లాల వారీగా యూరియా..

జిల్లా	యూరియా టన్నుల్లో..
శ్రీకాకుళం	4,079
విజయనగరం	1,692
అనకాపల్లి	2,059
కాకినాడ	1,910
కోనసీమ	1,167
తూర్పుగోదావరి	2,994
పశ్చిమగోదావరి	6,063
ఏలూరు	3,353
కృష్ణా	2,870
ఎన్టీఆర్	3,474
గుంటూరు	5,157
బాపట	6,789
పల్నాడు	9,322
ప్రకాశం	5,931
నెల్లూరు	3,572
కర్నూలు	8,980
నంద్యాల	2,228
అనంతపురం	2,751
శ్రీసత్యసాయి	3,345
కడప	6,433
అన్నమయ్య	3,982
చిత్తూరు	2,994
తిరుపతి	2,048
పార్వతీపురం మన్యం	594
అల్లూరి సీతారామరాజు జిల్లా	771
విశాఖ	334

భ్రమల్లో ఉంటారు... భ్రమలు కల్పిస్తారు

అవాస్తవాలను కూడా వాస్తవాలని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని వైసీపీ నేతలపై చంద్రబాబు విరుచుకుపడ్డారు. "హెరిటేజ్ ఔట్‌లెట్లు అనేవే లేవు. అయినా వాటి ద్వారా ఉల్లిపాయలు అమ్ముతున్నామని మాజీ సీఎం స్థాయి వ్యక్తి విష ప్రచారం చేస్తున్నారు. విచిత్రమైన వింత జీవుల్లా ప్రవర్తిస్తున్నారు. ఊహాగానాల్లో బతికేస్తున్నారు. ఏం చెప్పినా ప్రజలు నమ్మేస్తారని వైసీపీ అనుకుంటోంది. వాళ్లను చూస్తుంటే జాలి వేస్తోంది. విలువల్లేని వ్యక్తులు రాజకీయాల్లో ఉన్నప్పుడు ఇలాంటి సమస్యలే వస్తాయి. వాళ్లు దుష్ప్రచారం చేస్తుంటే మేం సరి చేస్తూ కూర్చోవాలా?" అని ఆయన ప్రశ్నించారు.

త్వరలో రైతులతో భేటీ

వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారంతో రైతులను రోడ్డునపడేస్తున్నారని సీఎం అన్నారు. వీరి రాజకీయ ఉచ్చులో పడొద్దని కోరారు. రైతులకు మంచి చేస్తుంటే వైసీపీ ఓర్వలేకపోతోందని ఆరోపించారు. "రైతులకు ఎక్కడ అవసరం ఉంటే అక్కడికి ఎరువుల్ని తరలించాలని అధికారులను ఆదేశించాను. ఖరీఫ్ ప్రారంభ నిల్వతో కలిపి 6.65 లక్షల టన్నుల యూరియా సరఫరా చేశాం. గత పది రోజుల్లోనే 28 వేల టన్నులు అందించాం. రానున్న పదిరోజుల్లో మరో 30 వేల టన్నులు అందిస్తాం." అని వివరించారు. అవసరం లేకపోయినా పురుగు మందులను అధికంగా వినియోగించడాన్ని రైతులు మానాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఆర్గానిక్ సాగుపై దృష్టిపెట్టాలని కోరారు. డ్రోన్ టెక్నాలజీతో ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించే రైతులకు సబ్సిడీలు ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని చంద్రబాబు తెలిపారు.

ప్రతిపక్ష హోదా మేం కాదు.. ప్రజలిస్తారు

- జగన్ తీరుపై చంద్రబాబు ఫైర్

అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలను చర్చించమంటే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అంటున్నారంటూ జగన్‌పై చంద్రబాబు తీవ్రస్వరం వినిపించారు. "వీరికి అసలు బుద్ధుందా? ప్రజలు ఇచ్చిన సీట్లతోనే ప్రతిపక్ష హోదా వస్తుంది. అది ప్రజలు పార్టీకి ఇచ్చే హక్కు. ప్రతిపక్ష హోదాకు మీరు తగరనే 11 సీట్లు ఇచ్చారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటే 18 సీట్లు కావాలి. వైసీపీకి రాజ్యాంగంపై నమ్మకం లేదు. ఎన్నికల వ్యవస్థపై నమ్మకం లేదు. అందుకే ప్రతిపక్ష హోదా కావాలంటూ బ్లాక్‌మెయిల్ చేస్తోంది. ఓట్లేయలేదని ప్రజలపై కక్షతో వ్యవహరిస్తున్నారు. కోడికత్తి, గొడ్డలివేటు, గుండెపోటు, గులకరాయి డ్రామాలతోపాటు ఎరువులిస్తున్నా ఇవ్వడం లేదని ఫేక్ డ్రామాలు ఆడుతున్నారు." అని చంద్రబాబు ఆగ్రహించారు.



లంకపల్లి సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం రైతుల బారులు

గత కొద్ది రోజులుగా యూరియా కోసం ఇబ్బంది పడుతున్న రైతులకు కృష్ణా జిల్లా ఘంటసాల మండలం లంకపల్లి సొసైటీకి యూరియా వచ్చిందని తెలిసింది. దీంతో సొసైటీ పరిధిలోని లంకపల్లి, దాలిపర్రు, యండకుదురు, మల్లాయిచిట్టూరు, పూషడం గ్రామాల రైతులు బుధవారం ఉదయాన్నే సొసైటీకి చేరుకున్నారు. వందలాది మంది రావడంతో ఆ ప్రాంతమంతా రైతులతో కిక్కిరిసిపోయింది. పీఏసీఎస్ సిబ్బంది గేట్లు మూసేశారు. రైతులు ఎగబడటంతో పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. సొసైటీకి 425 బస్తాలే రావటంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. గ్రామంలోని గ్రోమోర్ సెంటర్ వద్ద కూడా రైతులు బారులు తీరారు. ఈ సెంటర్‌కు 555 బస్తాలు రాగా.. ఒక్కో రైతుకు ఒక బస్తా పంపిణీ చేశారు.

- ఘంటసాల, ఆంధ్రజ్యోతి

నెలాఖరులోగా పొగాకు కొనుగోళ్లు పూర్తి

- అక్టోబరు 1 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభం: అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం అమరావతి సచివాలయంలో మార్క్‌ఫెడ్, పొగాకు కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 80మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి జరగ్గా.. 22 కంపెనీలు 40మిలియన్ కిలోలు కొనగా, మార్క్‌ఫెడ్ 15 మిలియన్ కిలోలు కొనుగోలు చేసిందన్నారు. మిగిలినదానిలో 20మిలియన్ కిలోలను ప్రైవేట్ కంపెనీలు, మరో 5 మిలియన్ కిలోలను మార్క్‌ఫెడ్ ఈ నెలాఖరుకు కొనుగోలు చేయాలన్నారు. 2025-26 రబీ సీజన్‌లో నల్ల బర్లీ పొగాకును ఎవరూ పండించొద్దన్నారు. కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్న రైతులు మాత్రమే తెల్ల బర్లీ పొగాకు వేయాలని మంత్రి సూచించారు.

తాడేపల్లిగూడెం మార్కెట్‌కు కర్నూలు ఉల్లి

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మార్కెట్‌కు బుధవారం రెండు లారీల్లో కర్నూలు ఉల్లి వచ్చింది. వీటిలో నాణ్యత తక్కువగా ఉన్న ఉల్లిని క్వింటా రూ.800కు, నాణ్యమైన ఉల్లిని రూ.1300కు కొనుగోలు చేశారు. వీటిలో మూడు టన్నులను మార్క్‌ఫెడ్ ద్వారా కిలో రూ.8.50 చొప్పున కొనుగోలు చేశారు. కర్నూలు ఉల్లి నాణ్యత లేకపోవడంతో కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. దీంతో రీజనల్, జిల్లాస్థాయి అధికారులు వ్యాపారులతో చర్చలు జరిపారు. ఉల్లిని కొనుగోలు చేసి, కర్నూలు రైతులను ఆదుకోవాలని వ్యాపారులకు చెప్పారు.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉత్తర ఒడిశాకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారింది. వచ్చే 24 గంటల్లో ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి ఉత్తర ఒడిశా, ఝార్ఖండ్ మీదుగా వెళుతుందని వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో బుధవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఉత్తరాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. విశాఖ జిల్లా గాజువాకలో గంట నుంచి గంటన్నర సమయంలోనే 5.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో 5.4, వేంపాడులో 4.45 సెంటీమీటర్ల వర్షం కురిసింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

నామినేటెడ్ పదవులన్నీ వారంలో భర్తీ!

- ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన
- తాజాగా 11 కార్పొరేషన్లకు 120 మంది డైరెక్టర్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల భర్తీ విషయాన్ని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. వారంలోగా మిగిలిన కార్పొరేషన్లు, దేవాలయాల కమిటీలతో పాటు అన్ని రకాల నామినేటెడ్ పదవులను భర్తీచేసే దిశగా కసరత్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో నామినేటెడ్ పదవుల భర్తీ నెమ్మదిగా సాగింది. అధికారంలోకి వచ్చిన మూడు నెలల తర్వాత తొలి విడతగా నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. తొలి విడతలో 20 కార్పొరేషన్లు భర్తీ చేయగా, మలి విడత నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయడానికి 8నెలల సమయం తీసుకున్నారు. ఇప్పటి వరకు 132 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పదవుల భర్తీలో జాప్యం జరుగుతుండటం, ఆశావహుల పేర్లను ఎమ్మెల్యేలు ఇవ్వకపోవడంపై 'పార్టీ అధ్యక్షా.. పదవులెక్కడ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్ల పదవులను ఆగమేఘాలపై భర్తీ చేస్తున్నారు. తాజాగా 11కార్పొరేషన్లకు 120 మంది డైరెక్టర్లను నియమించారు. వీరిలో బీసీలు 42మంది ఉండగా, మైనార్టీలు 15, ఓసీలు 40, ఎస్సీలు 23 మంది ఉన్నారు. భాగస్వామ్య పక్షాల నుంచీ పేర్లు తీసుకుని వారంలోగా మొత్తం నామినేటెడ్ పదవుల భర్తీ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు పార్టీ పెద్దలు సిద్ధమవుతున్నారు.

అసెంబ్లీకి నేను రాను!

» నాకు ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే వస్తాం: జగన్



అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'ఫేక్ ప్రచారం చేయడం కాదు! దమ్ముంటే అసెంబ్లీకి వచ్చేందుకు సిద్ధమా!" అని ముఖ్యమంత్రి చంద్రబాబు విసిరిన సవాల్‌కు వైసీపీ అధ్యక్షుడు జగన్ స్పందించారు. సభకు వచ్చేందుకు తాము సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. తనకు ప్రతిపక్షనేత హోదా కట్టబెడుతున్నట్లుగా స్పీకర్‌కు ప్రభుత్వం లేఖ అందించి... ఆ హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానంటూ పులివెందుల పర్యటనలో తన సన్నిహితులు, బంధువుల వద్ద జగన్ తేల్చి చెప్పినట్లు తెలిసింది. తమకు 11 మంది ఎమ్మెల్యేలే ఉన్నప్పటికీ, ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తానని జగన్ మొండికేయడం గమనార్హం.

ఆ హోదా ఇస్తేనే శాసనసభకు జగన్: సజ్జల

జగన్‌కు ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే శాసనసభా సమావేశాల్లో పాల్గొంటామని వైసీపీ రాజకీయ సలహా కమిటీ కన్వీనర్ సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి తామెంచుకున్న మీడియా ప్రతినిధులను పిలిపించుకుని మాట్లాడారు. 'జగన్‌కు ప్రతిపక్షనేత హోదా ఇచ్చే దమ్ము చంద్రబాబు ప్రభుత్వానికి ఉందా?' అంటూ సవాల్ విసిరారు.

కొల్లేరుకు శాశ్వత పరిష్కారం

» పోలవరం పూర్తిచేసి తీరతాం: మాధవ్



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న మాధవ్

ఏలూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'జీవ వైవిధ్యం కలిగిన కొల్లేరుకు కేంద్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తుంది. కబ్జాదారులపై చర్యలు తీసుకుని, పేదలకు న్యాయం చేస్తాం. పోలవరం ప్రాజెక్టుకు 100 శాతం నిధులు వెచ్చించి రెండు, మూడేళ్లలో పూర్తి చేసే బాధ్యతను ప్రధాని మోదీ తీసుకున్నారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చెప్పారు. 'సారథ్యం' పేరిట జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ఏలూరు వచ్చారు. బిర్లా భవన్ వద్ద ప్రజలతో చాయ్ పే చర్చ, శోభాయాత్ర, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలోపు పార్టీని బలోపేతం చేసే దిశగా విభిన్న కార్యక్రమాలతో బీజేపీ ముందుకు సాగుతుంది. ఇప్పటి వరకు 21 జిల్లాల్లో పర్యటించా' అ అన్నారు. జిల్లాకు వచ్చిన మాధవ్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి తపనా చౌదరి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ ఘనంగా సత్కరించారు.

ఇంటి ముంగిటకే ఆప్కో వస్త్రాలు

» ఈ కామర్స్‌కు అనుసంధానంగా 40 షోరూమ్‌లు: మంత్రి సవిత



అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు చేనేత దుస్తులను మరింత చేరువ చేయడానికి ఆప్కో ద్వారా డోర్ డెలివరీ సదుపాయం కల్పిస్తున్నట్లు మంత్రి సవిత ఒక ప్రకటనలో తెలిపారు. 'అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ కామర్స్ సంస్థల ద్వారా అమ్మకాలు ప్రారంభించాం. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 40 ఆప్కో షోరూమ్‌లను ఈ కామర్స్‌కు అనుసంధానించాం. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా నేతన్నలు నిలదొక్కుకోవడానికి ఈ కామర్స్‌లోకి ఆప్కో అడుగుపెట్టింది. చాలా తక్కువ కాలంలోనే ఆన్‌లైన్ ద్వారా రూ.45 లక్షల విలువైన చేనేత వస్త్రాల అమ్మకాలు జరిగాయి. ఈ అమ్మకాలను మరింత పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది' అని సవిత తెలిపారు.

పీపీపీ మోడల్‌లో లిడ్‌క్యాప్ భూముల అభివృద్ధి

» విజయవాడ, తిరుపతిలో మల్టీపర్పస్ కాంప్లెక్స్‌ల నిర్మాణం: డోలా




అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): లిడ్‌క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంతో పాటు వాటిని పీపీపీ మోడల్‌లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. బుధవారం సచివాలయంలో లిడ్‌క్యాప్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో తిరుపతి, విజయవాడలో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణంపై మంత్రికి అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎస్వీ ఆటో నగర్‌లోని 4.5 ఎకరాలు, విజయవాడ ఆటోనగర్‌లో ఒక ఎకరా లిడ్‌క్యాప్ స్థలాల్లో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేసే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. దీనిపై సీఎం చంద్రబాబుతో చర్చించి విధి విధానాలు రూపొందిస్తామని మంత్రి తెలిపారు.

అంచనాలకు మించి మంచి..!

» అందుకే 'సూపర్ సిక్స్.. సూపర్ హిట్' సభ

» అనంత వేదికగా 10న నిర్వహణ: విప్ కాలవ శ్రీనివాసులు



అనంతపురం క్రైం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే అంచనాలకు మించి ప్రజలకు మంచి చేసింది. అందుకే సూపర్ సిక్స్- సూపర్ హిట్ సభ నిర్వహించబోతున్నాం' అని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ఈ నెల 10న అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్- సూపర్ హిట్ సభ కోసం నగర శివారులోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ సభాస్థలిలో బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మీడియాతో మాట్లాడుతూ బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు సమష్టిగా ఈ సభను విజయవంతం చేస్తామని అన్నారు.

'రుషికొండ'ను పిచ్చాసుపత్రిగా మారిస్తే మంచిది

» గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు



విశాఖపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'రుషికొండపై రూ.వందల కోట్ల ఖర్చుతో నిర్మించిన భవనం వల్ల ఆదాయమేమీ రాదు. దానిని పిచ్చాసుపత్రి చేస్తే మంచిది' అని గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు అన్నారు. సీతమ్మధార కల్యాణ మండపంలో బుధవారం క్షత్రియ సంక్షేమ సమితి సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రుషికొండ ప్యాలెస్‌ను ఏమి చేస్తే బాగుంటుంది? అని ప్రభుత్వం ప్రజాభిప్రాయం అడుగుతోంది కాబట్టి నేను ఉచిత సలహా ఇస్తున్నా. అక్కడ ఎవరిని బస చేయమన్నా నిద్ర కూడా పట్టదు. అందుకే పిచ్చి ఆస్పత్రిగా మార్చాలి. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన సైకో ముఖ్యమంత్రికి తప్పకుండా సముద్రపు గాలి తగులుతుంది. గతంలో ఏడీబీ, ప్రపంచ బ్యాంకు రుణాలే ఉండేవి. ఇప్పుడు కొత్త తాకట్టులు వచ్చాయి. వాటి నుంచి ఈ ప్రభుత్వాలు ఎలా బయటపడతాయో తెలియట్లేదు. భారత్‌ను ఎవరూ వెనక్కి నెట్టలేరు. ప్రతి ఒక్కరూ అహాన్ని నియంత్రించుకోవాలి. అలాగని సన్యాసులుగా మారాలని చెప్పట్లేదు. భావి తరాలకు మంచి దేశాన్ని ఇవ్వాలనేదే నా అభిమతం' అన్నారు.

బడి వచ్చింది.. బాధ తప్పింది!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» రామాంజనేయపురంలో పాఠశాల ప్రారంభం

» ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడితో తరగతులు ఆరంభం

బెల్లంకొండ, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం రామాంజనేయపురంలో మూడు దశాబ్దాల చదువుల కష్టాలకు మోక్షం లభించింది. బుధవారం గ్రామంలో పాఠశాల ప్రారంభమైంది. ఇక్కడి విద్యార్థుల అవస్థలపై 'చదువు వారికి సాహసమే' శీర్షికన ఆగస్టు 16న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించి, విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశాలతో కలెక్టర్ అరుణ్‌బాబు రామాంజనేయపురాన్ని సందర్శించి పాఠశాల ఏర్పాటు చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో బుధవారం గ్రామంలో పాఠశాలను టీడీపీ రాష్ట్ర నేత వెన్నా సాంబశివారెడ్డి ప్రారంభించారు. తొలిరోజు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒక ఉపాధ్యాయుడితో తరగతులు ఆరంభిస్తున్నట్లు పల్నాడు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఏసుబాబు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతి'ని, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే ప్రవీణ్ చేసిన మేలును మర్చిపోలేమన్నారు.



పాఠశాలను ప్రారంభించి విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న టీడీపీ రాష్ట్ర నేత వెన్నా సాంబశివారెడ్డి, తదితరులు

స్థానిక సంస్థలకు చేయూత

ఆదాయార్జన ఆధారంగా పంచాయతీల విభజన..

» రాష్ట్ర ఆర్థిక సంఘం భేటీలో సీఎం సూచన



ఐదవ ఆర్థిక సంఘం సభ్యుల సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ తదితరులు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సొంత ఆదాయ వనరులు పెంచుకుని వేగంగా అభివృద్ధి సాధించడంపై స్థానిక సంస్థలు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. బుధవారం సచివాలయంలో 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల బలోపేతంపై ఆర్థిక సంఘం సిఫారసులను ప్రభుత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి ఆధారంగా స్థానిక సంస్థలను కేటగిరీలుగా విభజించాలని, దీనివల్ల తక్కువ ఆదాయం ఉన్నవాటికి ప్రత్యేక సాయం అందించే అవకాశం ఉంటుందన్నారు. పంచాయతీలకు ఏటా వివిధ రూపాల్లో సమకూరుతున్న నిధుల మొత్తాన్ని క్రోడీకరించాలన్నారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేస్తే వాటికి ఏవిధంగా సాయం అందించాలి?, స్థానిక సంస్థల్ని ఏవిధంగా బలోపేతం చేయాలి అనే అంశాలపై విధివిధానాలు రూపొందించవచ్చన్నారు. ఉపాధి హామీ పథకం కింద కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు వస్తున్నాయని, అయితే ఆమేరకు ఆస్తుల కల్పన జరుగుతున్నదో.. లేదో? పరిశీలించాలన్నారు. స్థానిక సంస్థలు స్వయం సమృద్ధి సాధించేలా అధికారులు ప్రయత్నించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థలనూ ఆర్థికంగా బలోపేతం చేస్తూ, మరిన్ని ఆదాయార్జన మార్గాలను అన్వేషించాలని చెప్పారు. ప్రభుత్వాలు ఇచ్చిన నిధులను సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు వ్యవహరించాలన్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించేవి స్థానిక సంస్థలని, దీనిని దృష్టిలో పెట్టుకుని వాటిలో పనిచేసే ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా ఉండాలని చెప్పారు. ఆర్థిక సంవత్సరం చివరికి పంచాయతీల్లో ఆడిటింగ్ పూర్తి చేయాలన్నారు.

ఆదాయాలు, బకాయిల లెక్క తేల్చండి: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

2019 నుంచి 2024 మధ్య కాలంలో స్థానిక సంస్థల ఆస్తి పన్నుల వసూళ్లు, బకాయిల లెక్కలు తేల్చాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు సూచించారు. ప్రజలు చెల్లించే పన్నుల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. గ్రామాల్లో పౌల్ట్రీ పరిశ్రమలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని, గ్రామ ప్రజలకు, పౌల్ట్రీ పరిశ్రమలకు ఇబ్బంది లేని విధానాన్ని తీసుకురావాలని చెప్పారు. ఆదాయార్జన ప్రకారం స్థానిక సంస్థల వర్గీకరణ ప్రక్రియను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. అయితే ఇందుకు చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని ఆర్థిక సంఘం అధికారులు తెలిపారు.

ఖర్చులు.. ఆదాయం మధ్య భారీ వ్యత్యాసం

స్థానిక సంస్థల ఆదాయ వనరులు.. ఖర్చుల మధ్య భారీ వ్యత్యాసం ఉంటోందని 5వ ఆర్థిక సంఘం తన నివేదికలో పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరాన్ని పరిశీలిస్తే రాష్ట్ర ఆదాయం కన్నా జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులకు ఖర్చు పెట్టే మొత్తం 111 శాతంగా ఉందని పేర్కొంది. 2025-26 నుంచి 2029-30 వరకు పంచాయతీరాజ్ సంస్థల రీసోర్స్ గ్యాప్ రూ.7,033 కోట్లు ఉంటుందని ఆర్థిక సంఘం లెక్క తేల్చింది. ఇదే కాలానికి పట్టణ స్థానిక సంస్థల రీసోర్స్ గ్యాప్ రూ.2,016 కోట్లుగా ఉందని, ఆస్తి పన్నుల డిమాండ్-కలెక్షన్ మధ్య భారీ వ్యత్యాసం ఉందని చెప్పింది.

విద్యుత్ బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం

గత ప్రభుత్వం 2024 జూన్ వరకు చెల్లించకుండా వదిలేసిన గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు రూ.5,851.58 కోట్లు ఉన్నాయని ఆర్థిక సంఘం తన నివేదికలో పేర్కొంది. గ్రామ పంచాయతీలకు వివిధ రూపాల్లో నిధుల సమీకరణ రూ.2,617 కోట్లుగా ఉందని, ఇందులో అత్యధికంగా కేంద్ర ఆర్థిక సంఘం అందిస్తున్న గ్రాంట్స్ రూపంలోనే ఉన్నాయని తెలిపింది. ఆతర్వాత ఆస్తి పన్నులతో ఎక్కువ నిధులు సమకూరుతున్నాయని పేర్కొంది. పంచాయతీరాజ్ సిబ్బందికి ఏటా జీతాల రూపంలో రూ.393. 77 కోట్లు, మున్సిపల్ సిబ్బందికి రూ.1672.45 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని సంఘం తన నివేదికలో పేర్కొంది. ఈ సమావేశంలో రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం ఛైర్‌పర్సన్ రత్నకుమారి, సభ్యులు ప్రసాదరావు, కృపారావు, ఆర్థిక, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నాణ్యత లేని 'నాడు-నేడు' పనులు!

» పాఠశాల శ్లాబ్ పెచ్చులు పడి నలుగురు విద్యార్థులకు గాయాలు



పెచ్చులు ఊడిన పాఠశాల భవనం పైకప్పు



గాయపడిన నిత్య

ఆలూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన 'నాడు-నేడు' పనుల నాణ్యతలో డొల్లతనం విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాల తరగతి గదిలో పైకప్పు పెచ్చులూడిపడి నలుగురు విద్యార్థులు గాయపడ్డారు. కర్నూలు జిల్లా ఆలూరు పట్టణంలోని 4వ వార్డులో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొంత కాలంగా పాఠశాల పైకప్పు ప్రమాదకరంగా మారింది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు భోజనం కోసం పాఠశాల ఆరుబయటకు వచ్చారు. ఆ సమయంలో నాలుగో తరగతి గదిలో కూర్చున్న నిత్య, జయశ్రీ, చరణ్, విఘ్నేష్‌లపై పెచ్చులూడి పడటంతో వారి తలలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే వారిని ఉపాధ్యాయులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భోజనం సమయంలో మిగిలిన పిల్లలంతా బయట ఉండడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. కాగా, పాఠశాలలో గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పనులు చేపట్టారు. ఆ పనుల్లో నాణ్యత లేమి కారణంగానే ఇలా పాఠశాల పైకప్పు పెచ్చులు ఊడిపడి విద్యార్థులు గాయపడ్డారని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. నాడు-నేడు పనుల్లో అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు విలేకరులకు తెలిపారు.

తిరుపతితో సహా ఇతర ప్రాంతాల్లో ప్రోత్సాహం

గడువులోగా హోటల్ గదులు సిద్ధం కావాలి

పర్యాటకుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం: సీఎం



రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించే తెలుగు తాళపత్రాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

ఆధ్యాత్మిక నగరాల్లో

హోమ్‌స్టేలు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆధ్యాత్మిక నగరాల్లో హోమ్ స్టేలను ప్రోత్సహించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తిరుపతితో పాటు ఇతర ప్రముఖ దేవాలయాలున్న ప్రాంతాల్లో వీటిపై దృష్టిపెట్టాలన్నారు. అలాగే కోనసీమ ప్రాంతంలో గ్రామీణ వాతావరణం అనుభూతి చెందేలా హోమ్ స్టేలను అభివృద్ధి చేయాలని చెప్పారు. ఎన్ఆర్ఐలు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ హోమ్ స్టేలన్నీ అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండేలా చూడాలన్నారు. బుధవారం సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో పర్యాటక శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. విశాఖ, విజయవాడ, అమరావతి, తిరుపతి, అనంతపురం, కర్నూలు వంటి ప్రాంతాల్లో నిరంతరం ఏదోక టూరిజం ఈవెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చెప్పారు. రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. నిర్దేశించిన గడువులోగా పర్యాటక ప్రాంతాల్లో బస కోసం హోటల్ గదులను సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే 2026 మార్చి నాటికి రాష్ట్రంలో 10 వేల గదులు అందుబాటులోకి రావాలని చెప్పారు. 2029 నాటికి 50 వేల గదుల లక్ష్యాన్ని కూడా చేరుకోవాలని స్పష్టం చేశారు. పర్యాటకుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక్క చిన్న సంఘటన జరిగినా మొత్తం పర్యాటక రంగం దెబ్బతింటుందని హెచ్చరించారు. పర్యాటకుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం చాలా ముఖ్యమైన అంశమన్నారు. సమీక్షలో ఆయన ఇంకా ఏమన్నారంటే..

అనంతపురంలో డిస్నీ వరల్డ్

"రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పర్యాటక ప్రాజెక్టులకు స్థలాలను గుర్తించాలి. పోర్టుల వద్ద పర్యాటకంగానూ అభివృద్ధి చేయాలి. అనంతపురంలో డిస్నీ వరల్డ్ సిటీ ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధుల్ని సంప్రదించాలి. కొండపల్లి ఖిల్లా లాంటి ప్రాజెక్టులను దత్తత తీసుకునేలా ప్రైవేట్ భాగస్వాములను గుర్తించాలి. ఉండవల్లి గుహల వద్ద లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటుతో పాటు, చింతపల్లిలో ఎకో టూరిజం, కుప్పంలో ఏనుగుల సఫారీ, విశాఖలో డాల్ఫిన్ షో వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలి. లైడ, అరకు, గండికోట, సూర్యలంక, బ్రిడ్జిలంక, లంబసింగి వంటి ప్రాంతాల్లో టెంట్ సిటీలను ఏర్పాటు చేయాలి. రాజమండ్రిని స్పెషల్ టూరిజం హబ్‌గా చేయాలి. హేవ్‌లాక్ బ్రిడ్జిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి. ఆకర్షణీయమైన బీచ్ ఫ్రంట్‌లను గుర్తించి అభివృద్ధి చేయాలి. హెలీ, సీప్లేన్ టూరిజానికి సంబంధించి విజయవాడ-శ్రీశైలం, గండికోట-బెంగళూరు, విశాఖ-అరకు లాంటి కొత్త మార్గాలను కూడా గుర్తించాలి. రివర్ క్రూయిజ్‌లను ప్రోత్సహించాలి. ఈనెల 22 నుంచి విజయవాడలో జరిగే దసరా ఉత్సవాలను మైసూరు ఉత్సవాల తరహాలో ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలి.

పర్యాటక ప్రాంతాలకు ఆకర్షణలు

పర్యాటరంగానికి మరింత శోభ తెచ్చేలా అదనపు ఆకర్షణలు జోడించడంతో పాటు, స్థానికంగా ఉన్న ఉత్పత్తులను కూడా బ్రాండింగ్ చేయాలి. అన్ని పర్యాటక ప్రాంతాల్లో, ఈవెంట్లలో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు అరుదైన ఎర్రచందనం బొమ్మలు, ఫర్నిచర్ లాంటి ఉత్పత్తులను కూడా ప్రదర్శించాలి. మంగళగిరి, ధర్మవరం, వెంకటగిరి లాంటి చేనేత వస్త్రాలు, సేంద్రీయ ఉత్పత్తులను కూడా ప్రదర్శించాలి" అని సీఎం ఆదేశించారు. సూర్యలంకలో బీచ్ ఎక్స్‌పీరియన్స్ ప్రాజెక్టు పనులను రూ. 97 కోట్లతో చేపట్టామని, వచ్చే జూన్ నాటికి ఈ ప్రాజెక్టు సిద్ధం అవుతుందని అధికారులు వెల్లడించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంకలో ఫెస్టివల్ నిర్వహించవచ్చని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాలకు కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహిద్దామన్న మంత్రి దుర్గేశ్ ప్రతిపాదనకు సీఎం అంగీకారం తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించేందుకు సిద్ధం చేసిన ఆరు పురాతన తెలుగు తాళపత్ర గ్రంథాలను పరిశీలించారు.

లిక్కర్ కిక్కులో హల్‌షెల్

(మొదటి పేజీ తరువాయి)

ఒక కంపెనీలో సోదాలు జరపడానికి వెళ్లగా... అక్కడ పది డొల్ల కంపెనీలు బయటపడ్డాయి. హైదరాబాద్‌లోనూ ఇలాంటి చిత్రాలే వెలుగు చూశాయి. అన్నింటికంటే మించి... ఎన్నికల సమయంలో పట్టుబడిన రూ.8 కోట్లు తనవే అని, అవి రియల్‌ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించినవని చెప్పిన ప్రద్యుమ్నతో చెవిరెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డికి ఉన్న వ్యాపార సంబంధమూ బయటపడింది. అలాగే... సజ్జల రామకృష్ణా రెడ్డి తనయుడు భార్గవ రెడ్డికీ లిక్కర్ స్కామ్ నిందితులతో బంధముందని తేలింది. వెరసి... సిట్ సోదాల్లో ఒక పెద్ద నెట్‌వర్క్ బయటపడింది.

చిత్తూరులో బంధం...

సోమవారం చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానంద రెడ్డిని 'సిట్' ప్రశ్నించింది. వైసీపీ హయాంలో మద్యం డిపోల నుంచి షాపులకు లిక్కర్ సరఫరా చేసే కాంట్రాక్టు ఆయనకే దక్కింది. పనిలోపనిగా చెవిరెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులకు డబ్బులు రవాణా చేశారని సమాచారం అందింది. చెవిరెడ్డితో కలిసి ఆఫ్రికా దేశాల్లో పెట్టుబడులు పెట్టేందుకు వెళ్లినట్లు విజయానంద రెడ్డి చెప్పడంతో... మరింత లోతుగా ఆరా తీసేందుకు సోదాలకు దిగింది. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు చిత్తూరు నలందా నగర్‌లో ఉన్న విజయానంద రెడ్డి అపార్ట్‌మెంట్‌లో 'సీఎంఆర్ ప్రాజెక్ట్' కార్యాలయానికి వెళ్లారు. తీరా చూస్తే అందులో... 'వెల్‌టాస్క్ ఫుడ్స్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్' కార్యాలయం నడుస్తోంది. అది రిజిస్టర్ కూడా కాలేదు. అందులోనే... నిఖిలానంద లాజిస్టిక్స్ (లిక్కర్ ట్రాన్స్‌పోర్ట్), ఎంపీసీ గ్రానైట్స్, సాయి సోనా గ్రానైట్స్, రాజ్ గ్రానైట్స్, ఎంఎస్‌జే ఎక్స్‌పోర్ట్స్, నిఖిలానంద డెవలపర్స్, శ్రీసాయి కన్వెన్షన్ సెంటర్, గౌతమ్ సాయి ఫైనాన్స్ వంటి సంస్థలు నడుస్తున్నట్లు తేలింది. ఇవేవీ రిజిస్టర్ కాలేదని, అంతర్గత కార్యకలాపాలకోసమే ఏర్పాటు చేశారని 'సిట్' గుర్తించింది. అంతేకాదు... మోహిత్ రెడ్డికి చెందిన 'సీఎంఆర్ ప్రాజెక్ట్స్'లో విజయానంద రెడ్డి డైరెక్టర్ అని కూడా బయటపడింది. అక్కడున్న సిబ్బందిని ప్రశ్నించగా... ఆయా సంస్థల ఆడిట్ వ్యవహారాలను తామే చూస్తామని చెప్పినట్లు తెలిసింది. చిత్తూరులో సిట్ అధికారులు రాత్రి 8 గంటల వరకు తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాల్లోని రికార్డులను స్వాధీనం చేసుకుని వెంట తీసుకెళ్లారు.



తిరుపతిలో చెవిరెడ్డి నివాసం

తిరుపతిలో... రూ.600 కోట్ల రియల్ దందా

తిరుపతిలో చెవిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన కంపెనీల్లో విస్తృతంగా సిట్ సోదాలు జరిపింది. అక్కడ కూడా అనేక కంపెనీలు బయటపడ్డాయి. కల్యాణ వేంకటేశ్వర స్వామి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, క్యాంప్ మ్యాన్ పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, చెవిరెడ్డి మునిరెడ్డి గార్డెన్స్ ప్రైవేట్ లిమిటెడ్, జైన్ ప్రైవేట్ లిమిటెడ్, చెవిరెడ్డి మునిరెడ్డి రోశమ్మ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, మ్యాచ్‌కార్ప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, జెన్సిస్ మెడిల్యాబ్స్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్... ఇలా పలు సంస్థల పేర్లతో కంపెనీలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. వీటి కార్యకలాపాలేమిటి, ఆదాయమెంత.. అనే వివరాలు తెలియాల్సి ఉంది. మోహిత్ రెడ్డి రూ.600 కోట్ల రియల్ ఎస్టేట్ లావాదేవీలు నడిపినట్లు సోదాల్లో తేలినట్లు సమాచారం. దీనిపై ఈడీతో పాటు ఆదాయ పన్ను శాఖకు సమాచారం ఇవ్వాలని 'సిట్' నిర్ణయించినట్లు తెలిసింది.

హైదరాబాద్‌లో 'సజ్జల' లింకు

హైదరాబాద్‌లో మోహిత్ రెడ్డికి సంబంధించి... యల్లారెడ్డి గూడలోని శ్రీవిద్య ఎన్‌క్లేవ్‌లో ఉన్న సీఎంఆర్ ప్రాజెక్ట్, మణికొండలోని పంచవటి కాలనీలో ఐడెంట్ సిటీ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, గచ్చిబౌలి ప్రశాంతి హిల్స్‌లోని 'భీం స్పేస్ ఎల్ఎల్‌పీ' కార్యాలయాల్లో సోదాలు జరిపారు. అక్కడ సిట్ అధికారులూ ఊహించని పరిణామం ఎదురైంది. భీం స్పేస్ బోర్డు ఉన్న ఆఫీసులో 'ఇషా ఇన్‌ఫ్రా' పేరుతో మరో సంస్థ నడుస్తోంది. అది... లిక్కర్ స్కామ్‌లో ఏ-1గా ఉన్న రాజ్ కసిరెడ్డి కంపెనీగా అనుమానించి రికార్డులు పరిశీలించడంతో అందులో డైరెక్టర్లుగా మోహిత్ రెడ్డి, సజ్జల భార్గవ రెడ్డి, ఒంగోలుకు చెందిన ప్రద్యుమ్న పేర్లు ఉన్నట్లు తేలింది. ఎన్నికల సమయంలో పట్టుబడ్డ రూ.8.37 కోట్లు తనవే అని ప్రద్యుమ్న ప్రకటించగా... అసలు ప్రద్యుమ్న ఎవరో తనకు తెలియదని చెవిరెడ్డి ఏసీబీ కోర్టులో వాదించారు. దొరికిన డబ్బుతో తనకు ముడిపెట్టి 'సిట్' కుట్ర చేస్తోందన్నారు. తాజా సోదాల్లో... చెవిరెడ్డి, ప్రద్యుమ్న బంధం బయటపడింది. 'ఇషా ఇన్‌ఫ్రా'లో డాక్యుమెంట్లు పరిశీలించగా... మోహిత్ రెడ్డి, భార్గవ్ రెడ్డి, ప్రద్యుమ్న రాసుకున్న అగ్రిమెంట్ కూడా లభించింది.

చెవిరెడ్డి ఇంటి వద్ద ఎదురుచూపులు

తిరుపతిలో చెవిరెడ్డి నివాసం, కార్యాలయంలోనూ సోదాలు జరిపేందుకు 'సిట్' అధికారులు వెళ్లినా... వాటికి తాళాలు వేసి ఉన్నాయి. తొలుత ఉదయం 9.30 గంటలకు తిరుపతి నగరం ఎయిర్ బైపాస్ రోడ్డులో చెవిరెడ్డి కార్యాలయం వున్న కేవీఎస్ భవనం వద్దకు వెళ్లారు. అక్కడ 'టు లెట్' బోర్డు కనిపించింది. లోపల పరిశీలించగా... అంతా ఖాళీగా దర్శనమిచ్చింది. గతేడాది ఎన్నికల తర్వాత చెవిరెడ్డి ఈ భవనాన్ని ఖాళీ చేశారు. తుమ్మలగుంటలోని ఇంట్లోనే కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సిట్, విజిలెన్స్ బృందాలు తుమ్మలగుంటలోని చెవిరెడ్డి ఇంటి చేరుకున్నాయి. ఇంటికి తాళాలు వేయడంతో... అక్కడికి సమీపంలోనే ఉంటున్న చెవిరెడ్డి తల్లి, సోదరుడు రఘునాథ రెడ్డి తదితరులతో మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నమే చెవిరెడ్డి సతీమణి, కుమారులు హైదరాబాద్ వెళ్లినట్లు తెలియడంతో... చెవిరెడ్డి కుమారులకు ఫోన్ చేయించారు. ఇంట్లో తనిఖీలు చేపట్టాల్సి ఉందని... సాయంత్రం 7 గంటలలోగా ఇంటి తాళాలు తెరిపించకపోతే పంచనామా నిర్వహించి తాళాలు పగలగొట్టి తనిఖీలు చేపడతామని చెప్పినట్లు తెలిసింది. తాము రావడానికి రాత్రి 10 గంటలు అవుతుందని, అప్పటి దాకా గడువు ఇవ్వాలని చెవిరెడ్డి కుటుంబ సభ్యులు కోరినట్లు తెలిసింది. దీంతో వారి రాక కోసం సిట్ అధికారులు రాత్రి పొద్దుపోయే దాకా ఎదురు చూస్తూ ఉన్నారు.

చీటింగ్ కేసులో రూ.2.22 కోట్ల ఆస్తులు జప్తు

విశాఖపట్నం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో రుణాలు తీసుకొని కెనరా బ్యాంకును మోసం చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విశాఖపట్నం సబ్ జోనల్ అధికారులు రూ.2.22 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేశారు. కొప్పూరి శ్రీనివాస్, ఆడారి చంద్రకళ, దేవసాని నిర్మల కలిసి కిసాన్ క్రెడిట్ కార్డు పథకం కింద చేపల చెరువుల పేరిట కంచరపాలెంలోని కెనరా బ్యాంకులో రుణాలు పొందారు. అందు కోసం నకిలీ పట్టాదారు పాస్‌పుస్తకాలు సమర్పించారు. రుణం తిరిగి చెల్లించలేదు. అధికారుల విచారణలో మోసాలు బయటపడ్డాయి. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు దేవసాని నిర్మల, ఆడారి చంద్రకళ, కొప్పూరి శ్రీనివాస్‌లతో పాటు డీవీకే కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ముగ్గురికీ మొత్తం రూ.5.5 కోట్ల రుణం మంజూరు కాగా, అందులో రూ.4.57 కోట్లను డీవీకే కుమార్ తీసుకున్నట్టు గుర్తించారు. ఆయన ఆ మొత్తాలను స్నేహితులు, బంధువుల ఖాతాలకు మళ్లించారు. కొంత మొత్తంతో భార్య సునీత పేరిట స్థిరాస్తులు కొన్నారు. విచారణలో ఈ విషయాలను గుర్తించి రూ.2.22 కోట్ల ఆస్తులను జప్తు చేశారు. అందులో చరాస్తులు కూడా రూ.1.36 లక్షలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

అధిక వడ్డీ ఆశ చూపి 6 కోట్లకు టోకరా

» విశాఖలో 'ఫెయిర్ గ్రో ట్రేడర్' సంస్థ మోసం

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశ చూపి విశాఖపట్నం ఎంవీపీ కాలనీలోని ఫెయిర్ గ్రో ట్రేడర్స్ అనే సంస్థ భారీ మోసానికి పాల్పడింది. పదుల సంఖ్యలో ఉన్న బాధితులకు సుమారు రూ. 6 కోట్ల వరకు టోకరా వేసింది. దీనిపై రోహిత్ అనే బాధితుడి ఫిర్యాదుతో ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తమ సంస్థలో పెట్టుబడి పెడితే పది శాతం చొప్పున వడ్డీ చెల్లిస్తామని సంస్థ నిర్వాహకులైన వెంకట్ కిశోర్, అతడి కుమారుడు నందన్, భార్య రామనాంబ నమ్మించారు. దీంతో బీచ్ రోడ్డు ప్రాంతంలో ఉంటున్న అర్జి రోహిత్ రూ.80 లక్షలు పెట్టుబడి పెట్టారు. అయితే అతడికి వడ్డీ ఇవ్వలేదు. రోహిత్ ఒత్తిడితో జూలైలో రూ. 50 లక్షలకు నాలుగు చెక్కులు ఇవ్వగా, అందులో ఒకటి బౌన్స్ అయింది. దాని గురించి ప్రశ్నిస్తే కిశోర్ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో రోహిత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక దర్యాప్తులో కనీసం యాభై మంది నుంచి రూ.6కోట్ల వరకూ కిశోర్ వసూలు చేసినట్టు తెలుస్తోందని సీఐ జె.మురళి తెలిపారు.

మిథున్ రెడ్డి మధ్యంతర బెయిల్‌పై 6న తీర్పు

విజయవాడ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డిమధ్యంతర బెయిల్, రెగ్యులర్ బెయిల్ పిటిషన్లపై విజయవాడ ఏసీబీ కోర్టులో బుధవారం వాదనలు జరిగాయి. మధ్యంతర బెయిల్‌పై వాదనలు ముగియడంతో తీర్పును ఆరో తేదీన వెలువరిస్తామని న్యాయాధికారి పి.భాస్కరరావు తెలిపారు. రెగ్యులర్ బెయిల్‌పై విచారణను ఎనిమిదో తేదీకి వాయిదా వేశారు. అదేవిధంగా విజయవాడ జిల్లా జైల్లో ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప బెయిల్ పిటిషన్లపై వాదనలు ముగిశాయి. ఆరో తేదీన తీర్పును వెలుస్తామని కోర్టు వెల్లడించింది.

కారుణ్య నియామకం కోసం కన్న తండ్రి హత్య

» కర్నూలు జిల్లాలో దారుణం

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తండ్రి చనిపోతే కారుణ్య నియామకం వస్తుందన్న దురాశతో.. కన్నతండ్రినే అతి కిరాతకంగా హతమార్చాడో సుపుత్రుడు!. కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలో బుధవారం ఈ దారుణం చోటుచేసుకుంది. కోడుమూరు మండలం పులకుర్తికి చెందిన రామాచారి కొడుకు వీరసాయి డిగ్రీ వరకు చదివి కర్నూలులో ఓ ఫార్మసీ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి ప్రభుత్వ ఉద్యోగం చేయాలని కోరిక. కొన్ని నెలల క్రితం తన తండ్రితో పాటు పని చేసే ఓ డ్రైవర్ విధుల్లో ఉండగా గుండెపోటుతో చనిపోగా కారుణ్య నియామకం కింద అతడి కొడుక్కి ఉద్యోగం వచ్చింది. దీంతో.. తండ్రి చనిపోతే తనకూ ఉద్యోగం వస్తుందన్న ఆలోచన వీరసాయి మనసులో బలంగా నాటుకుపోయింది. ఈ క్రమంలో వీరసాయి భార్య సుప్రియ నెల రోజుల క్రితం రెండో కాన్పు నిమిత్తం పుట్టింటికి వెళ్లింది. తల్లి విరూపాక్షమ్మ కూడా రెండు రోజుల క్రితం పుట్టినిల్లు చిన్నతుంబలం వెళ్లింది. మంగళవారం రాత్రి తండ్రీకొడుకులిద్దరే భోజనం చేసి పడుకున్నారు. వీరసాయి తెల్లవారుజామున ఇంట్లో ఉన్న రోకలితో తండ్రి తల, నుదుటిపై విచక్షణారహితంగా కొట్టి హత్య చేశారు. విషయం బయటకు పొక్కడంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఇంకా అజ్ఞాతంలోనే డీటీ మణిదీప్!

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్ ముఠా.. రేవ్ పార్టీల నిర్వహణలో కీలకవ్యక్తిగా వ్యవహరించిన రాజమహేంద్రవరం డిప్యూటీ తహశీల్దార్ మణిదీప్ ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నట్టు తెలుస్తోంది. ధవళేశ్వరంలోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఏవో కార్యాలయంలో ఆయన డిప్యుటేషన్‌ను అధికారులు రద్దు చేశారు. వాస్తవానికి మణిదీప్ పోస్టు ఏజెన్సీ వీఆర్‌పురం యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పరిధిలో ఉంది. ధవళేశ్వరంలో డిప్యుటేషన్‌ను రద్దు చేసినా, ఆయన ఇంత వరకూ వీఆర్‌పురంలో విధుల్లోనూ చేరలేదు.

జైలా.. అత్తారిల్లా?

రాజమండ్రిలో మిథున్ రెడ్డికి సకల సౌకర్యాలు



» సెంట్రల్ జైలు అధికారులు జీ హుజూర్

» సూపరింటెండెంట్ గదిలోనే ములాఖత్‌లు

» గతంలో ఇదే జైలులో చంద్రబాబుకు ఆంక్షలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జైలు గదిలో 8 ఫ్యాన్లు.. జైలుకు వచ్చిన మూడో రోజు నుంచే కూలర్.. ఇంకా మినరల్ వాటర్, మంచం, టేబుల్, కుర్చీలు.. దుప్పట్లు మార్చడానికి, టేబుల్, కుర్చీలు, గది శుభ్రం చేయడానికి ఖైదీలు.. దోమలు రాకుండా కిటికీలకు దోమ తెరలు.. మద్యం కేసులో నిందితుడు, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి రాజమండ్రి సెంట్రల్ జైలులో సకల మర్యాదలూ జరుగుతున్నాయి. కోర్టు ఆదేశాలకు మించి అధికారులు సేవలు కల్పిస్తున్నారు. వారంలో ఆదివారం తప్ప మిగతా ఆరు రోజులు కుటుంబీకులు, స్నేహితులు, న్యాయవాదులను మిథున్ రెడ్డి కలుస్తున్నారు. మిథున్ రెడ్డికి చేస్తున్న సేవలు వింటే జైలా.. అత్తారిల్లా అని ఆశ్చర్యపోతారు. 'మిథున్ రెడ్డికి ఏమైనా కావాలంటే మాపై అధికారులకు చెప్పొద్దు. నాకు చెప్పండి.. నేను చేస్తాను' అని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో జైలు ఉన్నతస్థాయి అధికారి అన్నారు. దీన్నిబట్టి జైలులో ఏమి జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. డ్రైవర్‌ను చంపి ఇంటికి శవాన్ని డెలివరీ చేసిన కేసులో వైసీపీ నేత అనంతబాబు రిమాండ్‌లో ఉన్నప్పుడూ ఇలాగే సకల మర్యాదలూ జరిగాయి.

నాడు బాబుపై కక్షసాధింపు

14 ఏళ్లు సీఎంగా పనిచేసి, జాతీయ స్థాయి నేతల్లో ముఖ్యుడైన చంద్రబాబును 2023 సెప్టెంబరులో తప్పుడు కేసులో ఇదే జైలులో పెట్టినప్పుడు ఆనాటి వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడింది. ఆయన వయసును కూడా పరిగణనలోకి తీసుకోలేదు. చంద్రబాబు 53 రోజులు జైలులో ఉండగా, చాలా రోజుల పాటు కనీసం దోమ తెర కూడా ఇవ్వలేదు. బాత్‌రూమ్‌లో కమోడ్ ఏర్పాటు చేయలేదు. చంద్రబాబు లాయర్ల పోరాటం తర్వాత ఆయన విడుదలకు నాలుగు రోజుల ముందు ఏసీ సదుపాయాన్ని కల్పించారు. అప్పటికే 50 రోజులు ఆయన తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

సూపరింటెండెంట్ గదిలోనే..

జైలులో ములాఖత్‌ల విషయంలో రెండు విధాలు అనుసరిస్తారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఎంపీ, కుటుంబ సభ్యులు నిందితుడితో డిప్యూటీ సూపరింటెండెంట్ గదిలో కూర్చుని మాట్లాడవచ్చు. మిగతావాళ్లకు ఇనుప సెల్ ద్వారా అనుమతి ఉంటుంది. ఇప్పుడు మిథున్‌కు ఏకంగా సూపరింటెండెంట్ గదిలో కూర్చుని మాట్లాడుకొనే అవకాశమిస్తున్నారు. మిథున్‌తో ఎవరైనా ములాఖత్‌లో ఉన్నప్పుడు సూపరింటెండెంట్ గది దగ్గరకు ఎవరినీ రానివ్వడం లేదు. అక్కడ ఫోన్‌లో మాట్లాడుకున్నా బయటికి తెలిసే అవకాశం లేదు. ఉన్నతాధికారులు హెచ్చరించినా సూపరింటెండెంట్ పెడచెవిన పెట్టారని సమాచారం. ములాఖత్‌కు వచ్చిన వైసీపీ నేతలను జైలు డిప్యూటీ వార్డర్ స్థాయి అధికారి మొదటి గేటు నుం చి మెయిన్ గేటు వరకూ సాదరంగా తీసుకెళుతున్నారు.

ఇంటి భోజనం, టీవీ

చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో ఆహారం విషయంలోనూ అతిగా తనిఖీలు చేశారు. ఆయన ఆహారం విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉంటారు. బ్రౌన్ రైస్, ఒకటో రెండో కూరలు మాత్రమే జైలులోకి వెళ్లేవి. ఇప్పుడు మిథున్‌కు ఏకంగా రెండు మూడు బ్యాగుల్లో ఆహారం వెళుతోంది. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఇచ్చిన టీవీ సదుపాయం సెషన్స్ ముగిసినా కొనసాగుతోంది. ఆయనకు అటెండెంట్‌ను ఇవ్వడానికి జైలు మాన్యువల్ ఒప్పుకోదన్న జైలు అధికారులు ఇప్పుడు అనధికారికంగా ఖైదీలను సహాయకులుగా సేవలు చేయిస్తున్నారు.

నాడు, నేడు ఎంత తేడా

- మిథున్ జైలుకు వచ్చి 46 రోజులైంది. సెలవులు పోను 36 రోజుల్లో 24 ములాఖత్‌లు ఇచ్చారు. లీగల్ ఇంటర్వ్యూలు మినహా ఫ్యామిలీ ములాఖత్‌లకు ఒక్కోదానికి గరిష్ఠంగా ముగ్గురికి అనుమతి ఉంటుంది. వీటి ద్వారా స్నేహితులు (37) ఎక్కువగా ఆయన్ను కలిశారు. తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 4 సార్లు, భార్య 4 సార్లు, కొడుకు, సోదరి, పీఏ 2 సార్లు చొప్పున, తల్లి, బావమరిది, మామ, కజిన్ ఒక్కోసారి, అడ్వొకేట్ 5సార్లు మిథున్‌ను కలిశారు.
- చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు ములాఖత్‌లకు బాగా ఇబ్బంది పెట్టారు. వారానికి 3 ములాఖత్‌లను తర్వాత రెండుకు కుదించారు. లీగల్ ఇంటర్వ్యూలను ఒకటికి తగ్గించారు. వారానికి మూడు ఫ్యామిలీ, మూడు లీగల్ ములాఖత్‌లకు అప్పట్లో చంద్రబాబు కోర్టు అనుమతి తీసుకున్నారు. ఆయన జైలుకు వచ్చిన రెండో వారంలో మూడోసారి ములాఖత్ కోసం భార్య దరఖాస్తు చేయగా, ఏవో కారణాలు చూపిస్తూ అధికారులు తిరస్కరించారు. లీగల్ ములాఖత్‌లు కూడా రోజుకు ఒక్కటే అంటూ జైలు అధికారులు ఆదేశాలిచ్చారు. కోర్టు ఆదేశాలనూ పక్కన పెట్టేశారు.
- గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావు, ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకుడి హోదాలో చంద్రబాబు ములాఖత్ అనుమతి తీసుకొని వాళ్లను కలిశారు. అంతే.. అప్పటి జైలు సూపరింటెండెంట్ రాజారావును ఉన్నపళంగా నెల్లూరు శిక్షణ కళాశాలకు అటాచ్‌మెంట్‌పై పంపిస్తూ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆదేశాలిచ్చారు. అప్పుడే విశాఖ జైలు నుంచి రాహుల్ సూపరింటెండెంట్‌గా వచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ మిథున్‌కు అనుకూలంగా చేస్తానంటూ పెద్దిరెడ్డితో రాహుల్ చెప్పారు.

రెండు వారాల్లో.. 18 కోట్లు కట్టండి

» జేపీ వెంచర్స్‌కు సుప్రీంకోర్టు షాక్

» ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, జీసీకేసీని ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశం



న్యూఢిల్లీ, అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఇసుక తవ్వకాలు చేపట్టిన జేపీ వెంచర్స్‌కు సుప్రీంకోర్టులో ఎదురు దెబ్బ తగిలింది. అక్రమంగా ఇసుక తవ్వినందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన రూ.18 కోట్ల జరిమానాను రెండు వారాల్లో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. ఎన్జీటీ విధించిన జరిమానాపై గతంలో విధించిన స్టేను తొలగిస్తూ, బుధవారం జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు జారీచేసింది. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, జీసీకేసీని ప్రతివాదులుగా చేర్చాలని నోటీసులు జారీ చేసింది.

లోతైన పరిశీలన జరపండి

వైసీపీ హయాంలో రాష్ట్రంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై లోతైన పరిశీలన చేయాలని సుప్రీంకోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అక్రమ తవ్వకాలకు సంబంధించి అన్ని రకాల ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిగణలోకి తీసుకొని నష్టం అంచనాలపై రెండు వారాల్లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని కోరింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో 2021-24వరకు 2,743 హెక్టార్ల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని ప్రభుత్వం సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. సగటున ఒక మీటర్‌లోతున అక్రమ తవ్వకాలు జరిగినట్లు పేర్కొంది. ఈ లెక్కలపై సుప్రీం కోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. దీనిపై కోర్టు స్పందిస్తూ.."పిటిషనర్ నాగేంద్రకుమార్ సమర్పించిన అఫిడవిట్‌లో 6,500 హెక్టార్లలో అక్రమ తవ్వకాలు జరిగాయని ఉంది. 2,743 హెక్టార్లలోనే తవ్వకాలు జరిగాయని ప్రభుత్వం అంటోంది. రెండింటి మధ్య ఇంత తేడా ఎందుకు?" అని సుప్రీంకోర్టు రాష్ట్ర సర్కారును ప్రశ్నించింది. తాము గూగుల్ ఎర్త్‌ప్రో ఆధారంగా శాటిలైట్ చిత్రాలను పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చామని ప్రభుత్వం ప్రతినిధి కోర్టుకు నివేదించారు. పిటిషనర్ కూడా గూగుల్ ఎర్త్‌ప్రో టెక్నాలజీ ఆధారంగానే అక్రమతవ్వకాలను గుర్తించారని, ఇంత వ్యత్యాసం ఎలా వచ్చిందని కోర్టు మరోసారి ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో పిటిషనర్ అఫిడవిట్‌ను పరిగణనలోకి తీసుకొని అన్ని అంశాలను పరిశీలన చేయాలని ఆదేశించింది. ఈ అంశాన్ని పర్యవేక్షించాలని కేంద్ర పర్యావరణ, అటవీశాఖలను ఆదేశించింది. వాదనల సందర్భంగా ఇసుక అక్రమ తవ్వకాలదారుల నుంచి రికవరీ అంశం ఎంతవరకు వచ్చిందని బెంచ్ ప్రశ్నించింది. జరిమానా చెల్లించకుండా హైకోర్టుకు వెళ్లిన అక్రమ ఇసుకదారుల కేసులో రెండు వారాల్లోగా తీర్పు వెల్లడించాలని హైకోర్టుకు సూచించింది. ఇదే అంశంపై ప్రభుత్వం స్పందిస్తూ.. బాధ్యులైన కంపెనీలు, వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని తెలిపింది. దీనిపై న్యాయమూర్తులు తీవ్రంగా స్పందించారు. "గత కొంతకాలంగా ఇదే మాట చెబుతున్నారు. నోటీసులు ఇవ్వడమేనా? రికవరీ చేయడం ఉందా?" అని గట్టిగా ప్రశ్నించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారని కోర్టు ప్రశ్నించింది.

తుంగభద్ర డ్యామ్‌లో పియర్స్ బీటలు ఆందోళనకరం

» కొత్త గేట్ల అమరికతోపాటు, పగుళ్లకూ మరమ్మతులు చేయండి

» పనుల్లో జాప్యాన్ని సహించేది లేదు

» బోర్డు సమావేశంలో చైర్మన్ పాండే

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యామ్ గేట్లను మార్చే సమయంలో బయటపడ్డ పియర్స్ బీటలపై బోర్డు చైర్మన్ ఎస్ఎన్ పాండే తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో తుంగభద్ర గేట్లను బిగించడం, పియర్స్ వద్ద ఏర్పడ్డ బీటలకు మరమ్మతు చేయడంపై ప్రత్యే దృష్టి సారించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గత నెలలో చైర్మన్ పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో ఏపీ జల వనరుల శాఖ ఈఎన్‌సీ నరసింహమూర్తి, తెలంగాణ నీటిపారుదల శాఖ, తుంగభద్ర బోర్డు చీఫ్ ఇంజనీర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తుంగభద్ర డ్యామ్ గేట్ల బిగింపులో చాలా బాలారిష్టాలు ఎదురయ్యాయని కాంట్రాక్టు సంస్థ వెల్లడించింది. 'నిధుల సమస్య ప్రధానంగా ఉంది. సకాలంలో బిల్లుల చెల్లింపు జరగడం లేదు. డ్యామ్ ప్రాంగణంలోనే గేట్ల బిగింపు పనులు చేపట్టడంతో అనుమతుల కోసం తీవ్ర జాప్యం జరిగింది. జిగ్స్ బిగింపునకు, గేట్ల తయారీ మెటీరియల్ రావడానికి కూడా ఆలస్యం జరిగింది. ప్రాజెక్టు ప్రాంతంలో తరచూ భారీ వర్షాలు కురవడం వల్ల కూడా గేట్ల తయారీ పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. కర్ణాటక రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఇన్‌స్పెక్టర్ నుంచి క్లియరెన్సు రావడంలోనూ తీవ్ర జాప్యం జరిగింది. గేట్ల తయారీ, అమరికకు సంబంధించిన చర్యలు చేపట్టాం. వివిధ కారణాలతో జరిగిన ఆలస్యానికి క్షమించండి' అని కాంట్రాక్టు సంస్థ బోర్డును కోరింది. దీనిపై స్పందించిన బోర్డు చైర్మన్.. 'ఇప్పుడు క్షమాపణలు కోరడం కాదు.. భవిష్యత్తులో తుంగభద్ర ప్రాజెక్టు గేట్లను నిర్దేశిత సమయంలో బిగించేందుకు కృషి చేయండి. పాత గేట్లను తొలగించి కొత్త గేట్లను నిర్ణీత సమయంలో బిగించండి' అని నిర్మాణ సంస్థను ఆదేశించారు. తుంగభద్ర డ్యామ్ గేట్ల బిగింపునకు సంబంధించిన నిధులను విడుదల చేయించే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ తీసుకోవాలని ఆయన కోరారు. పని చేయని చెయిన్‌లను కూడా మార్చేయాలని సూచించారు. 15 రోజులకోసారి గేట్ల మార్పిడి, కొత్త గేట్ల బిగింపు సమాచారాన్ని తనకు తెలియజేయాలని, పనుల్లో నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గేట్ల అమరికలో జాప్యాన్ని సహించేది లేదని చైర్మన్ తెలిపారు.

సీసీటీవీ ఫుటేజ్‌ల తనిఖీకి సహకరించండి

» కృష్ణా, గుంటూరు ఎస్పీలకు హైకోర్టు ఆదేశం

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్లలోని డీవీఆర్‌లో నిక్షిప్తమైన సీసీటీవీ ఫుటేజ్‌ను తనిఖీ చేసేందుకు అడ్వొకేట్ కమిషనర్‌కు సహకరించాలని కృష్ణా, గుంటూరు జిల్లాల ఎస్పీలను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. ఇందుకు ఎస్పీ కార్యాలయం నుంచి అధీకృత అధికారిని సంబంధిత స్టేషన్లకు పంపించాలని స్పష్టం చేసింది. ఈ రెండు జిల్లాల్లో ఏ స్టేషన్‌కైనా వెళ్లి తనిఖీలు చేసేలా అడ్వొకేట్ కమిషనర్‌కు అనుమతిచ్చింది. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా 18 నెలల సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరచాల్సి ఉంటుందని గుర్తు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న స్టేషన్లలో రికార్డయిన ఫుటేజీని స్టోర్ చేసేందుకు ఎంత స్టోరేజీ అవసరమో చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 23కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు.. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జులై 15న ఆదేశాలిచ్చింది. ఈ ఉత్తర్వులు అమలుకాకపోవడంతో యోగేష్ కోర్టుధిక్కరణ పిటిషన్ వేశారు. మరోవైపు పల్నాడు జిల్లా, మాచవరం పోలీసులు తన సోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారని పేర్కొంటూ కటారు నాగరాజు గత ఏడాది నవంబర్‌లో హెబియస్ కార్పస్ వేశారు. ఈ పిటిషన్ల విచారణకు సందర్భంగా స్టేషన్ మొత్తం కనిపించేలా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సర్టిఫై చేస్తూ డీఎస్పీలు సమర్పించిన నివేదికలపై ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని తేల్చేందుకు అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో 6 పోలీస్ స్టేషన్లను పరిశీలించిన అడ్వొకేట్ కమిషనర్ సీసీ కెమెరాల ఏర్పాటుపై హైకోర్టుకు నివేదిక ఇచ్చారు.

భక్తుల రక్షణకు చర్యలు తీసుకోండి

అలిపిరి- తిరుమల నడక మార్గంలో జేసీ సిఫారసులు అమలు చేయండి

» టీటీడీకి హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి నుంచి తిరుమల వరకు నడక మార్గంలో భక్తుల రక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని టీటీడీని హైకోర్టు ఆదేశించింది. ఈ అంశంపై జేసీ సిఫారసులను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేసింది. భక్తుల రక్షణ అంశంపై వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్, టీటీడీ, అటవీశాఖ అధికారుల జేసీ సమర్పించిన నివేదికలో పలు సిఫారసులు చేసిందని గుర్తు చేసింది. చిరుత దాడిలో చనిపోయిన చిన్నారి తల్లిదండ్రులకు మరో రూ.15 లక్షల పరిహారం అందజేసే విషయాన్ని పరిశీలించాలని టీటీడీకి సూచించింది. తదుపరి విచారణను డిసెంబరు 24కి వాయిదా వేసింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. వన్యప్రాణుల నుంచి భక్తులను రక్షించేందుకు కాలినడక మార్గంలో ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం, టీటీడీ, అటవీశాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ ప్రస్తుత టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి 2023లో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది రేగులగడ్డ వెంకటేశ్ స్పందిస్తూ.. నడక మార్గంలో భక్తుల రక్షణపై జేసీ నివేదిక ఇచ్చిందని తెలిపారు. కమిటీ నివేదికలోని స్వల్పకాలిక సిఫారసులను అమలు చేశామని టీటీడీ తరఫు న్యాయవాది చెప్పారు. కమిటీ సూచనలు, సిఫారసులను తూచా తప్పకుండా అమలు చేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

జీఎస్టీ హేతుబద్ధీకరణతో పేదలకు ప్రయోజనం

» రాష్ట్ర ఆదాయం తగ్గినా ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది

» జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి: మంత్రి పయ్యావుల



న్యూఢిల్లీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'పన్ను తగ్గింపుతో రాష్ట్ర ఆదాయం తగ్గుతుంది. అయితే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం' అని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ అధ్యక్షతన జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పయ్యావుల పాల్గొని మాట్లాడారు. వివరాలను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'ఆహార పదార్థాలు, దుస్తులు, పాదరక్షలు, ఔషధాలు వంటి నిత్యావసరాలపై పన్ను భారం తగ్గించాలి. వ్యవసాయ ఇన్‌పుట్, పనిముట్లుపై, చేనేత వస్త్రాలపై పన్నును సరళీకరించాలి. ఇతర వస్తు-సేవలపై పన్ను భారాన్ని తగ్గించాలి' అని సమావేశంలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి తెలిపారు. 'ఆగస్టు 15న ప్రధాని మోదీ ప్రకటించిన జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణతో పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలకు విస్తృత ప్రయోజనాలు కలుగుతాయి. ప్రస్తుత బహుళ పన్ను రేట్లను 0.1%, 5%, 18%కి సరళీకరించడం, కొన్ని విలాస వస్తువులపై 40% పన్ను విధించడం వల్ల పన్నుల వ్యవస్థ పారదర్శకంగా మారుతుంది' అని పయ్యావుల పేర్కొన్నారు. కాగా, సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడుతూ, 'ఎన్డీయే మిత్రపక్షంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జీఎస్టీ సంస్కరణలకు మద్దతు ఇస్తాం. జీఎస్టీ సంస్కరణలలో చాలవరకు సామాన్య ప్రజలకు, పేదవారికి సాయం చేస్తాయి. భారత ఆర్థికవ్యవస్థ కూడా వృద్ధి చెందుతుంది' అని మంత్రి పేర్కొన్నారు.

సంస్కరణలను స్వాగతిస్తున్నాం: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సవరించిన శ్లాబులతో కూడిన జీఎస్టీ సంస్కరణలను స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఈ నిర్ణయం పేదలకు అనుకూలమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల నుంచి వ్యాపారుల వరకు సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. జీఎస్టీపై ఇలాంటి నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లకు అభినందనలు తెలిపారు.

స్థానిక శంఖారావం

» మున్సిపాలిటీ ఎన్నికలకు సిద్ధం కండి

» మున్సిపల్ శాఖకు ఎన్నికల కమిషనర్ లేఖ

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక శంఖారావం మోగనుంది. వచ్చే ఏడాది మార్చి17కి మున్సిపల్ స్థానిక సంస్థల పదవీకాలం ముగియనున్నందున ముందుగా ఎన్నికలకు సిద్ధంకావాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ... పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శికి బుధవారం లేఖ రాశారు. ఎన్నికల సన్నాహాల షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. ముందుగా పంచాయతీల అప్‌గ్రేడేషన్, సమీపంలో ఉన్న పంచాయతీలను మున్సిపల్ స్థానిక సంస్థల్లో విలీనం చేయడం తదితర కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. 123 పట్టణ స్థానిక సంస్థలకు గాను గత 2021 మున్సిపల్ ఎన్నికల్లో 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. ఆ ఏడాది మార్చి 18న మొదలైన వారి పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 17 నాటికి ముగియనుందన్నారు. రెండో విడతలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 12 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలకు ఎన్నికలు నవంబర్ 2021లో జరిగాయి. ఈ 13 స్థానికసంస్థలకు వచ్చే ఏడాది నవంబర్ 21కు గడువు ముగుస్తుందని తెలిపారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2017 ఆగస్టు-సెప్టెంబరులో ఎన్నికలు జరిగాయని, 2022 సెప్టెంబరుకు వాటి గడువు ముగిసిందని పేర్కొన్నారు. మిగిలిన శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, మంగళగిరి-తాడేపల్లితో పాటు 19 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలకు న్యాయపరమైన సమస్యల వల్ల ఎన్నికలు జరగలేదని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ చట్టం-1955 ప్రకారం సాధారణ స్థానికసంస్థల ఎన్నికలు సభ్యుల పదవీకాలం పూర్తయ్యే మూడు నెలల్లోపు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రీ ఎలక్షన్ షెడ్యూల్..

డీలిమిటేషన్, రిజర్వేషన్లు ఖరారు ప్రక్రియను అక్టోబరు 15లోగా పూర్తి చేసుకోవాలి. వార్డులవారీ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి. అక్టోబరు 16 నుంచి నవంబరు 15లోపు ఈ సన్నాహాలు పూర్తిచేయాలి. నవంబరు 1 నుంచి 15దాకా రిటర్నింగ్ అధికారులను నియమించుకోవాలి. నవంబరు 16 నుంచి పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకుని తుది జాబితా సిద్ధం చేయాలి. నవంబరు 30 లోగా ఎన్నికల కసరత్తు పూర్తి చేయాలి. రిజర్వేషన్ల ప్రక్రియను డిసెంబరు 15 లోగా పూర్తి కావాలి. డిసెంబరు చివరి వారంలో రాజకీయ పార్టీలతోను, సీనియర్ అధికారులతోను సమావేశం నిర్వహించాలి. జనవరి 2026 లోపు ఎన్నికలు నిర్వహించాలి. అదే విధంగా 2026 జనవరి నుంచి గ్రామ పంచాయతీలకు, జూలై నుంచి ఎంపీటీసీ/జడ్పీటీసీలకు ఎన్నికల ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందని నీలం సాహ్నీ తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో భారీగా నష్టపోయాం

» విద్యుత్తు కంపెనీల ప్రతినిధుల ఆవేదన

» ప్రభుత్వం సహకరిస్తే మూడేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని వెల్లడి

» పెట్టుబడిదారులకు అండగా ఉంటాం: గొట్టిపాటి

అమరావతి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ విధానాలతో గత ఐదేళ్లలో భారీగా నష్టపోయామని విద్యుత్తు కంపెనీల ప్రతినిధులు ఆవేదన వెలిబుచ్చారు. యాక్సిస్ ఎనర్జీ, సుజ్లాన్, రిలయన్స్ సంస్థల ప్రతినిధులతో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూసేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను వారు మంత్రికి వివరించారు. కూటమి ప్రభుత్వం మద్దతుతో రాబోయే మూడేళ్లలోనే సోలార్, విండ్, సీబీజీ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం గొట్టిపాటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పునరుత్పాదక రంగంలో వివిధ ప్రాజెక్టులు చేపడుతున్న పెట్టుబడిదారులకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు. సీబీజీ (కంప్రెస్డ్ బయో గ్యాస్) ప్లాంట్లను సకాలంలో ఏర్పాటు చేయాలని రిలయన్స్ ప్రతినిధులకు సూచించారు. రూ.65వేల కోట్లతో 500 సీబీజీ ప్లాంట్లను ఏర్పాటు చేసి 2.5లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రిలయన్స్ సంస్థ ముందుకు రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. తొలి దశలో ప్రకాశం, నెల్లూరు, పల్నాడు జిల్లాల్లో ప్లాంట్ల నిర్మాణం చేపడతామని, ఆ తర్వాత అన్నమయ్య, కడప జిల్లాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు రిలయన్స్ కంపెనీ ప్రతినిధులు వివరించారు. బ్రూక్‌ఫీల్డ్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఎవ్రెన్ ప్లాట్‌ఫాం ద్వారా 3వేల మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్రాజెక్టుల పనులు ప్రారంభించామని యాక్సిస్ ఎనర్జీ ప్రతినిధులు తెలిపారు. రూ.30 వేల కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టి 3,500 ఉద్యోగాలు సృష్టించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. అనంతపురం జిల్లా కుదేరు యూనిట్‌లో అధిక సామర్థ్యం కలిగిన గాలిమర టర్బైయిన్ల తయారీకి ప్లాంట్‌ను అప్‌గ్రేడ్ చేసి, 1,200 మందికి ఉపాధి కల్పిస్తున్నామని సుజ్లాన్ ప్రతినిధులు చెప్పారు. దేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఏపీలో ప్రారంభించామని తెలిపారు.



ట్రాన్స్‌కో సమీక్షా సమావేశంలో మంత్రి గొట్టిపాటి

ట్రాన్స్‌కో అధికారులతో మంత్రి సమీక్ష

రాష్ట్రవ్యాప్తంగా రూ.14962 కోట్లతో చేపట్టిన 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్లు, ఇతర ట్రాన్స్‌కో ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసి నిర్మాణ వ్యయం తగ్గించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. బుధవారం ట్రాన్స్‌కో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. నాణ్యతా లోపం లేకుండా పనులు చేపట్టాలన్నారు. రూ.6వేల కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులు 2027 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీఆర్డీయేలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థపై మంత్రి ఆరా తీశారు. విద్యుత్తు శాఖలో ఖాళీలు భర్తీ చేయడానికి సీఎం సుముఖత వ్యక్తం చేసినట్లు మంత్రి తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.